ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 10.04.2025 | సంపుటి : 11 సంచిక : 261 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV
JANAMSAKSHI

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## చైనా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం..

**20 మంది మృతి**

**బీజింగ్(జనంసాక్షి):** చైనాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. చైనాలోని ఓ నర్సింగ్ హోమ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందినట్టు తెలుస్తోంది.అయితే, అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మిగతా 9లో..




## బంగ్లాకు ట్రాన్స్‌షిప్‌మెంట్ సౌకర్యం రద్దు

**చైనాలో యూనస్ భారత వ్యతిరేక వ్యాఖ్యలపై కేంద్రం ఆగ్రహం**

**జనంసాక్షి:** షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన దగ్గరి నుంచి భారత్‌-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఇటీవల

మిగతా 2లో..



## బ్రిటీషర్ల కన్నా.. భాజపానే ప్రమాదం



### గాంధేయవాదానికి గాడ్సే వాదానికి పోటీయా?
### తెలంగాణలో అడుగుపెట్టనివ్వం : సీఎం రేవంత్

- మోడీతో దేశానికి తీవ్ర నష్టం
- రాహుల్ గాంధీ ఆదేశాలతో కులగణన చేపట్టాం
- తెలంగాణ రాష్ట్ర విముక్తికి పటేల్ కారణం
- తెలంగాణ ఇచ్చిన సోనియా ధన్యురాలు
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**అహ్మదాబాద్(జనంసాక్షి):** ప్రధాని మోదీ మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విభజించాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. మోడీని తప్పిస్తే తప్ప దేశానికి విముక్తి లేదని అన్నారు. గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పని చేస్తూ గాడ్సే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని రేవంత్ విమర్శించారు. దేశ యువత ఏకం కావాల్సిన సమయమొచ్చిందన్నారు. యువతకు గాంధీ బాటలో నడుస్తూ.. మోదీ, గాడ్సేలను ఓడించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటే ప్రధాని మోదీకి భయం.. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాడనే లోక్‌సభలో రాహుల్ గాంధీకి మైక్ ఇవ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంలో

మిగతా 2లో..

### ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు

- ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేట్ పరం
- ఎన్నికల సంస్థలు కూడా మోడీ గుప్పిటే
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో ఖర్గే

వార్త 2లో

## తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం

- సీఎం రేవంత్ రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం కావాలనే చర్యలు తీసుకోవట్లేదు
- ఈ ప్రక్రియతోనే ఆయావర్గాలకు న్యాయం
- కుటిల యత్నాలతో అడ్డుకుంటున్న బీజేపీ
- రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్న భాజాపా ఆర్ఎస్ఎస్
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సదస్సులో రాహుల్



**అహ్మదాబాద్(జనంసాక్షి):** కులగణన ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దేశమంతా కలుగణన జరగాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయా వర్గాలకు వారి హక్కులు లభించాలంటే ఎవరు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేలాల్సి ఉందన్నారు. ఏం సంస్థలలో దళితులు, ఆదివాసీలు, ఇతర వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదన్నారు. ఆదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగుల జాబితా తీస్తే కూడా ఇది తెలుస్తుందన్నారు. ఇకపోతే రాజ్యాంగమే కాంగ్రెస్ ఆత్మ అని, దానిని పరిరక్షించుకునేందుకు మనమంతా కలసి పోరాడాలని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత స్వేచ్ఛ మీద దాడి

మిగతా 2లో..

## విభజన హామీల పరిష్కారానికి కేంద్రం కసరత్తు

### అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్



**న్యూఢిల్లీ (జనంసాక్షి):** ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు,

మిగతా 2లో..

## 2035 నాటికి.. సొంత స్పేస్‌స్టేషన్

### 2040 నాటికి చంద్రుడిపైకి భారత వ్యోమగామి..

**కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డా. జితేంద్ర సింగ్ ఆశాభావం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలతో ప్రపంచానికి తన సత్తాను చూపిన భారత్.. జాబిల్లిపై సొంత వ్యోమగామిని దించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. 2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగామి కాలుమోపుతాడని

మిగతా 2లో..



## వరుసగా రెండోసారి రెపోరేటు తగ్గింపు



### 0.25 శాతం మేర సవరించిన ఆర్‌బిఐ

**గణనీయంగా తగ్గనున్న గృహ, వాహన రుణాల వడ్డీల భారం**

**ద్రవ్యపరపతి కమిటీ నిర్ణయాలు ప్రకటించిన గవర్నర్ మల్హోత్రా**

**బంగారం రుణాలపై ఆంక్షలు విధించే యోచనలో ఆర్‌బిఐ**

**ముంబై(జనంసాక్షి):** విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ మళ్లీ సవరించింది. వరుసగా రెండోసారి రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్లు- తగ్గించిన సంగతి తెలిసిందే. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు- తగ్గించినట్లు- ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపోరేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు- తగ్గించడం వల్ల.. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది. దీని వల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు. తగ్గింపు

మిగతా 2లో..

### దేశీయంగా సంస్కరణలకు ఇదే సమయం

- ట్రంప్-చైనా సుంకాల యుద్ధం పట్ల జాగ్రత్తగా ఉండాలి
- పెట్టుబడులు ఆకర్షించేలా వ్యవహరించాలి
- మాజీ ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ రాజన్

వార్త 2లో

### ద్రవ్యోల్బణం కాదు.. టారిఫ్‌లపైనే టెన్షన్



**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

**ముంబయి(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల ప్రకటనతో ప్రపంచ వాణిజ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. చైనా వంటి దేశాలు ప్రతిగా సుంకాలు వేస్తూ అమెరికాకు చిర్రెత్తిస్తుంటే.. కొన్ని దేశాలు మాత్రం సుంకాల విషయంలో అగ్రరాజ్యంతో చర్చలకు సిద్ధమవుతున్నాయి. ఈ టారిఫ్‌లపై దేశీయంగానూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు ద్రవ్యోల్బణం ఒత్తిడితో మానిటరీ పాలసీ విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తూ వచ్చిన ఆర్‌బీఐ.. ఇప్పుడు ద్రవ్యోల్బణం కంటే అమెరికా టారిఫ్‌లపై ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఈ క్రమంలోనే

మిగతా 2లో..

## పెట్రోల్ ధరలతో కేంద్రం ఆర్థిక దోపిడీ

- సెస్సు వసూళ్లతో సొంత రాజకీయ ప్రచారాలు
- సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోడీ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి కేటీఆర్ లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):** పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన

మిగతా 2లో..



## భారత్‌తో జైనానిది విడదీయలేని బంధం



### ఉగ్రవాదం లాంటి సవాళ్లకు జైనమత విలువలే సమాధానం
### మహావీర్ జయంత్యుత్సవంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత దేశానికి గుర్తింపు తీసుకురావడంలో.. జైన మతం వెలకట్టలేని పాత్రను పోషించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచానికి సవాళ్లుగా మారిన ఉగ్రవాదం, యుద్ధం,పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలకు.. జైన మత విలువలు సమాధానం ఇవ్వగలవన్నారు. నవకర మహామంత్ర దివస్ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రాచీన మతానికి చెందిన సంప్రదాయాన్ని, వారసత్వాన్ని, ప్రబోధనలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టు-బడి ఉందని మోదీ తెలిపారు. పార్లమెంట్ బిల్డింగ్ లో జైన తీర్థంకరుల విగ్రహాలు ఉన్నట్లు- చెప్పారు. జైన మతంలో ఉన్న అనేకాంతవాదం గురించి ఆయన ప్రస్తావించారు. నిజం అనేది అనేక రూపాల్లో వ్యక్తం అవుతుందన్నారు. జైన మతంలో ఒకరిపై ఒకరు ఆధారపడుతారన్న వాస్తవాన్ని

మిగతా 2లో..

### మేలో రష్యాకు మోదీ

**విక్టరీడే పరేడ్‌లో పాల్గొననున్న ప్రధాని**

వార్త 2లో

## సీనియర్ ఐఎఎస్ రోనాల్డ్ రోస్‌కు ఊరట

**తెలంగాణలో కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు**

**ఐఏఎస్ అధికారి శివశంకర్ కంటెంప్ట్ పిటిషన్ దాఖలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ రోనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. రోనాల్డ్ రోస్ తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రోనాల్డ్ రోస్.. ఏపీ

మిగతా 2లో..





## నైట్‌క్లబ్ పైకప్పు కూలి..

**79 మంది మృతి**

**160 మందికి గాయాలు**

**డొమినికన్ రిపబ్లిక్ రాజధాని సంతో డొమింగోలో ఘటన**

**సంతో డొమింగో(జనంసాక్షి)** డొమినికన్ రిపబ్లిక్ రాజధాని సంతో డొమింగోలోని ప్రముఖ జెట్ సెట్ నైట్‌క్లబ్‌లో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. సంగీత కచేరీ జరుగుతుండగా

మిగతా 2లో..

## మరోసారి డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

**158 డ్రోన్లు కూల్చామన్న రష్యా**

**కీవ్(జనంసాక్షి):** రష్యాపై డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే పెద్దసంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. ఈ కారణంగా బుధవారం తెల్లవారుజామున రష్యా దక్షిణ ప్రాంతంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. ముందుజాగ్రత్త చర్యగా రోస్తోవ్ ప్రాంతంలో డజన్ల కొద్దీ అపార్ట్‌మెంట్లలోని వారిని ఖాళీ చేయించాల్సి వచ్చిందని వివరించారు.ఈ ఘటనపై రష్యా రక్షణ మంత్రిత్వశాఖ టెలిగ్రామ్‌లో స్పందించింది. రాత్రికి రాత్రే 158 ఉక్రెయిన్

మిగతా 2లో..





## నాతో బేరానికి ఎంతకైనా దిగజారుతున్నారు

**దేనికైనా రెడీ అంటున్నారు..**

**టారిఫ్ దేశాలపై ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** సుంకాల దెబ్బకు విలవిలలాడుతున్న దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో తనతో సంప్రదింపులు జరిపేందుకు కొన్ని దేశాలు తీవ్రంగా

మిగతా 2లో..

### భారత్‌కు మరో టెన్షన్..

**ఫార్మారంగంపై సుంకాలకు ట్రంప్ సిద్ధం..!**

వార్త 2లో

## ముంచుకొస్తున్న ట్రేడ్ వార్



### అమెరికా ఉత్పత్తులపై చైనా సుంకం .. 84%

**ఆ దేశంపై ట్రంప్ సుంకాలను 104 శాతానికి పెంచిన నేపథ్యంలో బీజింగ్ ప్రతీకార నిర్ణయం**

**బీజింగ్(జనంసాక్షి):** ట్రేడ్ వార్‌లో అమెరికా-చైనా ఢీ అంటే ఢీ అంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలు పెట్టిన సుంకాల యుద్ధాన్ని చైనా కూడా అదే స్థాయిలో తిప్పి కొడుతోంది. డ్రాగన్ దేశం నుంచి వచ్చే వస్తువులపై ట్రంప్ 104 శాతం సుంకం విధించిన నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై తాము 84 శాతం సుంకం విధిస్తున్నట్లు బీజింగ్ తాజాగా ప్రకటించింది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది.ఇటీవల చైనాపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని చైనా కూడా నిర్ణయించింది. దీంతో భగ్గుమన్న ట్రంప్.. ఏప్రిల్ 8లోగా చైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. లేకుంటే అదనంగా మరో 50 శాతం ప్రతీకార సుంకం విధిస్తానన్నారు. ఇచ్చిన గడువులోగా చైనా స్పందించకపోవడంతో గతంలో విధించిన 54 శాతానికి అదనంగా 50 శాతం జోడించడంతో సుంకాలు 104 శాతానికి చేరుకున్నాయి.అమెరికా అహంకారంతో వ్యవహరిస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని చైనా ఆరోపించింది. ప్రతిగా మరో 50 శాతం సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించింది.

## ట్రంప్ కుస్తీతో భారత్‌తో దోస్తీ

### స్వరం మార్చిన చైనా

**కలసి పోరాడాలని భారత్‌కు పిలుపు**

**పొరుగుదేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకుంటాం**

**చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రకటన**

**బీజింగ్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారు చేపట్టిన సుంకాల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు భారత్-చైనా లు కలిసి పోరాడాలని భారతదేశంలోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యూ జింగ్ పిలుపునిచ్చారు.ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారం 'ఎక్స్'లో తెలియజేశారు. 'చైనా-భారత్‌ల ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయి. తాజాగా అమెరికా అనుసరిస్తున్న సుంకాల

మిగతా 2లో..

## సీనియర్ ఐఎఎస్ రోనాల్డ్ రోస్‌కు ఊరట

ప్రభుత్వంలో ఆర్థికశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇక తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యే ముందు రోనాల్డ్ రోస్.. విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. కేటాయించిన రాష్ట్రాల్లోరిపోర్ట్ చేయాలని ఐఏఎస్ అధికారులను గతేడాది అక్టోబర్‌లో డీవోపీటీ- ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులపై క్యాట్, హైకోర్టును ఆశ్రయించినా ఆయా ఐఏఎస్‌లకు ఊరట దక్కలేదు. దీంతో తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాల్సిన వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు. వెంటనే ఏపీలో రిపోర్ట్ చేశారు. మొత్తానికి ఏడు నెలల తర్వాత క్యాట్‌లో రోనాల్డ్ రోస్‌కు ఊరట దక్కింది. తెలంగాణలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.మరోవైపు ఐఏఎస్ అధికారి శివశంకర్ క్యాట్‌లో కంటెంప్ట్ పిటిషన్ దాఖలు చేశారు. క్యాట్ ఆదేశాలను డీవోపీటీ అమలు చేయడం లేదని పిటిషన్ వేశారు. శివశంకర్‌ను ఏపీకి కేటాయించాల్సిందిగా డీవోపీటీని ఫిబ్రవరి 28న క్యాట్ ఆదేశించింది. నాలుగు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయాలంది. డీవోపీటీ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో శివశంకర్ మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. అయితే, ఉత్తర్వులు అమలు చేయడానికి డీవోపీటీ గడువు కోరింది. నాలుగు వారాల్లోగా ఉత్తర్వులు జారీ చేయాలని డీవోపీటీని మరోసారి క్యాట్ ఆదేశించింది.

## భారత్‌తో జైనానిది విడదీయలేని బంధం

గుర్తింపు ఉందని, అందుకే వాళ్లు స్వల్ప స్థాయిలో కూడా హింసను ఆమోదించరన్నారు. శాంతి, సామర్యం, పర్యావరణ పరిరక్షణలో ఇదే కీలకం అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి జైన సాహిత్యం వెన్నుముకగా నిలుస్తుందన్నారు.

## బంగ్లాకు ట్రాన్స్‌షిప్‌మెంట్ సౌకర్యం రద్దు

చైనా పర్యటనలో బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యల వేళ కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఆ దేశానికి ఉన్న ట్రాన్స్ షిప్‌మెంట్ సౌకర్యాన్ని రద్దుచేసింది.కొన్నిరోజుల క్రితం చైనా పర్యటనకు వెళ్లిన యూనస్ భారత్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మననేతల ఆగ్రహానికి కారణమయ్యాయి. "భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు పూర్తిగా భూపరివేష్టితమైవున్నందున బంగాళాఖాతానికి మేమే సంరక్షకులం. ఇదొక పెద్ద ప్రయోజనాలకు అవకాశం కల్పిస్తోంది. అందుకే మా దేశంలో పెట్టుబడులు పెట్టండి" అని యూనస్ చైనాను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బంగ్లా ఎగుమతుల నిమిత్తం 2020లో ఇచ్చిన ట్రాన్స్‌షిప్‌మెంట్ సదుపాయాన్ని రద్దు చేస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ ఉత్తర్వులు ఇచ్చింది. "జూన్ 29, 2020 తేదీన ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించడమైనది. అయితే భారత్‌లోకి ఇప్పటికే ప్రవేశించిన కార్గో రవాణాకు అనుమతి ఉంది" అని పేర్కొంది. 2020 ఉత్తర్వుల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన ఎగుమతులు భారత్ మీదుగా (భూ, జల, వాయు మార్గాల్లో) నేపాల్, భూటాన్, మయన్మార్ వెళ్లడానికి అనుమతి ఉంది. ఇప్పుడు దీనిని రద్దు చేయడం వల్ల భారత్‌కు ప్రయోజనం చేకూరనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. టెక్స్‌టైల్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.ఇక యూనస్ వ్యాఖ్యలకు జై శంకర్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. బంగాళాఖాతంలో భారత్‌కు పొడవైన తీర రేఖ ఉందని గుర్తుచేశారు. తర్వాత ప్రధాని మోదీ- యూనస్ భేటీ కూడా జరిగింది. అక్రమ వలసలు, మైనార్టీలపై దాడులు, హసీనా అప్పగింత అంశాలు వారిద్దరి మధ్య చర్చకు వచ్చాయి.

## వరుసగా రెండోసారి
# రెపోరేటు తగ్గింపు

నిర్ణయానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించ నున్నాయి. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించొచ్చని కూడా గవర్నర్ అభిప్రాయపడ్డారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు-6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధిరేటు వరుసగా 6.6శాతం, 6.3శాతం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4శాతానికి దిగి రావొచ్చని అంచనా. త్రైమాసికాల వారీగా 3.6శాతం, 3.9శాతం, 3.8శాతం, 4.4శాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వీటితో రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఇకపోతే బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి నిబంధనలు కఠినతరం కానున్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి రుణ జారీ సంస్థల షేర్లు భారీగా క్షీణించాయి. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవల విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకొనేందుకు ఆర్‌బీఐ చర్యలకు సిద్ధమవుతోందని కొన్నిరోజుల క్రితమే వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్‌బీఐ తాజాగా స్పందించింది. వివిధ రకాల నియంత్రణ సంస్థలు అనుసరిస్తున్న మార్గదర్శకాలను సమన్వయం చేయడంతో పాటు, సాధ్యమైనంత వరకు రిస్క్ తగ్గించేందుకు త్వరలో సమగ్ర నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది.

## ద్రవ్యోల్బణం కాదు.. టారిఫ్‌లపైనే టెన్షన్

2025-26 ఆర్థిక సంవత్సరానికి తన వృద్ధి అంచనాలను 20 బేసిస్ పాయింట్లను తగ్గించి 6.5 శాతానికి పరిమితం చేసింది. దేశ ఆర్థిక వృద్ధిపై సుంకాల ప్రభావంపై ఆందోళన చెందుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఎంపీసీ నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలను 20 బేసిస్ పాయింట్లు తగ్గించామన్నారు. భౌగోళికంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత వాణిజ్య యుద్ధ భయాలు, ముఖ్యంగా అమెరికా నుంచి సుంకాల పెంపు కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు. దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినప్ప టికీ.. బాహ్య కారకాల మన దేశ ఎగుమతులు, ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. వృద్ధిని, ద్రవ్యోల్బణాన్ని సమర్థంగా నిర్వహించడానికి ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్నట్లు మల్హోత్రా చెప్పారు. ద్రవ్యోల్బణం లక్షిత స్థాయిలోనే ఉందన్నారు. ప్రపంచ వాణిజ్యం మరిన్ని అవాంతరాలు ఎదుర్కొంటే ఆ మేర మన దేశ వృద్ధిపై ప్రభావం పడుతుందన్నారు. డాలరుతో రూపాయి విలువ క్షీణత గురించి కూడా మల్హోత్రా మాట్లాడారు. ప్రస్తుత వాణిజ్య యుద్ధ భయాలు, ఇతర దేశాల కరెన్సీతో పోలిస్తే మన రూపాయి విలువ స్థిరంగా ఉందన్నారు.

## దేశీయంగా సంస్కరణలకు ఇదే సమయం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న వాణిజ్యయుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు తలపడినప్పుడు వాణిజ్యంలో కొంత అస్థిరత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్ చేసుకొందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. భారత్ చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెరిగేలా.. ఎగుమతులకు ప్రోత్సాహం లభించేలా అమెరికాతో వాణిజ్య చర్చలు జరపాలని అన్నారు.

# బ్రిటీషర్ల కన్నా భాజపానే ప్రమాదం

మోదీకి, అమిత్ షాకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. నెహ్రూ నేతృ త్వంలో పటేల్ నిజాం నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియాగాంధీ.. దేశాన్ని విభజించడమే మోదీ లక్ష్యం అందుకే తెలంగాణలో బీజేపీని, మోదీని అడుగు పెట్టనివ్వం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తుంది.దేశ యువత ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన -టైం వచ్చిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే అని గర్వంగా తెలిపారు. రాష్ట్రంలోని కుల గణనను తాము విజయవంతంగా పూర్తి చేశామని, అదే తరహాలో దేశవ్యాప్తంగా కూడా జనాభా గణనతో పాటు కుల గణన జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం 21 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేశామని వెల్లడించారు. రైతులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయం ఎంతో



ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపాలనలో దేశానికి అభివృద్ధి కన్నా మోసం ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. రాహుల్ గాంధీతో కలిసి గాంధీ పరివారమంతా పనిచేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, నైతికత కోసం పోరాడే నాయకుడిగా రాహుల్ గాంధీని ఆదరించాలని కోరారు. కాగా మోడీ పరివారాన్ని గాడ్సే పరివారంగా అభివర్ణించి తీవ్ర విమర్శలు చేశారు. బ్రిటిష్ వాళ్లు ఎలా దేశ సంపదను లూటీ చేశారో, అదే బాటలో బీజేపీ నాయకులు కూడా నడుస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ఆస్తులు ప్రైవేటు కార్పొరేట్‌లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. వచ్చే రోజుల్లో దేశం మీద విపరీతంగా పెరుగుతున్న బీజేపీ చెరను తొలగించాలన్న బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ అడుగుపెట్టనివ్వకపోవడం తమ గెలుపు సూచిక అని పేర్కొన్నారు.

## తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం

చేస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన 84వ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగం, మన ఐడియాలజీ అని, దానిని మనమే కాపాడుకోవాలన్నారు. కాంగ్రెస్ ఐడియాలజీ రాజ్యాంగమని.. అందుకే బీజేపీ ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు మన రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఇది తన బాధ్యత అన్నారు. బీజేపీ తమ వ్యవస్థ మీద దాడి చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణాలో కులగణ అంశంపై స్పందించారు. కులగణనపై మంచి స్పందన వచ్చిందన్నారు. మైనార్టీలు, ఆదివాసులు, గిరిజనుల కోసం కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. జాతీయ జన గణన చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. తెలంగాణలో కుల గణనపై రేవంత్ రెడ్డి నాకు వివరించారు. తెలంగాణలో ఓసీలు, బీసీలు మైనార్టీలు ఎంత అనేది తేలింది. తెలంగాణ లో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం. దేశానికే ఆదర్శంగా నిలిచాం. రాష్ట్రంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసులకు సరైన ప్రాతినిధ్యం లేదని స్పష్టమైంది. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం' అని రాహుల్ గాంధీ అన్నారు. దేశ జనాభాలోని 90 శాతం మంది జనాభాకు సరైన ప్రాతినిధ్యం లేదు. 90 శాతం మంది జనాభా అవకాశాలను లాగేసుకున్నారు. మీరందరూ లేకుండానే భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ చేయగలడా? అని ప్రశ్నించారు. మహాత్మ గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, అంబేద్కర్, గురునానక్, కబీర్ ఆలోచనల రూపం భారత రాజ్యాంగం అని రాహుల్ గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల నాటి పుస్తకంగా భావించరాదని.. వేలాది సంవత్సరాలుగా భారత దేశ ప్రజల ఆలోచన విధానమే భారత రాజ్యాంగం అని స్పష్టం చేశారు. రాజస్థాన్ లో సీఎల్పీ నేత దళితుడని.. గుడిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఆయన గుడికి వెళ్లిన పాపానికి గుడిని శుభ్రం చేశారని అన్నారు. ఇది బిజెపి ఆలోచనా విధానామని, కానీ తమ కార్యకర్తలు దళితులు, ఆదివాసులు అందరికీ గౌరవం ఇస్తారని చెప్పారు. దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్స్‌రే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా అనే ప్రశ్న

## ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్ అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ-(ఏఐసిసి) సమావేశాలు జరుగుతున్నాయి. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ప్రభుత్వ రంగ కర్మాగారాలను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలనుకుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు. నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియంత్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇవిఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఇవిఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు.భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించనీయలేదు.

## విభజన హామీల పరిష్కారానికి కేంద్రం కసరత్తు

ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది.విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది.

## 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డా. జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ ఆంగ్ల ఛానల్ ఏర్పాటు చేసిన 'రైజింగ్ భారత్ సమ్మిట్ 2025'లో ఆయన పాల్గొన్నారు. భారత అంతరిక్ష భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు. భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రం 'భారత్ స్పేస్ స్టేషన్'ను 2035 నాటికి సమకూర్చుకుంటుందని ఆయన వెల్లడించారు. ఇక చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విషయం తెలిసిందే. భారత వైజ్ఞానిక సత్తాను ఇది ప్రపంచానికి చాటింది. దీంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరుకున్న తొలి దేశంగా రికార్డు సృష్టించింది. ఇప్పుడు చంద్రయాన్-4పై దృష్టిసారించింది. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని 2027లో చేపట్టనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎల్‌వీఎం-3 రాకెట్‌ను కనీసం రెండుసార్లు ప్రయోగించి.. చంద్రయాన్-4 మిషన్‌కు సంబంధించిన ఐదు భిన్న భాగాలను నింగిలోకి పంపిస్తారు. వాటిని కక్ష్యలోనే బిగిస్తారు. చంద్రుడిపైకి భారత వ్యోమగామిని పంపించేంతవరకు చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలు కొనసాగుతూనే ఉంటాయని ఇస్రో ఇప్పటికే వెల్లడించింది. ఇక భారత తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌ను వచ్చే ఏడాది చేపట్టనున్నారు.

## డ్రోన్లతో మరోసారి విరుచుకుపడ్డ ఉక్రెయిన్

డ్రోన్లను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చివేశాయని ప్రకటించింది. ఇందులో రోస్తోవ్ ప్రాంతంలోకి చొచ్చుకొచ్చిన 29 డ్రోన్లు కూడా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ దాడి ఘటనలో ఎవరైనా గాయపడ్డారా అనే విషయం తెలియరాలేదు. అయితే.. రోస్తోవ్ ప్రాంతంలో 48 అపార్ట్‌మెంట్ వాసులను ఖాళీ చేయించామని ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. 158 డ్రోన్లను కూల్చినట్లు రష్యా అధికారులు వెల్లడించినప్పటికీ.. అసలు ఉక్రెయిన్ ఎన్నింటిని ప్రయోగించిందన్న విషయంపై మాత్రం సమాచారం లేదు. కూల్చివేసిన డ్రోన్లలో రష్యాలోని క్రాస్నోడర్ ప్రాంతంలో 69.. ఉత్తర ఒస్సేటియా ప్రాంతంలో 15 డ్రోన్లు ఉన్నట్లు తెలిపింది. అయితే.. ఈ దాడులపై ఉక్రెయిన్ నుంచి వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. యుద్ధంలో ఇరువైపులా కీలక మౌలిక సదుపాయాల విధ్వంసమే లక్ష్యంగా ఇలాంటి దాడులు జరుగుతున్నాయి.మరోవైపు రష్యా తరఫున యుద్ధంలో చైనీయులు పాల్గొంటున్నట్లు ఉక్రెయిన్ ఆరోపించింది. కీవ్ (%ఖఎతీఱఅఎవ%)తో మాస్కో చేస్తున్న పోరాటంలో చైనా పౌరులు పాల్గొన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ (%ఎశీశ్రీశీఎఎఎతీ వశ్రీవఅఎఎ%) ఆరోపణలు చేశారు. తమ బలగాలు ఇద్దరు చైనీయులను అదుపులోకి తీసుకున్నాయని ఓ వీడియోలో ఆయన పేర్కొన్నారు. రష్యా (%=బంంఖ%) సైన్యంతో కలిసి పోరాడుతున్న ఇద్దరు చైనీయులను డోనెట్స్క్ ప్రాంతంలో తమ దళాలు బంధించాయని తెలిపారు. వారి వ్యక్తిగత డేటా, బ్యాంకు కార్డులతో సహా ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## మేలో రష్యాకు మోదీ..

**మాస్కో(జనంసాక్షి):** రష్యా ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోదీని మాస్కోలో మే 9న జరగబోయే విజయ దినోత్సవ (విక్టరీ డే) పరేడ్‌కు ఆహ్వానించింది .రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ సాధించిన విజయానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 80వ విజయదినోత్సవ వార్షికోత్సవం జరగనుంది.ప్రధాని మోదీని తమ దేశానికి ఆహ్వానిస్తున్నట్లు రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆండ్రీ రుడెంకో తెలిపారు. రష్యా రాజధాని మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో జరిగే ఈ వేడుకలో భారత ప్రధాని పాల్గొనే అవకాశం ఉందని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని రుడెంకో తెలిపారు. 2024 జులైలో ప్రధాని మోదీ రష్యాలో పర్యటించారు. ఇప్పుడు ఐదేళ్ల తరువాత మరోమారు మోదీ రష్యాకు వెళ్లనున్నారు. ఈ ఆహ్వానం భారత్-రష్యా లమధ్య దీర్ఘకాల స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశంగా చూడవచ్చని విశ్లేషకులు అంటున్నారు. అయితే ప్రధాని మోదీ రష్యా పర్యటన గురించి భారత ప్రభుత్వం నుండి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.రష్యాలో నిర్వహించే విజయ దినోత్సవం ఆ దేశంలో జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ వేడుకలలో ఒకటి. ఈ సందర్భంగా సైనిక పరేడ్, యుద్ధ వీరులకు సన్మానం, చారిత్రక ఘటనలను స్మరించుకునే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ వేడుకలకు అంతర్జాతీయ నేతలను ఆహ్వానించడాన్ని రష్యా తన సంప్రదాయంగా కొనసాగిస్తోంది. 2005లో భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రష్యా విజయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

# నాతో బేరానికి ఎంతకైనా దిగజారుతున్నారు

ప్రయ త్నిస్తున్నాయని..ఈ క్రమంలో ఎంతకైనా దిగజారడానికి సిద్ధంగా ఉన్నాయంటూ తీవ్ర పదజాలం ఉపయోగించారాయన.నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెసెషనల్ కమిటీలో ట్రంప్ మాట్లాడుతూ.. ఏరకంగా చూసుకున్నా పార్లమెంట్ కంటే నేనే మెరుగైన మధ్యవర్తిని. అందుకే ఆయా దేశాలు నాకే ఫోన్లు చేస్తున్నాయి. సుంకాల విషయంలో ఊరట కోసం బతిమాలుకుంటున్నాయి.(ఈ క్రమంలోనే అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు). ప్లీజ్ సర్.. మాతో ఒప్పందం చేసుకోండి అంటూ వేడుకుంటున్నాయి. ఏమైనా చేస్తామంటూ దిగజారిపోతున్నాయి" అని వ్యాఖ్యానించారాయన. అలాగే..సుంకాల దేశాలతో ఒప్పందం కోసం పార్లమెంట్‌ను అనుమతించాలని కొందరు రిపబ్లికన్ పార్టీలో కొందరు రెబల్ నేతలు కోరుతున్నారు. అదే జరిగి ఉంటే.. చైనా మీద ఇవాళ 104 శాతం సుంకాలు విధించాల్సి వచ్చేది కాదు. చైనా ఎంతో సంతోషంగా ఉండి ఉండేది. పైగా అమెరికానే సుంకాలు చెల్లించాల్సి వచ్చేది. పైగా మన దేశాన్ని అమ్ముకోవాల్సి వచ్చేది. కాబట్టి మధ్యవర్తిత్వంలో చట్టసభ సమర్థవంతంగా పని చేస్తుందని నేను అనుకోను. ఇక్కడ ఒక విషయం చెప్పదల్చుకున్నా.. నాలా మీరెవరూ మధ్యవర్తిత్వం వహించలేరు" అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

## భారత్‌కు మరో టెన్షన్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. అతి త్వరలోనే ఫార్మా రంగంపై టారిఫ్‌లు విధించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు ఆ ఒక్క రంగాన్ని ఆయన మినహాయిస్తూ వచ్చారు. రిపబ్లికన్ల డిన్నర్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఫార్మారంగంపై టారిఫ్‌లు ఉండనున్నాయి. ఎందుకంటే మనం సొంతంగా ఔషధాలను తయారుచేసుకోము. అవి ఇతర దేశాల నుంచి ఇక్కడికి దిగుమతి అవుతాయి. ఆ రంగంపై మనం విధించనున్న సుంకాలు చూసి కంపెనీలు ఇక్కడే తమ ఫ్యాక్టరీలు పెట్టేం దుకు ముందుకొస్తాయి. ఎందుకంటే అమెరికా చాలా పెద్ద మార్కెట్. అతి త్వరలోనే ఫార్మాపై ప్రధాన టారిఫ్‌ను ప్రకటిస్తాను. దానిని చూసి కంపెనీలు చైనా, ఇతర దేశాలను వీడతాయి. ఎందుకంటే వాటి ప్రధాన ఉత్పత్తులు ఇక్కడే అమ్ముడవుతాయి" అని ట్రంప్ వెల్లడించారు.భారత్‌లోని ఫార్మా సంస్థలు జనరిక్ ఔషధాలను తయారుచేసి అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. అక్కడి ఆరోగ్య వ్యవస్థలో ఇవి కీలక పాత్రను పోషిస్తున్నాయి. మన దేశంలో తయారయ్యే 40 జనరిక్ ఔషధాలు అమెరికాకే వెళతాయి. 2024 సంవత్సరంలో దాదాపు 8 బిలియన్ డాలర్ల మేరకు ఈ రంగం నుంచి ఎగుమతులు జరిగాయి. ఈ నేపథ్యంలో భారత ఫార్మా రంగంపై ట్రంప్ టారిఫ్‌లు విధిస్తే కచ్చితంగా దాని ప్రతికూల ప్రభావం అమెరికాలోని వినియోగదారులపైనా పడనుంది. అక్కడి ప్రజలు మన దేశం నుంచి వచ్చే చౌక జనరిక్ ఔషధాలను వినియోగిస్తారు. ట్రంప్ నిర్ణయంతో వీటి ధరలు గణనీయంగా పెరగనున్నాయి. ఇది ఆరోగ్యరంగంలో ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది.మరోవైపు ఇప్పటికే జనరిక్ ఔషధాల తయారీలో లాభాలు అతి తక్కువగా ఉంటున్నాయి. దీనికి టారిఫ్‌లు కూడా తోడైతే.. భారత్‌లోని తయారీదారులకు ఇబ్బందులు ఎదురుకావచ్చు. అంతేకాదు.. తయారీదారులకు ఔషధాల కొరత, లాభదాయకత తగ్గడం వంటివి ఎదురుకావచ్చని అంచనా వేస్తున్నారు. ఔషధ రంగంలో చైనా కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే ఆ దేశంపై 104శాతం సుంకాలను ట్రంప్ విధించారు. ఈ నేపథ్యంలో ఫార్మాపై సుంకాలు అమల్లోకి వస్తే డ్రాగన్ పరిస్థితి దారుణంగా తయారవుతుంది.

## ట్రంప్ కుస్తీతో భారత్‌తో దోస్తీ

దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ప్రపంచంలోని రెండు అతిపెద్ద, అభివృద్ధి చెందుతున్న దేశాలు(భారత్-చైనా) కలిసి పోరాడాలని, ఈ కష్టాలను అధిగమించాలని అని యూ జింగ్ పేర్కొన్నారు. చైనా నుంచి వచ్చిన ఈ పిలుపు అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో రావడం విశేషం.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏప్రిల్ 7న చైనాపై 104 శాతం సుంకాలను విధిస్తామని ప్రకటించారు. ఇవి ఏప్రిల్ 9 నుండి అమలులోకి రానున్నాయి. దీనికి ప్రతిగా చైనా కూడా అమెరికా వస్తువులపై 34 శాతం అదనపు సుంకాలను విధించింది. ఈ సుంకాల యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా తాజాగా చైనా.. భారత్‌కు ఈ ప్రతిపాదన చేయడానికి కారణం భారతదేశం- చైనా రెండూ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెరికా విధిస్తున్న ఏకపక్ష సుంకాల నుండి రక్షణ పొందేందుకు పరస్పర సహకారాన్ని ఆశిస్తూ చైనా ఈ విజ్ఞప్తి చేసివుండవచ్చు.అయితే భారత్.. చైనా పిలుపుపై ఇంకా అధికారికంగా స్పందించలేదు. భారతదేశం ప్రస్తుతం అమెరికాతో వాణిజ్య ఒప్పంద చర్చల్లో ఉంది. ట్రంప్ విధించిన 26 శాతం సుంకాలకు ప్రతీకార సుంకాలు విధించకూడదని నిర్ణయించిందని తెలుస్తోంది. అలాగే భారతదేశం అమెరికా నుండి వచ్చే 23 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులపై సుంకాలను తగ్గించే అవకాశం ఉందనే అంచనాలున్నాయి. అయితే చైనా.. భారతదేశాన్ని తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు, సరిహద్దు వివాదాలు ఉన్నప్పటికీ, ఈ సుంకాల సమస్యపై సహకారం ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూర్చవచ్చని చైనా వాదిస్తోంది.

## నైట్‌క్లబ్ పైకప్పు కూలి.. 79 మంది మృతి

నైట్‌క్లబ్ పైకప్పు అకస్మాత్తుగా కూలిపోయింది.ఈ ఘటనలో 79 మంది వరకు మరణించారని, 160 మందికి పైగా జనం గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ సంగీత కచేరీని వీక్షించేందుకు సుమారు 600 మంది హాజరైనట్లు తెలుస్తోంది.స్థానిక రెస్క్యూ బృందాలు అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటనలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో మరణించిన వారిలో డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మాజీ బేస్‌బాల్ ఆటగాళ్లు ఎమిలియో బోనిఫాసియో, లూయిస్ రామిరెజ్ కూడా ఉన్నారు. అలాగే ఒక ప్రావిన్స్ గవర్నర్ కూడా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ఈ సంగీత కచేరీకి హాజరైన వారిలో ప్రముఖులు, స్థానిక నేతలు ఉన్నట్లు సమాచారం.నైట్ క్లబ్ పైకప్పు కూలిపోవడానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. అధిక జనసమూహం కారణంగా భవనంపై ఒత్తిడి పెరిగి పైకప్పు కూలివుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అధికారులు ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు. నైట్‌క్లబ్ యాజమాన్యంతో పాటు స్థానిక నిర్మాణ అధికారులను ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియా వైరల్ అవుతున్న ఒక వీడియోలో కచేరీ జరుగుతున్న సమయంలో పైకప్పు కూలిన దృశ్యం స్పష్టంగా కనిపిస్తున్నది.ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పైకప్పు కుప్పకూలడం ఆ వీడియోలో రికార్డ్ అయింది. ఈ దృశ్యాలు చూసిన వారు ఘటన తీవ్రతను అర్థం చేసుకోగలుగుతారు. డొమినికన్ రిపబ్లిక్ ప్రభుత్వం ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపింది. ఈ దుర్ఘటన సందర్భంగా దేశవ్యాప్తంగా సంతాప దినం ప్రకటించారు. బాధితులకు సహాయం చేయడానికి అత్యవసర నిధులను కేటాయించారు.

## పెట్రోల ధరలతో కేంద్రం ఆర్థిక దోపిడీ

న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడు తుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై కేంద్ర పెట్రోలియం,సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్‌పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీ-ఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే జేఏసీ లక్ష్యం

- జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- 37 డిమాండ్లతో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుకు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావుకు వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే జేఏసీ లక్ష్యం అని జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. ఉద్యోగుల సమస్యలను సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం పరిష్కరించేలా ప్రయత్నం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కార్యాలయంలో బుధవారం జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన 37 ప్రధాన సమస్యలపై జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధి బృందం క్యాబినెట్ సబ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు కె.కేశవరావుకు వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వినతి పత్రం అందించారు. జేఏసీ వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన కేశవరావు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే నిర్వహించనున్న క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జీఏడీ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావుకు కూడా 37 సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జేఏసీ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ, టీఏపీయూఎస్ ప్రెసిడెంట్ హన్మంత్ రావు, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ దర్శన్ గౌడ్, టీఈఏ ప్రెసిడెంట్ డా.జి.నిర్మల, టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేష్ పాక, ఎస్జీటీయూ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కత్తి జనార్ధన్ రావు, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుగందిని, టీజీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ మహేష్, టీజీ ఎం అండ్ హెచ్ రాబర్ట్ బ్రూస్, రీడిప్లాయిడ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ తో పాటు హెమలత, చంద్రశేఖర్ గౌడ్, కొంగల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు బీఆర్ఎస్‌లో అయోమయం

- నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఆదర్శ్ రెడ్డి నియామకం
- నియామకం తర్వాత పాదయాత్ర చేసిన ఆదర్శ్ రెడ్డి
- పాదయాత్ర ముగింపు సభలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు
- పార్టీ మారిన గూడెం మహిపాల్ రెడ్డి పేరు కుడా ప్రస్తావించని వైనం
- ఆదర్శ్ రెడ్డి సారధ్యంలో పార్టీ నడుస్తుందని క్లారిటీ ఇవ్వకపోవడంతో గందరగోళం

చాడ వేణుగోపాల్ రెడ్డి (జనంసాక్షి, ప్రత్యేక ప్రతినిధి)



పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. పార్టీ అధిష్టానం తీసుకుంటున్న నిర్ణయాలతో కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. బిఅర్ఎస్ పార్టీ నుండి గెలిచిన గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ మారినప్పటి నుండా గమ్యం లేని ప్రయాణంలా బీఆర్ఎస్ పరిస్థితి తయారైంది. బీఅర్ఎస్ బిఫామ్ మీద మూడు సార్లు గెలిచిన గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ కాంగ్రెస్ కండువా కప్పుకోవడంలో పటాన్‌చెరు ఆ పార్టీకి పెద్ద దిక్కు లేకుండా పోయింది. ఎనిమిది నెలలుగా కార్యకర్తలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మహిపాల్ రెడ్డి మళ్లీ బీఆర్ఎస్‌లోకి వస్తారని ప్రచారం చాలరోజులు సాగింది. దానికితోడు తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని ఎమ్మెల్యే సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. కానీ ఆయన బీఆర్ఎస్‌లో తిరిగి చేరలేదు.

క్షేత్రస్థాయిలో బిఅర్ఎస్ కార్యకర్తల సమన్వయం కోసం రామచంద్రపురానికి చెందిన సీనియర్ నేత వెన్నవరం అదర్శ్ రెడ్డిని ఇటీవల బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పటాన్ చెరు నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించింది. జిహెచ్ఎంసీ పరిధి భారతి నగర్ కార్పోరేటర్ సింధు భర్త వన్నెవరం అదర్శ్ రెడ్డి. దీంతో పటాన్ చెరువులో బీఆర్ఎస్ నాయకత్వ బాధ్యతలు ఆయన తీసుకున్నారని కార్యకర్తలు సంబరపడిపోయారు.

అనంతరం ఆదర్శ్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఒక రోజు పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి, సిదిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ మధుసూదన చారి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, పటాన్ చెరువు నియోజకవర్గ బిఅర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంత వరకు బాగానే ఉన్న సభ జరిగిన తీరు బిఅర్ఎస్ పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురిచేసింది. ముగింపు సభలో మూడు సార్లు బిఅర్ఎస్ పార్టీ నుండి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన గూడెం మహిపాల్ రెడ్డిని ఎవరు విమర్శించలేదు. కొత్తగా భాధ్యతలు స్వీకరించిన అదర్శ్ రెడ్డి మాత్రం మహిపాల్ రెడ్డి వ్యవహార శైలిని తప్పుట్టారు. హరీష్ రావు తన ప్రసంగంలో పార్టీ మారిన గూడెం మహిపాల్ రెడ్డి గురించి కనీసం పేరు ప్రస్తవించకుండా పల్లెత్తు మాట కూడ అనలేదు. సీఎం రేవంత్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం తప్ప, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ మార్పుపైగాని, మహిపాల్ రెడ్డి వ్యవహార శైలిని ఏమాత్రం విమర్శించలేదు. అంతేకాదు ఆదర్శ్ రెడ్డి పటాన్ చెరు నియోజకవర్గానికి సారధ్యం వహిస్తాడనిగానీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్లు, కార్యకర్తలందరూ ఆదర్శ్‌రెడ్డి నాయకత్వంలో కలిసి పనిచేయాలనిగానీ మాట వరుసకైనా చెప్పలేదు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులందరికీ స్పష్టమైన సందేశం ఇవ్వకపోవడంతో చర్చకు దారితీసింది.

బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం మహిపాల్ రెడ్డి పట్ల సానుకూల దృక్పధంతో ఉందనే సంకేతాలు ఇస్తున్నట్టు ఉందని బీఆర్ఎస్ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. భవిష్యత్తులో గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారని, వరంగల్ సభను దృష్టిలో పెట్టుకోని, స్థానికంగా కార్యకర్తలను సమన్వయం చేయడానికి కంటితుపుడు చర్యగా మాత్రమే అదర్శ్‌రెడ్డిని పార్టీ కో-ఆర్డినేటర్‌గా నియమించారని పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అర్థం చేసుకోవచ్చని గుసగుసలాడుకుంటున్నారు. పార్టీని విడిచిపెట్టివెళ్ళినా వారి వైఖరిని విమర్శించకుండా, పార్టీ కష్టసమాయాల్లో ఉన్నప్పుడు అండగా ఉన్న నిజమైన నాయకులను భరోసా,భాధ్యతను ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. పటాన్ చెరు బీఆర్ఎస్ పార్టీలో ఇదే తరహా అనిశ్చితి ఎక్కువ కాలం కొనసాగితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందనీ కార్యకర్తలు వాపోతున్నారు. మొత్తానికి పటాన్ చెరువు రాజకీయాల్లో ఎవరు ఎవరి కోసం పనిచేస్తున్నారో.. ఎవరు ఏ పార్టీలో ఉంటారో, పోతారో తెలియక కార్యకర్తలు ఆగమవుతున్నరు.

## ఏఐ గ్రాఫిక్స్‌తో ప్రభుత్వంపై విమర్శలు

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- బీజేపీది నియంతృత్వ పాలన : ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- జై భీం జై సంవిధానం ర్యాలీలో ఎమ్మెల్యే, ఎంపీలు

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)



ఏఐ గ్రాఫిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో ఆయన ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి పర్యటించారు. మందమర్రి, అమరావతి, చిర్రకుంట, బీమారం గ్రామాల్లో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. ఈ సంధ్భంగా వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చి మన ప్రాంతం లో ఉన్న ఎంపి సీట్లను తక్కువ చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, బిజెపి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర సరుకులు రేట్లు పెరిగాయన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని పెట్రోల్,గ్యాస్ రేట్లు మన దేశం లో ఉన్నాయన్నారు. ఇటీవలే గ్యాస్ సిలిండర్ ధర పెంచారని, దీంతో 150 కోట్ల భారం ప్రజలపై పడిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటిలు అమలు చేస్తున్నామన్నారు. హెచ్సీఏ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ గ్రాఫిక్స్‌తో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్ నుంచి తప్పుడు ఫోటోలు వీడియోలను తొలగించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్,బిజెపి రాష్ట్ర ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి 8 లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. గత ప్రభుత్వం లో చెన్నూరు లో ఇసుక మాఫీయా నడిచేదని, కాంగ్రెస్ వచ్చాక నిబంధనల ప్రకారం మేరకు ఇసుక రవాణా జరుగుతోందని, బాల్క సుమన్ ఎంపీ, ఎమ్మెల్యే గా ఉన్నపుడు క్యాతనపల్లి బ్రిడ్జి పూర్తి చేయలేదని, సుమన్ అనుచరులకు ఏమైనా బుద్ధి ఉందా...చేయని పనికి తాము బ్రిడ్జి పనులు చేశామని తప్పుడు మాటలు చెప్తూ పాలబిషేకాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలు చాలా ఉన్నాయి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో సింగరేణి కార్మికుల సమస్యలపై ప్రశ్నించాడని, సింగరేణి రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ సంస్థ లాభాల నుంచి ఇప్పించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామన్నారు. 8 లక్షలు ఉన్న మెడికల్ ఇన్స్యూరెన్స్ ను 10 లక్షలకు పెంచడానికి కృషి చేస్తాన్నారు.

ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ పాలన తో పార్లమెంట్ నడుపుతుందన్నారు. రాహుల్ గాంధీ కి పార్లమెంట్ మాట్లాడే హక్కు ఉన్న బిజెపి సర్కార్ మాట్లాడకుండా అడ్డుకుంటుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు రాజ్యానికి నష్టం చేసే కుట్రలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు జై బాపు,జై భీమ్ ,జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టామని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాలతో రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత పార్టీ శ్రేణుల పై ఉందన్నారు. నరేంద్ర మోదీ నియంతృత్వ పాలన పై ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు.

## మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనాలి

- కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి
- తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసి 2500 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు కోనుగోలు కేంద్రాలను అధికారులు సకాలంలో ఏర్పాటు చేయ కపోవడంతో ప్రైవేట్ వ్యాపా రులు, దళారులు, పౌల్ట్రీ నిర్వాహకులు గ్రామాల్లో తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో రై తులు నిట్ట నిలువునా దోపిడీకి గురవుతుండడంతో రైతులు నష్టపోతున్నారనీ పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను, నష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్న కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకునేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఎర్లీ బర్డ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలి

- మున్సిపల్ కమిషనర్‌లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన సిడిఏంఏ డాక్టర్ టికే శ్రీదేవి



**వరంగల్ ఎంజీఎం, ఏప్రిల్ 9(జనంసాక్షి):** ఎర్లీ బర్డ్ స్కీమ్ ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సిడిఏంఏ డా.టి కే శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కమిషనర్ లు అధికారులతో ఎర్లీ బర్డ్ స్కీమ్ అమలు పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.బల్దియా ప్రధాన కార్యాలయం నుండి కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భం గా సి డి ఏం ఏ మాట్లాడుతూ ఎర్లీ బర్డ్ స్కీమ్ లో భాగం గా ముందస్తు గా ఆస్తి పన్ను చెల్లించడం ద్వారా 5% రిబెట్ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ముఖ్యంగా గత సం. ఇట్టి స్కీమ్ ను వినియోగించుకున్న వారి పై ప్రత్యేక దృష్టి సారించి కొనసాగించేలా చూడాలని ఈ స్కీమ్ ద్వారా 30% లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక బద్ధం గా వ్యవహరించి వసూళ్లు జరిపేలా చూడాలని సి డి ఏం ఏ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు కేంద్రం 15 లక్షల వడ్డీ లేని రుణమివ్వాలి

- అబద్దాలతో మహిళలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గ్యాస్ ధరను పెంచి మహిళలపై మోదీ సర్కార్ గుదిబండను మోపింది
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** మహిళలకు స్వావలంభన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, మహిళా సంఘాలకు రూ 15 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను కేంద్ర ప్రభుత్వం అందించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు రూ. 16.5 లక్షల మేర రుణమాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మహిళలకు ఇవ్వడానికి మాత్రం మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెబుతూ మహిళలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ మహిళా సాధికారత సమాఖ్య సంఘం సభ్యులు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కేసీఆర్ హయాంలో ఎప్పుడూ తాము అబద్ధం చెప్పలేదని, మహిళా సంఘాలకు రూ 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామనే చెప్పామని, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ 20 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్నట్లు అబద్దాలు చెబుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ 5 లక్షల మేరనే వడ్డీ లేని రుణాలు ఇస్తున్నదని, కానీ అబద్దాలు చెప్పి మహిళలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రాలు ఏ చిన్న పని చేసినా కేంద్ర ప్రభుత్వం తమ భాగస్వామ్యం కూడా ఉందని చెప్పుకుంటుందని, ప్రతీ చిన్న పనికి నిధులు ఇచ్చే కేంద్ర ప్రభుత్వం మహిళలకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని నిందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ 5 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ. 15 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసి లూటీ చేసే పెద్ద పెద్ద వ్యాపారవేత్తలకు రూ 16.5 లక్షల మేర రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని, కానీ మహిళలకు మాత్రం రుణాలు ఇవ్వడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మనసు రాకపోవడం శోచనీయమని అన్నారు. నిజంగా మహిళల అభివృద్ధి పట్ల చిత్తశుద్ది ఉంటే మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రకటించాలని సూచించారు. మహిళల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాసు ధరను రూ 50 పెంచి గుదిబండను మోపిందని మండిపడ్డారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గుతుంటే ఇక్కడ పెంచడమేంటని నిలదీశారు. ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నిస్తే ప్రధాని మోదీ ఇంత గొప్పోడు అంత గొప్పోడు అని బీజేపీ నాయకులు అంటున్నారని, ఇలా ఇష్టమున్నట్లు ధరలు పెంచితే మోదీ ఎంత గొప్ప వ్యక్తి మాకేంటి అని అన్నారు. ఈ కార్యక్రమలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రూప్ సింగ్ , జాగృతి నాయకులు మర్రిపల్లి మాధవి, మహిళలు పాల్గొన్నారు

## కష్టపడి పనిచేసిన సర్పంచులపట్ల పాలకుల వివక్ష

- పెండింగ్ బిల్లులు చెల్లించకుండా వేధిస్తారా?
- తక్షణమే బిల్లులు చెల్లించండి
- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తిమ్మాపూర్, బండపల్లి(చందుర్తి మండలం), గంగ్రపల్లి (జమ్మికుంట మండలం), బల్వంతపూర్ (మల్యాల మండలం), రుద్రంగి, ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీలు మెరుగైన ర్యాంకులు సాధించడం సంతోషదాయకమని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సమయంలో పంచాయతీల అభివృద్ధి, ప్రజలక మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అహర్నిశలు కష్టపడిన మాజీ సర్పంచులపట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూపడం సహించరాని విషయం. ప్రజల కోసం అప్పులు చేసి, ఆస్తులమ్మి పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులకు ఏళ్ల తరబడి పెండింగ్ బిల్స్ చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఇకనైనా వెంటనే మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## నేషనల్ హైవే భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య...



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 9(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 163జి భూ సేకరణ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల నియోజకవర్గం పరిధిలో నేషనల్ హైవే కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసిల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో భూసేకరణ ప్రక్రియ, రైతుల భూములకు పరిహారం చెల్లింపు, తదితర వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం అదనంగా కావాల్సిన 12.38 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ, గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే భీమదేవరపల్లి, వేలేరు మండలాలకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను గురించి హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణకు కావలసిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. అదేవిధంగా ఎల్కతుర్తి జంక్షన్ నుండి ముల్కనూర్ వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల పురోగతి గురించి జాతీయ రహదారుల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పరకాల డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా

- అంతరించి పోతున్న పార్టీ కాంగ్రెస్
- హైదరాబాద్ ను మజ్లిస్ చేతిలో పెట్టేందుకు సిద్ధమైంది



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో బీజేపీని అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకుంటామంటూ రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని, కాంగ్రెస్ పార్టీ అంతరించిపోతున్న జాతిలాంటిదని, తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఎంతటి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందో 15 నెలల కాంగ్రెస్ పాలనలో అంతకు రెట్టింపు వ్యతిరేకతను మూటగట్టుకున్న విషయాన్ని రేవంత్ రెడ్డి గారు మర్చిపోయారా? తన సొంత జిల్లా మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించలేకపోయారని, సిట్టింగ్ సీటైన మల్కాజ్‌గిరి స్థానాన్ని కూడా నిలబెట్టుకో లేకపోయారని, అక్కడా కూడా బీజేపీ గెలిచింది. స్వయంగా పోటీ చేసిన కామారెడ్డిలో బీజేపీ చేతిలో ఓడిపోయి మూడో స్థానానికి పడిపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓడిపోయారు. ఎంపీ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 50 శాతానికిపైగా ప్రాతినిధ్యం బీజేపీ కలిగి ఉందనే విషయాన్ని విస్మరించొద్దని సూచించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీ చేసే అభ్యర్థులే కరవయ్యారు. దిక్కులేక హైదరాబాద్ ను మజ్లిస్ చేతిలో పెట్టేందుకు సిద్దమైందన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 ఏప్రిల్ 2025
తెలంగాణ

## ఫాసిష్టు వ్యతిరేక ప్రచారాన్ని
# ముందుకు తీసుకెళదాం

కుల నిర్మూలన ఉద్యమం( కామ్), విప్లవ సాంస్కృతి వేదిక( ఆర్ సి ఎఫ్) పిలుపు 1936లో, లాహెూర్‌లోని జాట్ పాట్ తోడక్ మండలి తన సమావేశంలో బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్‌ను మొదట ఉపన్యాసకుడిగా ఆహ్వానించారు. భారతదేశ క్రూరమైన కుల వ్యవస్థ మరియు హిందూత్వం గురించి ఆయన విప్లవాత్మక ఆలోచనలను తెలుసుకున్న తర్వాత, వారు ఆయనను లాహెూర్ సమావేశానికి ఆహ్వానించకూడదని నిర్ణయించుకున్నారు. అప్పుడు డాక్టర్ అంబేద్కర్ ఆ సమావేశంలో ఇవ్వటానికి తయారు చేసుకున్న తన ప్రసంగాన్ని "కుల నిర్మూలన" పేరుతో ముద్రించి పంపిణీ చేశారు. ఆ సమయంలో, వేల సంవత్సరాలుగా భారతదేశంలో పాతుకుపోయిన అమానవీయ కుల వ్యవస్థను కూల్చివేయకుండా నిజమైన ప్రజాస్వామ్య సమాజం ఏర్పడదని ఆయన నొక్కి చెప్పారు. దీనికోసం ఆయన భారతదేశ ప్రజలు ఇద్దరు శత్రువులతో పోరాడాలని – ఒకటి బ్రాహ్మణవాదం మరియు మరొకటి పెట్టుబడిదారీ విధానం అని తెలియజేశారు. దీనితో పాటు అంబేద్కర్ భూమి మరియు పరిశ్రమల జాతీయీకరణపై దృష్టి పెట్టారు. అమరవీరుడు భగత్ సింగ్ కూడా బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి (తెల్ల దుష్టత్వం) వ్యతిరేకంగా దాని అనుచరులైన భారత పెట్టుబడిదారీ విధానం (నల్ల దుష్టత్వం) తో పాటు పోరాడాలని మనల్ని కోరారు. నేటి దృష్టాంతంలో, ప్రజల ప్రధాన శత్రువు, ఫాసిస్ట్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) యొక్క సైద్ధాంతిక పునాది అయిన బ్రాహ్మణవాదం మనువాద/బ్రాహ్మణ హిందూత్వ రూపాన్ని సంతరించుకుని, దాని యజమానులు, నేటి ఆశ్రిత పెట్టుబడిదా రులు, మెగా–అవినీతిపరులైన అదానీ అంబానీ వంటి కార్పొరేట్ సంస్థల ఆశ్రిత పెట్టుబడి దారీ విధానానికి భారత పాలకవర్గాలు అనుచరులుగా మారుతు న్నట్లు మనం చూస్తున్నా ము. ఇది సామాన్య శ్రామిక ప్రజలను అన్ని రంగాల్లో అణచి వేస్తున్నది. నేడు, ప్రపంచంలోనే అతిపెద్ద మరియు దీర్ఘకాలంగా నడుస్తున్న ఫాసిస్ట్ సంస్థ అయిన, తీవ్ర మితవాద–కుటుంబ ప్రతిచర్యకారిగా ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్), డాక్టర్ అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, సావిత్రి బాయి ఫూలే, పెరియార్, గురు ఘసిదాస్ మరియు షహీద్ భగత్ సింగ్ వంటి వారి సమానత్వ కుల రహిత, లౌకిక, దోపిడీ రహిత సమాజం అనే ఆలోచనలపై ప్రత్యక్షంగా దాడి చేస్తున్నది. ఇది ఒక తీవ్ర మితవాద–కుటుంబ ఫాసిస్ట్ సంస్థ.కార్పొరేట్–ఆశ్రిత పెట్టుబడిదారుల మద్దతుతో, ఇప్పుడు దాని రాజకీయ సాధనం భాజాపా ద్వారా భారత రాజ్యాధికార పగ్గాలను చేజిక్కించుకుం టోన్నది. ఫలితంగా, పౌర మరియు సైనిక పరిపాలన మరియు న్యాయవ్యవస్థతో సహా అన్ని రాజ్యాధికార సంస్థలు, అలాగే దేశంలోని మొత్తం రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక మరియు విద్యా రంగాలు ఇప్పుడు ఫాసిస్ట్ శక్తుల గట్టి పట్టులో ఉన్నాయి. పౌరసత్వ సవరణ చట్టం( సిఎఏ), ఆర్టికల్ 370 రద్దు, కూల్చివేసిన బాబ్రీ మసీదు స్థలంలో రామాలయం నిర్మాణం, యూనిఫామ్ సివిల్ కోడ్, వక్ఫ్ బోర్డుపై దాడి/ ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న ఫాసిస్ట్ చర్యలు, మెజారిటీ మత హిందూ రాష్ట్రం అనే అంతిమ లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నాలు ఇప్పటికే సాధించాయి. ఇప్పటికే సృష్టించబడిన ముస్లిం వ్యతిరేక మరియు ఇస్లామోఫోబిక్ మెజారిటీ ధ్రువణతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా మరియు ముఖ్యంగా ప్రధానమంత్రి స్వయంగా రామాలయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా హిందూ రాష్ట్ర స్థాపనకు పునాది బలపడింది. భారత రాజ్యాంగం యొక్క లౌకిక స్వభావాన్ని బలహీనపరచడం , కలుషితం చేయడం ద్వారా ఆర్ఎస్ఎస్– భాజపా ఫాసిస్ట్ శక్తులు ఇప్పుడు వారి 'మిషన్ హిందూరాష్ట్ర' ఎజెండాతో వెర్రి వేగంతో ప్రయాణిస్తున్నారు.

ఈ కాషాయ ఎజెండాలో అంతర్భాగంగా, మోడీ ప్రభుత్వ తీవ్ర మితవాద– మితవాద అనుకూల, కార్పొరేట్ అనుకూల ధోరణులకు అనుగుణంగా, ప్రభుత్వ రంగ సంస్థలు సహా దేశ సంపద మరియు వనరులను క్రోనీ పెట్టుబడిదారులు అయిన/కార్పొరేట్ అదానీ–అంబానీ స్వాధీనం చేసుకుంటున్నారు. పార్లమెంటు కేవలం నిశ్శబ్ద ప్రేక్షకుడిగా మరియు ప్రజలను మోసం చేయడానికి ఒక వేదికగా మారింది. అయితే విధాన నిర్ణయాలు కార్పొరేట్ బోర్డు గదుల్లో తీసుకోబడతున్నాయి. అప్రసిద్ధ 'ఎన్నికల బాండ్ల' ద్వారా, అత్యంత మెగా–అవినీతి చెందిన కార్పొరేట్ పెట్టుబడిదారులకు మరియు పాలక బిజెపి పాలనకు మధ్య ఉన్న అపవిత్ర సంబంధం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ఫలితంగా, పెరుగుతున్న అసమానత, తీవ్రమైన నిరుద్యోగం, జీవనోపాధి మార్గాలలో తీవ్రమైన తగ్గుదల, ఆవాసాల నుండి స్థానభ్రంశం మరియు విస్తృతమైన ఆకలితో, కార్మికవర్గంలోని అత్యధికులు, రైతులు, గిరిజనులు, మహిళలు మరియు మతపరమైన మైనారిటీలు సహా అన్ని అణగారిన ప్రజలు మరింత తీవ్ర పేదరికంలోకి నెట్టబడుతున్నారు, ఈ వాస్తవాన్ని అధికారిక సంస్థలు మరియు కార్పొరేట్–కాషాయ యాజమాన్యంలోని మీడియా తెలివిగా దాచిపెడుతోన్నది.

మోడీ పాలన యొక్క ఫాసిస్ట్ విధానాలను విమర్శించిన వారిపై తమ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే హాస్యనటులు, కళాకారులు, రచయితలు, మేధావులు మరియు ప్రతిపక్ష నాయకులతో సహా అందరిపై దేశ వ్యతిరేకత మరియు రాజద్రోహం ఆరోపణలు మోపుతున్నారు. ఉపా(యూఏపిఏ) వంటి అత్యంత కఠినమైన నిరంకుశ చట్టాలను వారిపై ప్రయోగిస్తున్నారు . డాక్టర్ దభోల్కర్, గోవింద్ పన్సారే, ప్రొఫెసర్ కల్బుర్గి మరియు గౌరీ లంకేష్ వంటి వారిని, ఆర్ఎస్ఎస్ మనువాద ఫాసిస్ట్ శక్తులను ప్రతిఘటించిన వారిని సంఘీ ఫాసిస్టులు హత్య చేస్తున్నారు. దేశంలో అధికారాన్ని ఆర్ ఎస్ ఎస్ స్వాధీనం చేసుకోవడంతో పాటు, కాషాయ గూండాలు వీధుల్లో కూడా అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఔరంగజేబు వారసత్వాన్ని నాశనం చేయడానికి నాగ్‌పూర్ మరియు ఇతర ప్రాంతాలలో ముస్లిం ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఫాసిస్ట్ సంఘ్ పరివార్ మతపరమైన అల్లర్లు మరియు హింసను ఎలా సృష్టించిందో మనం ఇటీవల చూశాము.

**తుహిన్, ఎంకె దాసన్, బందు మేష్రామ్, అసిమ్ గిరి**
**(కుల నిర్మూలన ఉద్యమం మరియు విప్లవ సాంస్కృతిక వేదిక సంస్థల తరపున)**



# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ ఏపీనేనా?

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి జీవం పోస్తున్నది టీడీపీ, జేడీయూలే. 240 స్థానాలకే పరిమితమైన బీజేపీని మూడోసారి అధికారంలో నిలబెట్టడంలో ఈ రెండు పార్టీలే కీలకంగా మారాయి. ఈ రెండు పార్టీ ఎన్డీఏలో భాగస్వామ్యపార్టీలే అయినప్పటికీ ఈ రెండు పార్టీ అధినేతలు బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీని ఆ పార్టీ జాతీయ నాయకత్వం ప్రకటించాక వ్యతిరేకించారు. నితీశ్ ఎన్డీఏ నుంచి బైటికి రావడానికి కారణం కూడా అదే. ఇప్పుడు నరేంద్ర మోడీని ఆకాశానికి ఎత్తేస్తున్న ఈ ఇద్దరు నేతల్లో చంద్రబాబు గతంలో కేంద్రంలో చక్రం తిప్పానని గొప్పలు చెప్పుకున్నవారే. అలాంటి ఆయన ఇప్పుడు సైలెంట్‌గా ఉండటానికి కారణం ఏమిటి? లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలో బీజేపీ భారీ విజయాలను నమోదు చేయడం ఒకటైతే.. టీడీపీలోనే పది మంది ఎంపీలు బీజేపీ అగ్రనాయకత్వంతో టచ్‌లో ఉన్నారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

గత లోక్‌సభ ఎన్నికల్లో ఏపీలోని 25 లోక్‌సభ స్థానాలకు గాను టీడీపీకి 16, బీజేపీకి 3, జనసేనకు 2, వైసీపీకి 4 సీట్లు వచ్చాయి. ఓట్ల శాతంగా చూస్తే 37.79 శాతం ఓట్లతో టీడీపీ అన్ని సీట్లు దక్కించుకున్నప్పటికీ వైసీపీకే ఓట్ల శాతం ఎక్కువగా వచ్చింది. ఆ పార్టీకి 39.16 శాతం ఓట్లు వచ్చినా నాలుగు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. దీనికి కూటమి పార్టీల్లోని బీజేపీకి 11.28 శాతం, జనసేనకు 6.33 శాతం ఓట్లు రావడం ఆపార్టీకి కలిసి వచ్చిందని అనుకోవచ్చు. మోడీ ప్రభుత్వం మిత్ర ధర్మం పాటిస్తూనే.. తోక జాడిచ్చే భాగస్వామ్యపార్టీలైనా బొందపెట్టడానికి వెనుకాడదని గత పదేళ్ల అనుభవంలో ఉన్నది. అందుకే చంద్రబాబు తాను మోడీ కంటే సీనియర్ అని చెప్పుకున్నా, నలభై ఏళ్ల రాజకీయ జీవితం అని ప్రచారం చేసుకున్నా ఇప్పుడు ఏమీ చేయలేని స్థితి. ఎందుకంటే పదహారు మందిలో పది మంది బీజేపీతో టచ్‌లో ఉండటం చంద్రబాబును కలవరానికి గురిచేస్తున్నదని అనుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి మద్దతు విషయంలో అటు టీడీపీ, ఇటు జేడీయూలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా బీజేపీ హైకమాండ్ ప్లాన్ బీని అమలు చేస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అప్పుడే ఏపీ రాజకీయాలు చాలా మారుతాయి అంటున్నారు. ఆ మాటకు వస్తే వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల్లో మెజారిటీ ఆపరేషన్ కమల్‌కు ఆకర్షితులయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇక బీజేపీ ఏపీ భవిష్యత్తు నాయకుడిగా పవన్ కల్యాణ్ అనే ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం ఆయన జనసేన అధినేతగా ఉన్నా రానున్న రోజుల్లో బీజేపీ సీఎం అభ్యర్థిగా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. బీజేపీ దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించాలనే ప్రయత్నాలను కర్ణాటక, తెలంగాణ వరకే పరిమితం చేస్తుందని అనుకోవడానికి వీల్లేదు. కేరళ, తమిళనాడు, వాట్ నాట్ ఏపీ అన్నది ఆపార్టీ ఆలోచన. ఇదంతా చంద్రబాబు కేంద్రంలో ముఖ్యంగా మోడీతో వ్యవహరించే తీరుపైనే ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి తెలంగాణలోనే కాదు, ఏపీలోనూ బలప్రదర్శన చేయడానికి బీజేపీ అధిష్ఠానం సిద్ధపడుతున్నది. ప్రస్తుతం తెలంగాణలో కార్యాచరణ మొదలుపెట్టినా.. భవిష్యత్తులో అక్కడ కూడా ఇదే ప్లాన్ ను అమలు చేస్తుందని రాజకీయవర్గాల్లో జరుగుతున్న చర్చ.



**- ఆసరి రాజు,**
ఇండిపెండెంట్ జర్నలిస్ట్




# ఇక మెడిసిన్ మీద ట్రంప్ టారిఫ్

ఒకవైపు చైనా అమెరికా మధ్యన టారిఫ్ వార్ భయంకరంగా ఉంది. చైనా మీద 104 శాతం టారిఫ్ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పెంచాడు. చైనా 34 నుంచి అమెరికా మీద 84 శాతం టారిఫ్ పెంచుతున్నట్లు ప్రకటించింది.10 సెకండ్స్ లో 20 లక్షల కోట్లు హుష్ కాకీ అయిపోయిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచం అంతా ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారం వల్ల స్టాక్ మార్కెట్ కుదేలు అయ్యింది. పెద్ద పెద్ద ఇన్వెస్టర్లు ఆగం అయిపోతున్నారు. భారత దేశంలో పరిస్థితి మరీ నాజూకు గా తయారు అయ్యింది. ఇదో వైపు కొనసాగుతున్న నేపథ్యంలో ఆరోగ్యం, అనారోగ్యం కోసం కీలకమైన ఉత్పత్తి అయ్యే మందుల పైన అందుకు ఉపయోగించే సామాగ్రి వస్తువులపై టారిఫ్ పెంచుతామని, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు.

**మందుల మీద ప్రతాపం.**

ఇండియా, యూరోప్, భారత్ మందులు తయారీ లో ప్రపంచం లోనే మంచి స్థానాల్లో అన్నాయి. భారత దేశం మందుల ఉత్పత్తి ఉత్పాదకత లో మూడో స్థానం లో ఉంది. మన దేశంలో సామాన్యులకు అందుబాటులో ఉన్న జనరిక్ మందుల పైన కూడా ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది భారత్ ను సైతం ఆర్థికంగా దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతున్నది. ఇంత జరుగుతున్నా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఎందుకు?

**దేశంను కపాడుకొండి.**


ఆయనకు దేశం లో మైనార్టీ వ్యతిరేక విధానాలకు, విరుద్ధంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తీసుకొచ్చి ఆమోదింప చేసుకోవడంలోనే ఉన్న శ్రద్ధ, దేశం ను కాపాడుకోవడంలో లేదు! అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మనవాల్ల పట్ల అమెరికా లో అమానవీయంగా వ్యవహరించిన, వ్యవహరిస్తున్న తీరుపై కూడా మన ప్రదానికి ఏమాత్రం శ్రద్ధ లేదు. ప్రపంచం మొత్తం ఒక్కటి అయి ట్రంప్ వ్యవహారం, దాష్టికాల మీద మాట్లాడు తూ ఉన్న, అమెరికాలో ట్రంప్ వ్యవహారం పట్ల నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాత్రం నోరు తెరవలేదు. ఒక వెట్కపు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు మే నెలలో రష్యా పర్యటన మీద ఉన్న శ్రద్ధ, ఆయనకు ట్రంప్ వ్యవహారం పట్ల లేదు! చూస్తూ చూస్తూ ఉంటే ఇప్పుడు మన మందుల ఉత్పత్తి ఉత్పాదకత మీద దృష్టి పడింది. కాంగ్రెస్ పార్టీ నేత, పార్లమెంటు లో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విషయం మీద ఎప్పటికీ అప్పుడు అలర్టు చేస్తున్న కూడా కేంద్రం కు అసలు పట్టి లేదు! నిజం మాట్లాడిన కూడా దేశ ద్రోహం అంటారు!ఋ నోరు తెరవండి మోడీజీ!ఋ–మాట్లాడండి! ఎందుకూ పనికి రాని విదేశీ పర్యటనకు ముందు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారం మీద దృష్టి పెట్టాలి! దేశానికి సమాధానం చెప్పాలి! స్టాక్ మార్కెట్ లో ఇన్వెస్ట్ చేయండి అంటూ ప్రకటనలు చేసి, ఇప్పుడు నిండా మునుగుతున్న వాళ్ళను ఎట్టికి వదిలేస్తే ఎట్లా? దేశం ఆర్థిక వ్యవస్థ కుదేలు అయ్యింది. ఇంకా చూస్తూ చోద్యం చూస్తున్నారు ? ఎందుకు? దేశం ప్రశిన్నున్నది. మోడీజీ. మాట్లాడండి.



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

## నిశీధి...

గాఢంపు ద్వాంతా పరిష్వంగమై..
ఎందుకో...
ఇంత గాఢ నీల పంకము
కురిసినా...
నీ స్మృతుల తావుల
తావులు
వ్యర్థమై ... వ్యస్తమై...
అందని ఏ ఆలింగనాల
అనుభూతినో వెదకాలని
యత్నిస్తూ...
ఎదురవని ఏ ఆలంబననో
మది సేద దీర్చు ఏ పిలుపునో
వినాలని కలవాలని
గెలవాలని



ప్రేరేపిస్తూ...
ఆచూకి అందని స్వప్న సౌరభాల
ముంచుతూ...
ఎడద స్వస్థ స్థితిని
కలవరపరుస్తూ...
కలతను నెడుతూ..
ఏకతపు శాంతిని కబళిస్తూ
గ్రీష్మ గానం వినిపిస్తూ..
ప్రేమ నిండిన ఎదను
స్పందనా రవళిని నినదించనీ
అని బోధిస్తూ
కమ్ముతూ ...
నీలిమేఘాలు
నిట్టూర్పుల అగరుల
కాల్చుతూ...
నీవు నాలా అంటూ
నిరాశా నిర్లిప్తతల తోస్తూ
వేకువ వెలుగుల
వాకిలి ముద్దాడనీయక
ఎందుకో..
ఈ రాతిరి
ఇంతగా... బాధిస్తూ వేధిస్తూ
బ్రతుకును...మనసును
మధిస్తూ...

**రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి**

## ఎండమంచిదే

ఎండకు గొడుగులు కుండలు
ఎండకు ఐసుల చలువలు ఎండకు చావుల్
ఎండిన చెరువులు బావులు
ఎండొక కాలము మరువకు ఎందుకు శాపాల్
ఎండకు వానలు కురియును
ఎండకు మామిడి ఫలాలు ఎండకు సుంజ్జల్
ఎండకు తర్బూజ జామ
ఎండక దొరకె మధురాలు ఎందుకు శాపాల్

**రేడియమ్**
**9291527757**

## అమ్మకానికి జాబ్స్

జీవితం భద్రత లేని బతుకు
నిన్నటి వరకు ధైర్యమే మా బతుకు
ఈరోజు ఏమీ తోచని నిస్సహాయులం

2016 టీచర్స్ నియామకం స్కాం
ఎక్కడ చూసినా హాహాకారం
తోటి వాళ్ళ కష్టం చూసి చలించి పోవడమే
ఒక్క తీర్పు జీవితాన్ని అతలాకుతలం చేసింది
ఇప్పుడు మా అందరి బతుకు అరణ్య రోదనే

వేల సంఖ్యలో ఇల్లు చేరిన ఉపాధ్యాయులు
మా నేరం ఏమిటో?
నిజాయితీ లేని వ్యవస్థ
నిజాయితీ లేని రాజకీయాలు
ధన దాహం మా జీవితాల్ని మట్టి చేసింది
పరిష్కారం ఎలా? ఎప్పుడు?
గుండె దడతో నిద్ర కోల్పోయిన రాత్రి
ఎటుచూసినా వరదై పొంగిన కన్నీటి గాథలే

నిద్రలో మెలకువలో వెంటాడే వార్తలు
ఎప్పుడు ఎలాంటి వార్త వింటామన్న
ఆందోళన
ఏదైనా మిరాకిల్ జరిగి ఉద్యోగాలు
చేతుల్లోకి రావాలన్న గంపెడాశ
ఎవరు కరెక్ట్ ? ఎవరు తప్పు?
ఆలోచించ లేని విషమ స్థితి

ఇక్కడ దోచుకోవడమే వ్యసనం
ఓటు ఒక చదరంగం ఆట
మనమంతా నిర్దయ వ్యవస్థ లోని పావులం

**సర్వమంగళ, కోల్కతా**
**8961626848**

## గ్యాస్ గుది బండ

సామాన్యుల పాలిట
రోదన
ఒక పక్క ధరల మంట
కూరగాయల ధరలు ఆకాశం
నిత్యవసర వస్తువుల ధరలు
నిలకడ లేక చింత చేస్తే
నిచ్చింత ఎక్కడ
దీపం పాథకం లబ్ధిదారులను
కూడా వదలని వైనం
నష్టాల పూరించే పేరుతో
సామాన్యుల నడ్డి విరచడం
న్యాయమాజి
ఆదాయాలు అత్యల్పం
ధరలు అధికం
ఇలా పోటు మీద పోటు
దాని మీద రోకలి పోటు
వెయ్యాలి ఓటు తో పోటు
లేకుంటే తప్పదు ఈ పాట్లు

**ఉమాశేషారావు వైద్య**
**9440408080**

# సామాన్యుని వెతలు తీరేది ఎప్పటికి?

*స్వల్ప దూర ప్రయాణాలకు తప్పనిసరిగా సాధారణ టికెట్స్, దూర ప్రాంత ప్రయాణాలకు సాధారణ లేదా ముందస్తు రిజర్వేషన్ ద్వారా టికెట్లను పొందాలి. సాధారణ ప్రయాణికిని బాధలు వర్ణనాతీతం. లోతుగా విశ్లేషించడానికి ప్రయాణంలో టికెట్ బుకింగ్ నుండి గమ్యం చేరే వరకు సామాన్యుడు అనుభవిస్తున్న వెతలను చూద్దాం.*

**ప్లాట్ఫారం మీద వెతలు!**

టికెట్ అనేది స్టేషన్ కౌంటర్ లేదా ఆన్లైన్లో తీసుకోవచ్చు. ఇక్కడి నుండే బాధలు మొదలవుతాయి. కౌంటర్ దగ్గర చేంతాడంత లైన్ ఉంటుంది. సరిపోనన్ని కౌంటర్లు ఉండవు. అక్కడ బలము న్నొడికే ముందుగా టికెట్స్ దొరుకుతాయి. జనాలను కంట్రోల్ చేసేందుకు రైల్వే పోలీసులు ఉండరు. మరి స్త్రీల పరిస్థితి చెప్పనలవి కాదు. స్టేషన్లలో అద్భుతమైన సౌకర్యాలను చదవడా నికి బాగుంటాయి. ఉన్నోడు గొంతు తడుపుకోడానికి బాటిల్ నీరు కొనుక్కుంటాడు. సామాన్యునికి త్రాగునీరు నల్లాలుంటా యి. మంచిదే. కానీ వచ్చే నీరు మంచిదో ? కాదో ? మనకంటే త్రాగినవారికి బాగా తెలుస్తుంది. చల్లని నీరు సౌకర్యం కల్పించాం కదా ? అని కొంత మంది వాదించవచ్చు. అందరికీ ఇవి సరిపోతాయా? పొట్ట నింపుకోడానికి ఏది కొందామన్నా స్పెషల్ ధరలు. ఒకవేళ అడిగితే కొంటే కొను. లేకపోతే పో.. అనే చూపులని మనం చూడడమే తప్ప ఏమీ చేయలేము. ఎవరికి చెప్పాలి? అంత తీరుబాటు ఉంటుందా? ప్లాట్ఫామ్ మీద కొన్నిసార్లు పులిసిపోయిన, పాడైపోయిన ఆహారం అమ్ము తారు. తినాల్సిందే. తప్పదు. ఆకలికి ఏదో ఒక గడ్డి తినాలి కదా. ధరలు మాత్రం అడక్కండి. ఎప్పటి కప్పుడు ధరలు ఫ్రెష్గా ఉంటాయి. మూత్రానికి వెళ్ళాలన్నా 'పే అండ్ యూజ్' అనే బోర్డులు కనిపిస్తాయి. దీనర్థం తెలియని సాధారణ ప్రయాణికునికి అక్కడికి వెళ్ళేవరకూ వరకూ తెలియదు. దీనికి కూడా రుసుము చెల్లించాలా? అని ఉచిత మూత్రశాలల గురించి చెప్పనవసరం లేదు చెప్పనలవి కాదు. అందుకే చాలా మంది బహిరంగ మల మూత్ర విసర్జన చేస్తారు.

ప్రమాదాలు పొంచి ఉంటాయి :

కొన్ని స్టేషన్లలో రైలు బండి వచ్చే ముందు మాత్రమే అనౌన్స్ చేస్తారు. బోగీ సంఖ్యని ప్రదర్శించే బోర్డు ఉండదు. బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియదు. జనరల్ బోగీ కోసం సామాన్యుడు పరుగులు పెట్టాల్సిందే. తప్పదు. ఎందుకంటే సామాన్యుడు పేదవాడు కదా. ఇటువంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా బండి తప్పిపోయిన వారెందరో ? ఈ పరుగులో ఒక్కోసారి చచ్చినోళ్ళు కూడా ఉంటారు. మరణం అనే పదం కేవలం ఉన్నవాడికి పేటెంట్ పేదోడి చావుకి చచ్చాడనే అంటారు.




**నిల్చునే వీలు కూడా లేదు:**

సాధారణ ప్రయాణీకుడు జనరల్ బోగీలోనే వెళ్ళే స్థోమత ఉంటుంది. ప్రతీ స్టేషన్లో పరిమితికి మించి సాదారణ టికెట్స్ ఇస్తారు. ఒక్కో బండిలో గరిష్టంగా జనరల్ పెట్టెలు నాలుగు ఉంటాయి. మరి ఈ నాలుగు బోగీలు అందరికీ సరిపోతాయా? ఇక బోగీలోని అవస్థలను చూద్దాం. భారత దేశంలో జనాభా పెరిగింది కదా అనే విషయం స్పష్టంగా కనిపించేటట్టు జనాలు కిక్కిరిసి ఉంటారు. ఎంత మంది వచ్చినా ఇంకా ఖాళీ ఉండడానికి.పురాణాలలో ఉండే పుష్పక విమానం కాదు కదా. లోపల సౌకర్యాలు గురించి ప్రస్తావించాలంటే ఈ పేపరు చాలదు. ధారావాహిక రూపంలో వ్యాసం రాయాలి. లోపల కూర్చోడం మాట దేవునికి ఎరుక. కనీసం నిల్చోడానికి ఖాళీ ఉండదు. కాలు కదప వీలుకాదు. చంటి పిల్లలు, వృద్ధులు, మహిళల వెతలు చెప్పలేం. రాత్రి వేళైతే ప్రయాణీకుల పరిస్థితి ఘోరంగా ఉంటుంది. కనీసం మరుగుదొడ్డికి వెళ్లాలంటే వీలవదు. అక్కడ కూడా జనాలే. బాత్రూంలో నీరు కొంత సమయం వరకే వస్తుంది. తరువాత షరామామూలే. ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. మరి ఎలా ప్రయాణించాలని? సామాన్యుని ఆవేదనను పట్టించుకునే వారెవరు ?

**ముందస్తు టికెట్స్:**

ఇక ముందస్తు (రిజర్వేషన్) టికెట్స్ గురించి చూద్దాం. ఆన్లైన్ లేదా స్టేషన్ కౌంటర్ దగ్గర బుక్ చేసుకునే వీలుంటుంది. ఆన్లైన్లో టికెట్ బుక్ చేసుకునే సామర్థ్యం ఎంత మంది సామాన్యులకు ఉంటుంది ? పోనీ ఇంటర్నెట్ సెంటర్ వాడిని ఆశ్రయిస్తే మన పేరిట ముందుగా 'ఐడి'ని సృష్టించాలి. దీనికోసం ప్రయాణికునికి ఫోన్, ధర చెల్లించడానికి ఏటిఎం కార్డ్ ఉండాలి. ఇవి ఎంతమందికి ఉంటాయి. కొన్ని సార్లు పేమెంట్ ఫెయిల్ అవుతుంది. వెంటనే ఖాతాలోకి అమౌంట్ రాదు. మరి వెంటనే టికెట్ బుక్ చేయాలంటే ఎలానో ఆ రైల్వే అధికారులకే తెలియాలి. నెట్ సెంటర్ వాడి ఖాతాతో బుక్ చేసి భవిష్యత్తులో టికెట్ రద్దు చేస్తే వాడి అకౌంట్కే డబ్బులు పోతాయి. వాడి నుండి వసూలు చేయాలంటే చాలా కాలం పట్టే అవకాశం లేకపోలేదు. ఎంతమంది ప్రయాణీకులు అరవై రోజుల ముందే ప్రయాణానికి ప్రణాళిక చేయగలరు. అవసరాలు ముందే తెలియవు కదా ! ఎందుకోగానీ ఈ మధ్యన ఇలా టికెట్స్ ఓపెన్ అవ్వంగానే బుక్ అయిపోతున్నాయి. కారణం ఏంటో మరి ? కొంత మంది బ్రోకర్లు దొంగ ' ఐడి ' లతో టికెట్స్ బుక్ చేయడం ఒక ప్రధాన కారణం కావచ్చు. రైల్వే టిసిలకు సమయాభావం వలన ప్రయాణీకులు దగ్గర టికెట్ ఉందా? లేదా? పరిశీలిస్తారు గానీ ఐడెంటిటీ ప్రూఫ్ మొత్తం చూసే సమయం వారికి ఉండదు. రెండు నెలల ముందే రైల్వే శాఖ దగ్గర పెద్ద మొత్తంలో టికెట్ అమౌంట్ నిలువ చేయడం వలన వారికి వడ్డీ బాగానే వస్తుంది. కానీ సామాన్యులు అంత పెద్ద మొత్తంలో ముందుగానే మదుపు పెట్టాలంటే కష్టం. అప్పులు చేయక తప్పదు. ఒక్కోసారి కాన్సిల్ చేయాలంటే కాన్సిలేషన్ చార్జీలు ఎక్కువే. అంత చార్జీలు అవసరమా? ఈ టికెట్ను వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి ఎలానూ కేటాయిస్తారు. మరి ఎందుకు రద్దు చార్జీలు వసూలు చేయాలి. ఒక వేళ ఎవరికీ కేటాయించక పోతే అప్పుడు చార్జీలు వసూలు చేయొచ్చు. అసలు రిజర్వేషన్ ఎందుకు? ఒక ఐదు రోజుల ముందు టికెట్స్ విడుదల చేస్తే పోలా? మరీ రెండు నెలల ముందు అవసరం లేదు. అన్నీ అవసరాలు అరవై రోజుల ముందు రావు కదా. కొంత మంది అనొచ్చు. తత్కాల్ ఉందిగా అని ? సామాన్యునికి అందుబాటు రేట్లలో ఇవి ఉన్నాయా? ఒక రోజు ముందు వారికున్న అన్నీ పనులు ఆపేసి సరిగ్గా 10 లేదా 11 గంటలకు నెట్ సెంటర్ దగ్గర ఉండగలరా ? అసలు తత్కాల్ ఎందుకు?

**ఎ.సి పెట్టెలు ఎక్కువ:**

ఒక బండిలో ఎక్కువ సంఖ్యలో ఎయిర్ కండిషన్ (ఎసి) బోగీలు ఉంటున్నాయి. సెకండ్ క్లాస్ సీట్లు తగ్గుతున్నాయి. పోనీ ఆక్కడైనా సౌకర్యంగా ఉంటుందా? జనరల్ టికెట్ తీసుకొని రిజర్వడ్ బోగీలు ఎక్కేస్తున్నారు. మరి వీళ్ళని టికెట్ కలెక్టర్ చూడడం లేదా ? చూసి ఊరు కుంటున్నారా.. లేదా ఇంకేమైనా తెలియని లాజిక్ ఉందా? ఇవన్నీ బహిరంగ రహస్యాలే. బోగీల్లో ఆహార పదార్థాలు రేటు ఎక్కువ, నాణ్యత మాత్రం తక్కువ. ఎసి బోగీల్లో రగ్గులు, బ్లాంకెట్లు అడిగితే తప్ప ఇవ్వడం లేదు. ఇచ్చినా సరే వాటి వాసన బాగుండడం లేదు. ఆడుగుదాం అంటే అటెండెంట్ భాష ప్రయాణికులకు రాదు. మన భాష వారికి తెలియదు. ప్రాంతీయ భాషలు వచ్చిన వారు దొరకరా? బ్లాంకెట్స్ వాడిన తరువాత తడుపుతారని, రగ్గులు మాత్రం ప్రతీ రోజు ఉతకరని సాక్షాత్తూ రైల్వే శాఖే చెప్పుతుంది. వీటి మూలాన అంటు వ్యాధులు రావా ?

ఫిర్యాదు చేయడమెలా:

బోగీల్లో మూత్రశాలలు పరిశుభ్రంగా ఉండవు. ఒక్కోసారి నీరు రాదు. ఎవరికి చెప్పాలి ? 139 నంబర్కి ఫోన్ చేద్దామంటే లైన్ కలవదు. కలిసినా రకరకాల ఆప్షన్స్ అడుగుతుంది. అదీ దాటీ వెళ్తే చివరికి మనకు తెలియని భాషలో అవతలి వారు మాట్లాడుతారు. అందరికీ హిందీ, ఇంగ్లీష్ రాదు కదా.. ఆన్లైన్లో 'రైల్ మదాద్ ' ద్వారా ఫిర్యాదు చేయొచ్చని ఎంతమందికి తెలుసు ?

**సత్వర నిర్ణయాలు తీసుకోవాలి :**

రద్దీ సమయాలలో స్పెషల్స్ వేస్తున్నారు. మంచిదే కానీ సరైన ప్రచారం లేక, ఆ విషయం చాలా మందికి తెలియక ఖాళీగా వెళ్లిపోతున్నాయి. అంతే కాదు స్పెషల్ బండిలో టికెట్ ధర సాధారణ బండి కంటే కొంచెం ఎక్కువే మరి.. అవునులే.. ఆమాత్రం ఉండకపోతే ఎలా ? స్పెషల్ కదా ఈ మధ్యనే ప్లాట్ఫారం మీద తొక్కిసలాటలో ప్రయాణీకులు చనిపోవడం చూశాం. ఇటువంటివి భవిష్యత్తులో జరగకుండా చూసుకోవాలి. పెద్ద పెద్ద రైల్వే స్టేషన్లలో ఒకే దగ్గర అన్ని ప్లాట్ఫామ్స్ లేకుండా, వేర్వేరు దిక్కులకు వెళ్ళే ట్రైన్స్ అన్నింటికీ వేర్వేరు ప్లాట్ఫామ్స్ నిర్మించాలి. శాఖాపరమైన సలహాలు తీసుకొని ముందుకు పోవాలి.



**జనక మోహన రావు దుంగ**
ఫోన్: 8247045230

# పని చేయించుకున్నారు..! పైసలు ఇవ్వరా..?

- ఆగ్రహం వ్యక్తం చేసిన సిఐటియు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** కులగణన సర్వే కోసం ఎన్యూమరేటర్లుగా అంగన్వాడి టీచర్లు ఎంతో కష్టపడడం జరిగిందని, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ జీవితాన్ని సైతం పక్కన పెట్టి ప్రభుత్వానికి ఊడిగం చేస్తే ఇప్పటివరకు చేసిన పనికి డబ్బులు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసం అని సిఐటియు శేర్లింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు అంగన్వాడీ టీచర్లతో కలిసి సిఐటియు పక్షాన బుధవారం శేరిలింగంపల్లి జోనల్ పరిధి చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి. మోహన్ రెడ్డికి ఒక మెమోరాండం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ గత నవంబర్ లోనే కులగణన సర్వేను పూర్తి చేయడం జరిగిందని, ఎన్నో అవమానాలకు, ఇబ్బందులకు ఓర్చి అనుకున్న సమయానికే తాము సర్వేను పూర్తి చేసి జిహెచ్ఎంసి అధికారులకు అందజేయగా సర్వే పూర్తయిన వెంటనే డబ్బులు చెల్లిస్తామని ప్రారంభంలో చెప్పి ఇప్పుడు చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడం సమంజసం కాదన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని ఇతర అన్ని విభాగాల ఎన్యుమరేటర్లకు రెమ్యూనరేషన్ 10 వేలు అందజేసిన అధికారులు అంగన్వాడీ టీచర్ల విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహించడం, కనీస స్పందన కొరబడడం దుర్మార్గం అన్నారు. ఇంట్లో ఎన్ని ఇబ్బందులు ఉన్నా... ఓవైపు అంగన్వాడి విధులను, మరోవైపు కులగణనను సమన్వయం చేసుకుంటూ అనేక వేయప్రయాసాల కోర్చి సర్వేను పూర్తి చేసినందున కనీస కృతజ్ఞతతో, మానవత్వంతో భేషరతుగా మాకు రెనిమరేషన్ అందించాల్సిన అధికారులు ప్రస్తుతం మొహం చాటేస్తూ... మేమెవరమో తెలియదన్నట్టుగా వ్యవహరించడం ఏరు దాటినంక తెప్ప తగలేయడం వ్యవహారమని వారు దుయ్యబట్టారు... ఇప్పటికే వారిచ్చే డబ్బుల కంటే తాము అధికంగా ఖర్చు పెట్టుకున్నామని, ఎప్పుడు కూడా డబ్బుల కోసం ఇంకా అధికారుల చుట్టూ తిరగడం దండగ మారి చర్యగా వారు అభివర్ణించారు. తక్షణమే డబ్బులు చెల్లించని ఎడల మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించడంతోపాటు కార్యాలయం ముందు బైఠాయించి నిరసన కార్యక్రమానికి పూనుకోవడం జరుగుతుందని, అప్పటికి కూడా తమ డబ్బులు చెల్లించకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగేందుకు అయినా సిద్ధమని వారు స్పష్టం చేశారు. కాగా ఉన్నతాధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని చందానగర్ సర్కిల్ డిసి ఆమెని ఇవ్వడం జరిగిందని సిఐటియు కార్యదర్శి కొంగరి కృష్ణ తదితరులు తెలిపారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి



**చేర్యాల, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించాబోతున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. చేర్యాల మండలంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పల్లా మాట్లాడుతూ గత 16 నెలల కాలంలో ప్రజల ఆశీర్వాదంతోనే అసెంబ్లీ వేదికగా ప్రజల సమస్యల్ని ప్రధానంగా ప్రస్తావించాను. సాధారణంగా ఒక ఎమ్మెల్యేకు అసెంబ్లీలో ఎక్కువసేపు మాట్లాడే అవకాశం తక్కువగా లభిస్తుంది. కానీ ప్రతిపక్షంలో ఉన్న తనకు, కేసీఆర్ ఇచ్చిన అవకాశంతో ప్రజా సమస్యలను సభలో వినిపించగలిగాను అధికారంలో మంత్రులే మాట్లాడలేని పరిస్థితుల్లో, ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనకు బడ్జెట్ సమావేశాల్లో ప్రతి అంశంపై ధీటుగా మాట్లాడే అవకాశం దక్కింది. ప్రభుత్వం అవగాహన లేకుండా అసత్యాలను ప్రచారం చేస్తుంటే, ప్రతీ రోజు నిలదీసి ప్రశ్నించాం. ధరణి వ్యవస్థపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కోటి 52 లక్షల ఎకరాల భూమి ధరణిలో రైతుల పేర్లతో భద్రంగా ఉందని, వారికీ పూర్తి హక్కులు కల్పించిందని వెల్లడించారు. ధరణి వెబ్సైట్‌ను ఇప్పటికే 12 కోట్ల మంది సందర్శించారని, ఇది ప్రజల్లో విశ్వాసాన్ని సూచిస్తుంది. కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రూ.పైసా ఖర్చు లేకుండా 7 లక్షల ఎకరాల సాధా బైనామాలను రెగ్యులరైజ్ చేసిన ఘనతను సొంతం చేసుకుంది. "జమాబందీ, మాన్యూవల్ పహానీలు మళ్ళీ తీసుకురావాలన్నది వెనకబాటుతనం" అని అభిప్రాయపడ్డారు. అంతేకాక అనుభవదారుల కాలమ్ పేరుతో రైతులను మళ్ళీ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి గతంలో పేస్ 1లో 350 క్యూసెక్కులు, పేస్ 2లో 550 క్యూసెక్కుల నీరు అందేది. ఇప్పుడు పేస్ 3లో 1800 క్యూసెక్కుల నీటిని అందించేందుకు సిద్ధంగా ఉంది. ఈ 1800 క్యూసెక్కుల నీటిని తీసుక వచ్చేందుకు రామప్ప దగ్గర నుంచి దేవన్నపేట వరకు 46 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయింది. దేవన్నపేట నుంచి 7 కిలోమీటర్ల పైప్‌లైన్ పంప్ లైన్ కూడా పూర్తయింది. మొన్న ఒక మోటార్‌ను ప్రారంభించగా, రెండవ మోటార్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రాజెక్టు పనులను రైతులు, ప్రజాప్రతినిధులు కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ వానాకాలం నాటికి లద్దునూరు, బొమ్మకూరు, తపస్ పల్లి రిజర్వాయర్లకు పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకుంటా అని తెలిపారు.

# కళాకారులకు సులభంగా అమెరికా వీసా



**ఖైరతాబాద్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** సంక్లిష్టమైన యూఎస్ వీసాను సులభంగా పొందాలనుకునే కళాకారులు, ప్రదర్శకులు, వినోద రంగ నిపుణుల కు నిపుణులతో కూడిన సహాయాన్ని అందించే దుకు తాము సిద్ధంగా ఉన్నట్లు గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ ప్రతినిధులు బుధ వారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ కళాకారులు అమెరికాకు వెళ్లి ప్రదర్శనలు ఇవ్వాలని అనుకుంటారని, అలాంటి వారు వినోద వీసాల గురించి తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. అమెరికా పౌరులు కానివారు సంగీతం, చలనచిత్రం, టెలివి జన్, క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సహా వివి ధ వినోద రంగాలలో చట్టబద్ధంగా ప్రదర్శన ఇవ్వ డానికి ఈ వీసాలు ఉపయోగపడతాయన్నారు.

# ప్రమాదవశాత్తు నీటి కుంటలో మునిగి వ్యక్తి మృతి



**రేవల్లి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** గోపాల్‌పేట్ మండల కేంద్రంలోని లక్ష్మీ తండాకు చెందిన కిషన్ తండ్రి కోటయ్య వయసు 39 సంవత్సరాలు లక్ష్మీతండా వృత్తి భవన నిర్మాణ కార్మికుడు, ధర్మతాండకి చెందిన పద్మను దాదాపు 15 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు వీరికి ముగ్గురు మగసంతానం కలరు. భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిన్న గొడవలు జరుగుతూ ఉండేవి. ఐదు నెలల కింద భార్యతో గొడవపడి లక్ష్మీతాండాకొచ్చి పనిచేసుకుంటూ ఉండేవాడు. తేదీ 8-4-2025 రోజు ఉదయం 05:00 గంటల సమయంలో తన గ్రామ శివారులో ఉన్న కొత్త కుంటలో తన చిన్నాన్న మోటరు సరిగా పనిచేయునందున, చూడడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఈత రాక చనిపోయాడు. బుధవారం ఉదయం 07:00 గంటలకు మృతదేహాన్ని గుర్తించారు. మృతుని తల్లి కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోపాల్ పేట్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

# ధరణి సమస్యలను పక్కా ప్రణాళికతో పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ధరణి సమస్యలను పక్కా ప్రణాళికతో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో ధరణి సమస్యలపై సంబంధిత అదనపు కలెక్టర్ నగేష్ కలెక్టరేట్ సూపర్డెంట్లు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమస్యలపై దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధరణి దరఖాస్తులు పెండింగులో ఉన్న దరఖాస్తులపై. వాటి పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కారం కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపర్డెంట్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముజ్రా పార్టీని భగ్నం చేసిన ఎస్ఓటీ పోలీసులు

- బర్త్‌డే పార్టీ ముసుగులో రేవ్ పార్టీ



**మొయినాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** మండలంలోని హెత్ బార్ పల్లి గ్రామ శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో మంగళవారం రాత్రి సమయంలో నమ్మదగిన సమాచారం ప్రకారం పార్టీ నిర్వాహకులు గంజాయి, డ్రగ్స్, మద్యం,అశ్లీల నృత్యాలతో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్ఓటి పోలీసులు ఫామ్ హౌస్ పై రైడ్ చేయగా అందులో7 మహిళలు13 మంది పురుషులు అదుపులోకి తీసుకున్నారు అని స్థానిక సీఐ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ రుక్మాన్ అనే వ్యక్తి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆ సందర్భంగా ముజ్రా పార్టీని నిర్వహించాలని అతనికి పరిచయం ఉన్న అడ్డు అనే వ్యక్తితో గాంజా డ్రగ్స్ తీసుకురావడానికి ప్లాన్ చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారందరూ వ్యాపారస్తులేనని తెలిపారు. పార్టీ జరుపుతున్న ప్రదేశంలో తనిఖీ నిర్వహించగా 70 గ్రాముల గంజాయి,3లీటర్స్ లిక్కర్,4బీరు, బాటిల్స్, బీజర్ బాటిల్స్,కండోమ్ ప్యాకెట్లు15, 6కార్లు,,మొబైల్ ఫోన్లు 25, ఓసిడి పేపర్ ప్లాంట్స్ ఉక్కా పాట్స్, ను సీజ్ చేయడం జరిగిందని సీఐ తెలిపారు. ఫామ్ హౌస్ యజమాని అబ్దుల్ బిన్ సమాచారం అందిందని రికార్డు పరంగా కూడా అతనే యాజమానిగా గుర్తించామని సీఐ తెలిపారు. ఇలాంటి పార్టీలపై ఫామ్ హౌస్ ఓనర్ల లపై గతంలో కూడా అనేక కేసులు చేసి శిక్ష విధించినట్లు సిఐ తెలిపారు. ఇప్పటికైనా మండల కేంద్రంలోని ఫామ్ హౌస్ ఓనర్లకు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పర్మిషన్లు ఉండవని ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేడు జరిగిన కేసులో బిఎన్ఎస్ కొత్త సెక్షన్ ప్రకారం 144 క్లాస్ టు బి.ఎన్.ఎస్ , వైలేషన్ చేసినందుకు 223,292, బి.ఎన్.ఎస్, మరియు గాంజా కలిగి ఉన్నందుకు 8 రెడ్ విత్ 20బి, క్లాస్ టు ఎ,25,29, ఎంపీపీ ఎస్ కింద కేసు నమోదు చేసినట్లు, మరియు లిక్కర్ కూడా కలిగి ఉన్నందుకు 34ఏ, ఎక్సైజ్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అందరి పైన కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

# బ్రిడ్జి నిర్మాణ పనులలో నాణ్యత పరిమాణాన్ని పాటించాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** బ్రిడ్జి నిర్మాణ పనులలో నాణ్యత పరిమాణాన్ని పాటించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని ఫ్లైఓవర్ సమీపంలో చిలుక వాగు ప్రక్షాళనలో భాగంగా జరుగుతున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్

- కూలర్‌లో చెలరేగిన మంటలు
- రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** మండల పరిధిలోని తుంకీమెట్ల గ్రామంలోని షఫియా బేగం ఇంట్లో బుధవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో కూలర్ లో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది.కుటుంబ సభ్యులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు.రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు షఫియా బేగం అన్నారు.ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన గ్రంథాలయ చైర్మన్**

తుంకీమెట్ల షర్ట్ సర్క్యూట్ సంఘటనను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు గౌడ్,నాయకులు రామచంద్ర రెడ్డి, వెంకట్ రాములు గౌడ్ ,మల్లేష్, మల్లికార్జున్,బాలరాజ్ గౌడ్, మోహన్ రెడ్డి,హానీఫ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# పురుగుల మందు సేవించి మహిళ మృతి

**శివ్వంపేట, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** అదనపు కట్నం కోసం వేధింపులు భరించలేక వివాహిత వినోద 34 క్రిమి సంహారక మందు తాగి చికిత్స పొందుతూ ఆసుపత్రి లోనే మృతి చెందిన సంఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన చెల్లి ప్రవీణ్ కుమార్ కు 15 సంవత్సరాల క్రితం వెల్దుర్తి మండలం జాలాల్ పూర్ కు చెందిన వినోద తో వివాహం జరిగింది. భర్త ప్రవీణ్ కుమార్, అత్త సత్తమ్మ, గత 6 సంవత్సరాల నుండి అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించ సాగారు. గతంలో కూడా వినోద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆ తర్వాత పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, సర్ధి చెప్పి వినోద తల్లిదండ్రులు ఆమెను కాపురానికి పంపించారు. అనంతరం భర్త ప్రవీణ్ కుమార్ లో ఎలాంటి మార్పు రాకపోవడంతో పాటు బంగారం కూడా అమ్ముకోవడంతో వినోద గత నెల మార్చి 31న రాత్రి క్రిమిసంహారక మందు సేవించింది. ఆమెను చికిత్స నిమిత్తం అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు ఉస్మానియా దావాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 8 న మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలు తండ్రి అరిగె డాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి బుధవారం తెలిపారు.

# కార్పొరేషన్ ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీరుస్తా..

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధి లోని పి.ఎన్.టి కాలనీలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు నూతన వాటర్ ఫిల్లింగ్ పాయింట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై కమీషనర్ జి.శరత్ చంద్ర తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో నీటి బిల్లులు చెల్లించి క్యాన్ నెంబర్ కలిగిన ప్రతి ఇంటికి రూ. 500 లకే 5000 లీటర్ల నీటి ట్యాంకర్ సరఫరా చేసే విధంగా కార్యక్రమం చేపట్టామని కావున ప్రజలందరూ ఈ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పద్మావతి పాపయ్య యాదవ్, శ్రీనాథ్ రెడ్డి,సాగర్ గౌడ్, మాజీ నాయకులు సంగారెడ్డి, సురేష్ గౌడ్, క్రిష్ణ రెడ్డి, సుమన్ గౌడ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పిఎసిఎస్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి



**చేవెళ్ల, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల పిఏసీఎస్ డైరెక్టర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో సీసి రోడ్లు, మరియు డ్రైనేజీ అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్కలపల్లి మల్లేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు వీరేందర్ గౌడ్, గ్రామస్తులు సుదర్శన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, బాల్ రెడ్డి, నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాంద్ పాషా, రవీందర్ గౌడ్, జగన్ గౌడ్ , నర్సింహులు, దర్శన్ గౌడ్, సత్యం, రమేష్, శ్రీను, వెంకటయ్య, యాదయ్య, ఉస్మాన్, బషీర్, అజీమ్, సలీం, బిక్షపతి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గున్గల్ మోడల్ పాఠశాల అభివృద్ధికి అమెజాన్ కంపెనీ ముందుకురావడం అభినందనీయం

- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి
- మోడల్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్ ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** పేద విద్యార్థులు చదువుకుంటున్న గున్గల్ మోడల్ పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తామని అమే జాన్ కంపెని వారు ముందుకు వచ్చి వనులు చేయించడం ఎంతో హర్షించదగ్గ విషయమని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మండల వరిధిలోని గున్గల్ మోడల్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్, పేయింటిగ్ తదితర పునర్ నిర్మాణ పనులను అయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిషత్ కోసం అమేజాన్ కంపెని వారు సహకరించడం ఎంతో హర్షిచదగ్గ విషయమని అన్నారు. స్వచ్చంధ సంస్థలు సహకరిస్తే ప్రతి పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అమేజాన్ కంపెని వారికి తమ సహాయ సహకారాలు ఉంటాయని హామి ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మూళిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పోటీ పడుతారని అన్నారు.. గతంలోనే మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో 194 మోడల్ పాఠశాలలకు నిధులు కెటాయించారనే విషయాన్ని అయన గుర్తు చేశారు. పాఠశాలలో 600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైనవిద్య అందుతుందని అశాబావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోర్త్ సిటితో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటి నిర్మాణ చేస్తున్నారని పెర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ఫార్మాసిటి పేరుతో గత ప్రభుత్వం కాలుష్యకారకమైన పరిశ్రమలు తెలవాలని చూసింది. కాని కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగ పడే కంపేనీలు పేద్తుందని తెలిపారు. ఫోర్తుసిటీతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పెర్కోన్నారు. ఈకార్యక్రమంలో అమే జాన్ కంపెని డేరెక్టర్ ప్రవీణ్ బైడెన్, అమేజాన్ పండ్స్ మేనేజర్ తాతాజి, ఓంకార్, తెలంగాణ మోడల్ పాఠశాలల అడిషినల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, ఎంపిడిఒ నరేందర్ రెడ్డి , తహశిల్దారు అయ్యప్ప, ఎంఈఒ పాండురంగారెడ్డి, సహకార సంఘం చైర్మెన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపిలు శ్రీనివాస్ రెడ్డి , గజ్జి రామకృష్ణ యాదవ్, నాయకులు, వరి కుప్పల సుధాకర్, బిలకంటి శేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మణ్.. గిరమోని రవింధర్, అమెజాన్ యూఎస్ బ్రియాన్ ఫ్రాంకి, అశోక్ శ్రీరామ్, సీఈవో పార్థసారథి, తాసిల్దార్ అయ్యప్ప ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంఈఓ పాండురంగారెడ్డి, గ్రామానికి చెందిన నాయకులు, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 ఏప్రిల్ 2025

# బహుజనుల రాజ్యాధికారం కోసమే పోరాటం

- రాజ్యాంగం మీద హక్కు సాధించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్
- ప్రొఫెసర్ డాక్టర్ చింతకింది ఖసిం



**బిజినేపల్లి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** కేంద్రంలో, రాష్ట్రాల్లో బహుజనుల రాజ్యాధికారమే భవిష్యతు పోరాట లక్ష్యంగా ముందుకు సాగుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని బీసీ సంఘం నాయకులు గంగనమోని కిరణ్, నాయినోళ్ల బాల్ రాజు: గౌడ్, దళిత బహుజన సంఘం రాష్ట్ర నాయకుడు మంగి విజయ్లతో కలిసి ఆవిష్కరించారు. పూలే విగ్రహా ఆవిష్కరణ కమిటి అధ్యక్షుడు అంతటి రాజేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయ్యే చట్ట సభల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆయా పార్టీలు సీట్లు కేటాయించకపోతే అన్ని స్థానాల్లో యిహుజనులు పోటీలో ఉండి గెలిచి సత్తా చాటాలని అన్నారు అనగారిన వర్గాల ప్రజలంతా ఏకతాటిపై వచ్చి ఐకమత్యంతో బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకుడిని ఎమ్మెల్యేగా, ఎం గెలిపించుకుంటేనే రాజ్యాధికారం మన చేతుల్లో ఉంటుందన్నారు. రాజ్యాధికారం సాధిస్తేనే మన బతుకులు మార్చుకునే చట్టాలు చేసుకుంటామన్నారు. బీసీ నినాదం ముప్పై ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని, బీసీల్లో ఇంతటి చైతన్యం బిజినేపల్లిలో చూస్తున్నానని, బహుజనుల ఐక్యత కోసం పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ సిద్ధాతంతో పోరాటం చేస్తేనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. సిద్ధాంతం రూపొందించిన మహనీయుడు మహత్మా జ్యోతిరావు పూలే విగ్రహాని ఆవిష్కరించుకోవడంతోనే ఆగిపోకుండా ఆయన చూపిన బాటలో సాగాలన్నారు. దేశంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్కు గాంధీ, నెహ్రూల సిద్ధాతం, కవ న్యూనిస్టులకు మార్చ్ఛిజం, బీజేపీకి హెడ్గేవార్, గోల్వాల్కర్ సిద్ధాంతాలు, బీఆర్ఎస్ కేసీఆర్ సిద్ధాంతకర్తగా మార్గదర్శకత వహించి పోరాటం చేయడంతోనే దేశ స్వాతంత్రం, కార్మికుల హక్కుల సాధన, హిందూ భావజాల వ్యాప్తి, ప్రత్యేక తెలంగాణ సాధ్యమయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకమై సిద్ధాంతపరంగా ముందుకు సాగితేనే లక్ష్యం చేరుకుంటామని దిశ నిర్దేశనం చేశారు. ముందుగా బహుజనులకు భూమిపై హక్కు, ఉద్యోగ అవకాశాలు, రాజకీయ అవకాశాలు సాధిస్తేనే రాజ్యాధికారం బహుజనులకు వస్తుందన్నారు. 198 ఏండ్ల క్రితమే. బహుజనుల హక్కుల కోసం వెలుగెత్తి చాటిన మహనీయుడు జ్యోతిరావు పూలే ఆశయాలను సాధిస్తే సమ సమాజ స్థాపన కల నెరవేరుతుందన్నారు. అంతకు ముందు ప్రొఫెసర్లు డాక్టర్ పెట్స్ేటి మల్లికార్జున్, డాక్టర్ సాయిబాబా, బీసీ రాష్ట్ర నాయకుడు దిలీపాచారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్ లు మాట్లాడారు. అంతకు ముందు గిద్దె రాం నర్సయ్య రేలారే గంగ, జయప్రకాశ్, డప్పు లక్ష్మణ్, రాజు, విజయకాంత్ల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. పూలే విగ్రహా ఆవిష్కరణ మహొత్సవానికి ఆరు వేల మందికి పైగా బహుజనులు హాజరయి విజయవంతం చేయడంపై నిర్వహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘం గౌరవ అధ్యకుడు వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంత్ గౌడ్, సత్యశీల సాగర్, కరిగల దశరథం, రామన్ గౌడ్, రఘుబాబు, రాము నాయక్, గంగారం ఆశోక్, గోవిందు నాగరాజు, రఘు బాబు, గంగనమోని తిరుపతయ్య, ఇండ్ల శ్రీను. తుమ్మల అల్లోజీ, దేషెట్టి రాజేష్ వ ఎల్లేష్ గౌడ్, పృద్వీరాజు, సుదర్శన్, దామోదర్, కిషోర్, విజయ్, బంగారయ్య, తదితరులు ఉన్నారు.

## ఎంపీ డికే అరుణకు వినతిపత్రం అందజేత

- సానుకూలంగా స్పందించిన ఎంపీ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం, సింగారం గ్రామం నడిబొడ్డున హైమ్యాక్స్ లైట్ల ఏర్పాటు, భారీ వాహనాల రాకపోకల వల్ల సింగారం గ్రామం నుంచి సింగారం చౌరస్తా వరకు దెబ్బతిన్న రహదారి మరమ్మతుల గురించి బీజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డికే అరుణ కి సింగారం బిజెపి నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. బుధవారం నారాయణపేటలో జరిగిన బిజెపి జిల్లా అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన సత్యయాదవ్ కార్యక్రమం అనంతరం యంపి కివినతిపత్రం అందజేశారు. దీనిపై యంపి అరుణ సానుకూలంగా స్పందించి హైమ్యాక్స్ లైట్లను ఏర్పాటు చేయిస్తానని, రహదారి విషయంను సంబంధిత అధికారుల వద్ద మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సిద్దప్ప, నర్సింహులు, రవికుమార్, సమస్తాపురం శేఖర్, ప్రవీణ్, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్సర్క్యూట్తో ఇల్లు దగ్ధం

- కూతురు పెళ్లి కోసం తెచ్చిన లక్ష రూపాయలు బూడిద పాలు
- నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలంటూ బాధితులు డిమాండ్



**గండీడ్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** మండలపరిధిలో చిన్నవార్వల్ గ్రామానికి చెందిన బిగ్గి బాలమ్మ యొక్కఇంట్లో బుధవారం జరిగిన,విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే ఇల్లు దగ్ధం.గ్రామంలో ఈఘటన చోటుచేసుకుంది.నిత్యంవాడే ఆహార పదార్థాలు దుస్తులు కూతురు పెళ్లి కోసంతెచ్చిన లక్ష రూపాయలు బూడిదపాలు అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో నష్టపోయిన. బిగ్గి బాలమ్మ కుటుంబీకులు బాధతో కన్నీరు పెట్టుకున్నారు. నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వాన్ని ఆదుకోవాలంటూ స్థానిక నాయకులని కోరారు.

## ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి మంత్రి హామీ

- డిసీసీ ప్రధాన కార్యదర్శి కే.భాస్కర్ రెడ్డి



**న్యాల్కల్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** వైశాల్యం, జనాభా, గ్రామ పంచాయతీలు, ఓటర్ల జాబితాలో తెలంగాణ రాష్ట్రంలోనే న్యాల్ కల్ అతిపెద్ద మండలం. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు మండలం కావడంతో అనునిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అతిపెద్ద మండలంలో ఒకే పోలీస్ స్టేషన్ ఉండడంతో ప్రజలు కొంతమేర సౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రమైన న్యాల్ కల్ లో నూతనంగా మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న న్యాల్ కల్ ఆర్టీసీ బస్టాండ్ ను పునర్నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ల దృష్టికి స్థానిక ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ తో విన్నవించగా అందుకు సీఎం, మంత్రి సానుకూలంగా స్పందించారని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్ రెడ్డి స్థానిక ప్రజానీకానికి స్పష్టం చేశారు. బుధవారం న్యాల్ కల్ లో "సన్నబియ్యం" ప్రారంభోత్సవ పంపిణీ కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ధనరాజ్ అధ్యక్షతన, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కే.భాస్కర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతిక రోజుల క్రితం పోలీస్ స్టేషన్ ఏర్పాటు, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి విషయమై ఎంపీతో కలిసి రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది అన్నారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని స్పష్టం చేశారు. మండల కేంద్రమైన న్యాల్ కల్ ను ప్రత్యేక పైలట్ గ్రామంగా గుర్తించి రుణమాఫీ, రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణాలు, తదితర సంక్షేమ పథకాలు అమలు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పార్టీ శ్రేణులు గిరీష్ రావు జోషి,రత్నం, శ్రీనివాస్ రెడ్డి, అడివప్ప, సత్తయ్య, శ్రీనివాస్, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి,డిఆర్డిఓ జయదేవ్ ఆర్య




**నంగనూరు, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** నంగునూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో న బుధవారం రోజు ఎంపీడీవో లక్ష్మప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీ అధికారి మండల స్పెషల్ ఆఫీసర్ దేవకీదేవి, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య పాల్గొని మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు లేబర్ కు గ్రామం వారిగా పోయిన సంవత్సరానికి ఈ సంవత్సరం కి ఎంత లేబర్ ఉంటే ఈరోజు కూడా అంతే విధంగా ఉండాలి. ప్రతి గ్రామం నుండి 150 మంది కార్మికులు ప్రతిరోజు పనిచేయాలి అని టార్గెట్ ఇవ్వడం జరిగింది. పని జరుగు స్థలములో వర్క్ సైడ్ ఫెసిలిటీసు, షేర్ నెట్ వాటరు, ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రాథమిక చికిత్స బాక్స్ కుడా ఏర్పాటు చేయగలరు.అనిఅన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు టిఏలు ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## జగదాంబ దేవి మాత ఆలయ అభివృద్ధికి కృషి

- విరాళం అందజేత
- శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్ గుప్తా



**నర్సాపూర్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** నర్సాపూర్ మండల పరిధిలోని తుల్జారంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శ్రీ జగదాంబ దేవి మాత ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్ గుప్తా అన్నారు. బుధవారం తుల్జరంపేట్ గ్రామంలో ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులకు శ్రీపాద ట్రస్ట్ సహకారంతో నిర్వాహలకు తన వంతు సహాయంగా 51 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటి సి బాబ్యా నాయక్ మాజీ సర్పంచ్ సామ్య నాయక్ ఆలయ పూజారి రాములు ఉప సర్పంచ్ రెడ్యానాయక్ రూప్ సింగ్ అమృ నాయక్ గోపాల్ లక్పత్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాచ్యూ ఆఫ్ యూనిటీని సందర్శించిన మంత్రులు జూపల్లి, తుమ్మల



**నాగర్కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** గుజరాత్లోని సత్పురా, వింధ్యాంచల్ పర్వత శ్రేణుల్లోని నర్మదా నది తీరంలో.. కెవాడియా ప్రాంతంలో ఉన్న సర్దార్ వల్లబాయ్ పటేల్ ఐక్యతా (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ) విగ్రహాన్ని, టెంట్ సిటీని పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సందర్శించారు.తెలంగాణలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశంలో నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చామని అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా దేశీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రదేశాలను సందర్శించి, తెలంగాణ పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని దీంట్లో భాగంగానే స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, టెంట్ సిటీని సందర్శించామని మంత్రి జూపల్లి తెలిపారు.
2027, 2028 సంవత్సరాల్లో తెలంగాణ జరగనున్న గోదావరి, కృష్ణ పుష్కరాలకు సంబంధించి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టెంట్ సిటీలో ఉన్న వసతులను అధ్యయనం చేశామని చెప్పారు. ఇలా తెలంగాణ పర్యాటక అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రుల వెంట పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- నంగునూరు పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, ఎమ్మార్వో సరిత



**నంగునూరు, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** నంగునూరు మండలంలోని మండల కేంద్రంలో, సిద్దన్నపేట గ్రామంలోని మార్కెట్ యాడ్లో నంగునూరు పిఎసిఎస్ సంగం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు సెంటర్లను మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశానుసారం బుధవారం రోజు రైతుల సమక్షంలో కొనుగోలు సెంటర్లను పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, ఎమ్మార్వో సరిత ప్రారంభించి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు సెంటర్లోనే ధాన్యాన్నిఅమ్ముకోవాలని,దళాలను నమ్మి రైతులు మోసపోవద్దని, ధాన్యానికి మొదటి రకంగా మద్ద ధర 2320, రూపాయలు సాధారణ రకం 2300 రూపాయలు మద్దతు ధర కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బెదురు తిరుపతి, పలువురు నాయకులు, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఊరకుక్కల దాడిలో 25 గొర్రెల మృతి

- 2.5 లక్షల ఆస్తి నష్టం



**అచ్చంపేట, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** అచ్చంపేట మండల సమీపంలోని వ్యవసాయ పొలంలో గొర్రెలమందపై గ్రామ శిమాలైన ఊరి కుక్కలు దాడి చేయడంతో 25 గొర్రెలను కొరికి చంపిన సంఘటన మంగళవారం రాత్రి బుధవారం చోటుచేసుకుంది. బాధిత రైతు గొర్రెల యజమాని మేడమోని రేణయ్య వ్యవసాయ పొలంలోని గొర్రెల మంద వద్దకు వెళ్లి చూడగా గొర్రెలన్నీ చల్లాచెదురుగా చనిపోయి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తెలిపిన సమాచారం మేరకు ఊర కుక్కలు దాడి చేసి చంపిన సంఘటనలో సుమారు రూ. 2.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని యజమాని కంటతడి పెట్టుకుని బోరున వినిపించాడు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అయన కోరారు.

# విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం

- తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డి



**జడ్చర్ల, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** పుస్తక పఠనం ద్వారానే జ్ఞానం వస్తుందని, ఫేస్ బుక్, వాట్సా యాప్ల ద్వారా ఉపయోగం లేదని యువత అది గ్రహించి చదువు పట్ల శ్రద్ధ చూపాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ బాల కిష్టారెడ్డి అన్నారు. జడ్చర్ల డాక్టర్ బిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన పోటీ ప్రపంచంలో మేధా వినియోగంలో విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి వాణిజ్య శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాల కిష్టారెడ్డి హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత కీలకమని, 18 వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం వల్ల ప్రపంచం అభివృద్ధి చెందిందని, 21వ శతాబ్దంలో వచ్చిన సాంకేతిక విప్లవం వల్ల విప్లవాత్మకమైన మార్పులు సంభవించి భారతదేశం ప్రపంచంలోనే కీలక పాత్ర పోషిస్తుందని, 2030 నాటికి భారతదేశం 20 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని, విద్య, ఆరోగ్యం, సాంకేతిక విధానాలకు ప్రభుత్వం ప్రాముఖ్యతను ఇస్తే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందన్నారు. 2025 - 26 విద్య సంవత్సరంలో సమూలమైన మార్పులు చేస్తున్నామని అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సిలబస్ లో మార్కులు తో వస్తున్నామని, సమాజానికి ఉపయోగపడేటట్లు విద్యా వ్యవస్థను రూపొందించి అమలు చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు, నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణా తరగతులు, సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానం, కృత్రిమ మేధా, విద్య గురించి చర్చ ఆవశ్యకత చాలా ఉందని, దేశవ్యాప్తంగా 130 పరిశోధన పత్రాల దరఖాస్తులు రావడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఎలమంచిలి రామకృష్ణ, రాజ్ కుమార్, డాక్టర్ నాగలక్ష్మి, శ్రీనివాసులు, సులేమాన్, శంకర్, వెంకట్ రెడ్డి, నర్సింలు, రాఘవేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, సదాశివయ్య, వేణు, రాజేశ్వరి, పుష్పలత, రుక్యభాను, ప్రవీణ్ కుమార్, మాధురి, వెంకటయ్య, నాగరాజు, ప్రతాప్, నందకిషోర్, వెంకటేశ్వర్లు, విక్రమ్, రజిని, లత తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్లు, వైద్య సేవల పరికరాలు జిల్లా ప్రజలకు ఉపయోగపడాలి..

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి)**

: డ్రోన్లు, వైద్య సేవల పరికరాలు మారుమూల ప్రాంతాల్లోని అంగన్ వాడి సిబ్బంది సేవలకు, రైతులకు, జిల్లా ప్రజలకు ఉపయోగ పడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఈసీఐఎల్ కంపెనీ సిఎస్ఆర్ నిధుల నుండి 20 ఎలక్ట్రానిక్ స్కూటీలు, 12 డ్రోన్లను పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడి సూపర్ వైజర్లు మారుమూల గ్రామాల్లో సేవలు అందించడానికి, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, వైద్య సేవలు సిటీ స్కాన్, ఇతర పరికరాల కోసం ఈసిఐఎల్ సిఎస్ఆర్ నిధులు ఇవ్వడం హర్షనీయమన్నారు. మారుమూల ప్రాంతాలకు అంగన్వాడి సూపర్ వైజర్లు వెళ్ళడానికి రవాణా సౌకర్యాలు లేవని ఎలక్ట్రానిక్ స్కూటీలు కుగ్రామానికి సైతం సులువుగా వెళ్ళడానికి ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ రోజుల్లో వ్యవసాయ పనులకు కూలీలు కొరత ఉందని, ఈ ఆధునిక సాంకేతికత డ్రోన్ల వినియోగం రైతులకు చాలా ఉపయోగమని అన్నారు. రసాయన మందులు పిచికారీ సమయంలో ప్రజలు ప్రాణాలకు అపాయం ఏర్పడుతుందని, డ్రోన్ల వినియోగం ద్వారా ప్రాణాలకు ఎలాంటి అపాయం ఏర్పడదని, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. అలాగే జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలకు సిటీ స్కాన్ ఇతర పరికరాలు ఇవ్వనున్నారని తెలిపారు. రానున్న నెల రోజుల్లో వైద్య పరికరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసిఐఎల్ సి అండ్ ఎండి అనురాగ్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ స్కూటీ లు, డ్రోన్లు, వైద్య పరికరాల కోసం మొత్తం 4 కోట్ల సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. స్కూటీలు, డ్రోన్ల వినియోగం వల్ల అంగన్వాడీ సేవలకు, రైతులకు ఉపయోగకరమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ బాబు రావు, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వ్యవసాయ అధికారి వీరు నాయక్, ఈసిఐఎల్ హెచ్ ఆర్ ఈడీ మురళీధర్, సీఎంఓ వేణుబాబు పాల్గొన్నారు.

# సన్న బియ్యం లబ్దిదారుల ఇంట్లో భోజనం చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 09 (జనంసాక్షి) :**



కరీంనగర్ జ్యోతినగర్ లోని సన్న బియ్యం లబ్ధిదారులు బోనాల భారతి - శంకర్ ఇంట్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల లబ్ధిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని స్వయంగా ఫోన్ చేసి మాఇంటికి భోజనానికి రావాలని నన్ను ఆహ్వానించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కటౌట్ ఏర్పాటు చేసుకొని కటౌట్ ముందు కూర్చోబెట్టి నాకు భోజనం పెట్టారని నరేందర్ రెడ్డి తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం తినలేక ఇబ్బందులు పడ్డామని దళారులు మా ఇండ్ల చుట్టూ దొడ్డు బియ్యం కొంటామని తిరుగేవారని ఇప్పుడు ఆబాధ తప్పిందని అన్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైఖ్య అధ్యక్షురాలు పెద్దిగారి పద్మ తిరుపతి, పుల్లల దేవేంద్ర, శోభారాణి, గడ్డల కోమలత, దయ్యాల మమత తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి చెరువు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

**మంత్రి శ్రీధర్ బాబుకి కృతజ్ఞతలు తెలిపిన కాకర్లపల్లి గ్రామస్తులు, దళితులు**



**మంథని, (జనంసాక్షి)**

పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని రెడ్డి చెరువు కబ్జా కు గురైందని, దళితులకు గతంలో ఇచ్చిన భూమి కబ్జాకు చేశారని కాకర్లపల్లి దళితులు మంథని ఆర్డీఓ కార్యాలయంలో ఇటీవల పిర్యాదు చేశారు. దింతో గ్రామస్థులు, దళితులు పోరాటంతో మంథని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ సర్వేలో 16 ఎకరాల పైగా ప్రభుత్వ భూమి ఉందని తేలింది. ఇట్టి విషయం పై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టి కి తీసుకెళ్లడంతో మంత్రి శ్రీధర్ బాబు స్పందించి రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో అధికారులు సర్వే చేసి బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా చేసి, చెరువులో మోటార్లు పెట్టిన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్, కాకర్లపల్లి మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్,కాకర్లపల్లి గ్రామస్థులు బొసెల్లి శంకర్, బూడిద రవి గ్రామస్థులు కోరారు.

# వాటర్ బోర్డ్ రెవెన్యూ పెంచాలి ఈడీ మయాంక్ మిట్టల్



**హైదరాబాద్ (జనంసాక్షి)**

జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ జలమండలి అధికారులతో బుధవారం రోజున ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ రెవెన్యూ పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా ఇప్పటీవరకు అధిక బకాయిఉన్న కనెక్షన్లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రతినెల బోర్డుకు మరింత ఆదాయం సమకూరనుందని ఈడీ తెలిపారు. అలాగే వాణిజ్య కనెక్షన్ల బకాయిలపైన దృష్టి సారించాలని, దీర్ఘ కాలంగా బిల్లులు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల నుంచి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి ఈఎన్సీ- ఆపరేషన్ డైరెక్టర్ -2 వివెల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ -1 అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి మూల్యాంకనం పారదర్శకంగా చేపట్టాలి



**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :**

10వ తరగతి పరీక్షల సంబంధిత జవాబు పత్రాలమూల్యాంకనం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల కార్మెల్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలోఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మికంగాసందర్శించి మూల్యాంకనం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లాడుతూ.... 10వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో ఉపాధ్యాయులు, సిబ్బందిపారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి పక్షపాతం చూపకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరిజీవితంలో 10వ తరగతి పునాది వంటిదని, ఎలాంటి పొర పాట్లకు తావు లేకుండా వ్యవహ రిం చాలనితెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాల యాన్ని సందర్శిం చి ఆర్డీఓ శ్రీనివాస రావుతో కలిసి 163జి జాతీయ రహదారి విస్తరణలో భూములుకోల్పోయిన బాధితుల వివరాలను పరిశీలించారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయరహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారంఅందించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్నవారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అరగంట వ్యవధిలో బాలుని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి)**



బుధవారం సాయంత్రం 4:30గం.లకు కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పోతారం గ్రామం, చెందిన వల్లపు నర్సవ్వ అను ఆమె, ఆమె తో పాటుగా మనమడు అయిన ఈశ్వర్, వయసు: 4 సం.లు గల అబ్బాయిని తీసుకుని వచ్చి, ఆ అబ్బాయిని అక్కడే బస్ స్టాండ్ లో కూర్చోబెట్టి, ప్రక్కన గల షాప్ కి జ్యూస్ త్రాగడానికి తీసుకుని వద్దామనీ వెళ్ళి, తిరిగి ఒక 5 నిమిషాల తర్వాత వచ్చి చూడగా, అక్కడ కూర్చోబెట్టిన అబ్బాయి కనబడకపోయేసరికి, వెంటనే పోలీస్ స్టేషన్ కి వచ్చి, జరిగిన విషయం చెప్పగా, వెంటనే స్పందించిన కామారెడ్డి పట్టణ పోలీస్ వారు బస్ స్టాండ్ లో ఉన్న CCTV కెమెరాలు పరిశీలించి, అక్కడే బస్ స్టాండ్ వద్ద డ్యూటీ లో ఉన్న డబ్ల్యూ సి పి శిరీష ను అలెర్ట్ చేయగా, చుట్టూ ప్రక్కల వెతికి అశోక్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఆ అబ్బాయిని గమనించి, అతడిని తీసుకుని పోలీస్ స్టేషన్కు రావడం జరిగింది. ఆ అబ్బాయిని అతని తండ్రి ఆలకుంట ఎల్లయ్య మరియు అమ్మమ్మ నర్సవ్వ లకు అప్పగించడం జరిగింది.కేవలం అర్ధ గంట వ్యవధిలోనే తప్పిపోయిన అబ్బాయిని కుటుంబ సభ్యులకు అప్పగించడం తో, వారు చాలా ఆనందించడం జరిగింది.త్వరగా స్పందించిన డబ్ల్యూ పి సి శిరీష ను పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి అభినందించడం జరిగింది.

# హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలించిన సీవీ ఆనంద్

**హైదరాబాద్ (జనంసాక్షి)**



వీర హనుమాన్ విజయ శోభాయాత్ర ఏర్పాట్లను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వ ర్య వే క్షిం చా రు. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ జరగ నున్న ప్రాంతంలో జరుగు తున్న ఏర్పాట్లను హిందూ ధార్మిక సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు.

రాష్ట్రస్థాయి వీహెచ్‌పీ భజరంగ్‌దళ్ నాయకులతో పాటు వివిధ శాఖల అధికారులతో సీవీ ఆనంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. గత సంవత్సరం జరిగిన లోటుపాట్లను సరి చేసుకుంటూ ఈ ఏడాది శోభయాత్ర విజయవంతం అయ్యేవిధంగా కృషి చేస్తామని తెలిపారు.రహదారుల మరమ్మతులు, మంచినీటి సౌకర్యంతో పాటు పలు అంశాలపై సూచనలు చేశామని పేర్కొన్నారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 42 ర్యాలీలు శోభాయాత్రలో కలుస్తాయని చెప్పారు. సమయపాలన పాటిస్తూ శోభాయాత్రను విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నల్లాకు మోటర్ బిగిస్తే రూ.5 వేలు జరిమానా

**తక్షణమే మోటర్ సీజ్... కనెక్షన్ కట్**

**ఏప్రిల్ 15 నుంచి వాటర్ స్పెషల్ డ్రై వ్**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



నల్లాల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఓ అండ్ ఎమ్ సీజీఎం, జీఎం లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జలమండలి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తోందని, కాబట్టి.. నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. రానున్నరోజులలో నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని వృధా చేయకూడని విజ్ఞప్తి చేసారు. అలాగే నల్లలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగదారులకు లో ప్రెషర్ తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు.వేసవిలో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉండేందుకు సాధ్యమైన అన్ని మార్గాలపై జలమండలి ప్రత్యే దృష్టి సారించింది. ఇప్పటి వరకు తాగునీరు సరఫరాలో ఎలాంటి కొరత లేనప్పటికి కొందరు వినియోగదారుల తీరుతో లో ప్రెషర్ (తక్కువ ఒత్తిడి)తో నీటి సరఫరా సమస్య ఉత్పన్నం కావడాన్ని జలమండలి సీరియస్‌గా పరిగణించింది. నల్లాకు అక్రమంగా మోటర్లు బిగించే కనెక్షన్ దారులపై కొరఢా ఝులిపించాలని నిర్ణయించింది. నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తాం. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ- ఆపరేషన్ డైరెక్టర్ -2 వివెల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ -1 అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 12న తెలంగాణ జడ్జిల వార్షిక సమావేశం

**హైదరాబాద్ (జనంసాక్షి)**

ఈ నెల 12న తెలంగాణ జడ్జిల సంఘం వార్షిక జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేసినట్టు ప్రధాన కార్యదర్శి మురళీమోహన్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. సికింద్రాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహా, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ లక్ష్మణ్ హాజరుకానున్నారని తెలిపారు. తెలంగాణ జడ్జిల మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సోసైటీ తరపున మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు గృహ నిర్మాణాల గురించి ప్రత్యేక చర్చ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జడ్జిల సంఘం అధ్యక్షులు కె.ప్రభాకర్‌రావు, బి.పాపిరెడ్డి (హౌజింగ్ సోసైటీ అధ్యక్షులు)తో పాటు సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

# రైలు ఢీ కొని రైల్వే ట్రాక్ మెన్ మృతి

**హైదరాబాద్ (జనం సాక్షి) :**

రైలు పట్టాలు దాటుతున్న రైల్వే ట్రాక్ మెన్‌ను రైలు ఢీ కొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం..అల్వాల్ ప్రాంతానికి చెందిన సురేష్ (40) వృత్తి రీత్యా రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహించిన అనంతరం సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ప్లాట్ ఫారం నెంబర్ 1-2 మధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

**ఐటీ ఉద్యోగికి రెండు ల్యాప్‌టాప్‌ల అందజేత**



**హైదరాబాద్ (జనం సాక్షి)**

హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఆటోలో ఓ ఐటీ ఉద్యోగి మరిచిపోయిన రెండు లాప్‌టాప్‌లను పోలీసులకు అందజేశాడు. అతని నిజాయితీని మెచ్చుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు ఆటో డ్రైవర్‌కు వెయ్యి రూపాయల నగదు బహుమతి ఇచచి సన్మానించారు. పోలీసుల కథనం ప్రకారం.. చైతన్యపురి సాయి రాఘవేంద్ర రెసిడెన్సీకి చెందిన శ్రీనివాసరావు ఐటీ ఉద్యోగి. ఈ నెల 3వ తేదీన సీతారాంబాగ్‌లో విధులు ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన పడిగె రాంచందర్ ఆటో ఎక్కాడు. తాను దిగాల్సిన చోటు రావడంతో శ్రీనివాసరావు హడావుడిగా వెళ్లిపోయాడు. ఆ సమయంలో ఆఫీసుకు చెందిన రెండు ల్యాప్‌టాప్‌లను ఆటోలోనే మరిచిపోయాడు. కొద్దిసేపటికి లాప్‌టాప్‌లు మరిచిపోయిన సంగతి గుర్తుకురావడంతో వెంటనే చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఇదిలా ఉంటే శ్రీనివాసరావు దిగిన చాలాసేపటికి ఆటోలో ల్యాప్‌టాప్‌లను గమనించిన రాంచందర్.. వాటిని మహంకాళి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా, మహంకాళి పోలీస్ స్టేషన్, చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సమన్వయంతో రెండు ల్యాప్‌టాప్‌లను బుధవారం నాడు శ్రీనివాసరావుకు అందజేశారు. అలాగే ఆటో డ్రైవర్ నిజాయితీని మెచ్చుకున్న పోలీసులు.. అతనికి రూ.1000 నగదు పురస్కారాన్ని ఇచ్చి ఘనంగా సన్మానించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 ఏప్రిల్ 2025

# కిడ్నాప్, హత్యానేరంలో నిందితుల అరెస్ట్

- తొమ్మిది మంది అరెస్ట్, పరారీలో ఒకరు
- ఒక కారు, రెండు బైక్, పది సెల్ ఫోన్, రెండు కత్తులు స్వాధీనం
- పోలీస్ సిబ్బందిని అభినందించిన డిఎస్పీ



**నాగార్జునసాగర్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** కిడ్నాప్ చేసి హత్య చేసిన కేసులో నిందితులను నాగార్జునసాగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు .నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్ లో మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, సి.ఐ శ్రీను నాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..గత 2వ తేదీన పండ్ల నిర్మల తన భర్త హరిచంద్ర పెంక్షన్ కొరకు నల్గొండ జిల్లా కనగల్ నుండి నాగార్జునసాగర్‌కు రాగా పాత గొడవలు నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్రం, పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, పసువేముల గ్రామానికి చెందిన వారు కిడ్నాప్ చేశారని విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా వెంటనే స్పందించి సాగర్ సర్కిల్ సి.ఐ శ్రీను నాయక్,ఎస్.ఐ సంపత్, ఎస్.ఐ వీరబాబు, ఎస్.ఐ వీర శేఖర్ ల ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి అన్ని సి.సి.టి.వి లు పరిశీలించి నేరస్తులను గుర్తించి ప్రధాన ముద్దాయి బెజవాడ కోటమ్మను 4వ తేదీన 7వ మైల్ వద్ద అరెస్ట్ చేసి విచారించగా కోటమ్మకు వరుసకు కొడుకు అయిన బెజవాడ బ్రహ్మం కు మృతుడు కూతురితో గత పది సంవత్సరాల క్రితం వివాహం జరిగి తర్వాత ఇరువురి కుటుంబ సభ్యులకు గొడవలు జరగగా ఈ గొడవలో కోటమ్మ కొడుకు రమేష్ మరియు ఇతర కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడినరని అప్పుడు మృతుడు హరీష్ చంద్ర మరియు అతని కుటుంబ సభ్యులపై రైట్ బ్యాంక్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని ప్రస్తుతం మృతుడు ప్రాణభయంతో కనగల్ గ్రామం నందు కూలి పని చేసుకుంటూ భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. అప్పటినుండి కోటమ్మ మరియు అతని కుటుంబ సభ్యులు మృతుడిపై పగ పెంచుకొని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకొని అవకాశం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో మృతుడు గత నెలలో కనగల్ నుండి నాగార్జునసాగర్ కు వచ్చి పెన్షన్ తీసుకుని వెళుతున్నాడని తెలుసుకొని రెండవ తేదీన కూడా పెన్షన్ కొరకు మృతుడు సాగర్ కు వస్తాడని పసువేముల గ్రామపంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్ నాగయ్య ద్వారా తెలుసుకొని పశువైముల నుండి నేరస్తులు బెజవాడ వెంకటేశ్వర్లు, పండ్ల కోటేశ్వరరావు పల్సర్ బైక్ పై బెజవాడ కోటమ్మ, మహేష్, భార్గవులు హెూండా షైన్ బైక్ పై సాగర్ లోని పైలాన్ ఆటో స్టాండ్ వద్దకు వచ్చి అప్పటికే అక్కడ మరొక నేరస్తుడు నెలమట్ల భాస్కర్ తన మారుతి స్విఫ్ట్ డిజైర్ కారుతో పాటు ఉండగా బెజవాడ కోటమ్మ, బెజవాడ వెంకటేశ్వర్లు కారులోకి ఎక్కినారు కోటి బైక్లో తెచ్చిన రెండు కత్తులలో ఒక కత్తిని కార్లో పెట్టుకోగా రెండో కత్తిని భార్గవ్ బైక్ లో పెట్టుకున్నారు. కోటేశ్వరరావు తన పల్సర్ బైక్ను ఆటో స్టాండ్ వద్ద పెట్టి భార్గవ్ సైన్ బండి ఎక్కి హిల్ కాలనీ కి వచ్చారు. ఐదుగురు నేరస్తులు హిల్ కాలనిలో గల ఇందిరాగాంధీ బొమ్మ దగ్గర రోడ్డు ప్రక్కకు కారు మరియు బైకును ఆపుకొని హరిచంద్ర కొరకు ఎదురు చూస్తుండగా హరిచంద్ర సత్యనారాయణ స్వామి గుడి వైపు నుండి రోడ్డు దాటి ఇందిరా గాంధీ బొమ్మ దగ్గరికి వచ్చేసరికి అందాజ 10 గంటల సమయంలో మృతుడి బలవంతంగా కారులో ఎక్కించుకొని కోటమ్మ కోటి మరియు భాస్కర్లు కారులోనే హరిచంద్ర పై దాడి చేసి చేతులతో గట్టిగా కొట్టుకుంటూ మాచర్ల వైపు ఎత్తిపోతల చెక్పోస్టు దాటిన తర్వాత కార్ని త్రిప్పి చెంచురాంపురం దాటిన తర్వాత ఒక కిలోమీటర్ ముందుకు వెళ్లి కార్ని రోడ్డు ఎడమవైపుకి ఆపి ఐదుగురు నేరస్తులు మృతుడిని కారులో నుండి దింపి కొట్టుకుంటూ ఆ ప్రక్కన గల వీరు చిలకలోకి అందాగా 2 అడుగుల లోపలికి హరిచంద్రని తీసుకెళ్లగా అక్కడికి బెజవాడ బ్రహ్మం కూడా చేరుకొని అక్కడ అందరూ కలిసి హరిచంద్రని కొట్టి కిందపడేసి పెద్ద గుండు రాళ్ళను మృతుడి తలపై మోదీ అతి కిరాతకంగా హత్య చేశారు రాళ్లతో గట్టిగా కొట్టడం వలన హరిచంద్ర తలపగిలి తీవ్రముగా రక్తము కారి అక్కడికక్కడే చనిపోయారు అక్కడి నుండి భాస్కర్, భార్గవ్, కోటి, వెంకన్నలు కారులో వాడపల్లి మీదుగా హైదరాబాద్ పారిపోగా కోటమ్మ, బెజవాడ బ్రహ్మం పారిపోయారని తెలిపారు. నిందితుల కోసం వెతుకుతుండగా మంగళవారం మధ్యాహ్నం నమ్మదగిన సమాచారంతో హత్యలో పాల్గొన్న నిందితులతో పాటు వారికి ఆశ్రయం ఇచ్చిన నేలమట్ట బ్రహ్మం, మట్టపల్లి కోటేశ్వరరావు ఇద్దరితో కలిసి షిఫ్ట్ డిజైనర్ కార్లో అడ్వకేట్ ను కలవడానికి మాచర్ల వైపు వెళుతుండగా సాగర్ ఫారెస్ట్ ఆఫీసు వద్ద ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది అని తెలిపారు. వీరు ఇచ్చిన సమాచారం మేరకు హత్యతో సంబంధం ఉన్న ఇతర నేరస్తులు అయిన బెజవాడ బ్రహ్మం, దోసపాటి నాగయ్యలను రైట్ బ్యాంకులో గల మాత సరోవర్ హెూటల్ దగ్గర అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. నిందితుల నుండి మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు, మరియు రెండు ద్విచక్ర వాహనాలు, 10 సెల్ ఫోన్లు,2 కత్తులను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇట్టి కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీను నాయక్, ఎస్ఐలు సంపత్, వీరబాబు, వీరశేఖర్ మరియు పోలీసులు హేమంత్, వెంకన్న, రామకోటి, జావిద్, ప్రశాంత్, రాంప్రసాద్, హెచ్.జి లు శ్రీకాంత్, నరసింహ ఇతర సిబ్బందిని డిఎస్పి రాజశేఖర్ రాజు అభినందించడం జరిగింది.

## గాలివానతో నష్టపోయిన మామిడి, వరి రైతులు

- లక్షల్లో నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



**చంద్రుగొండ, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** చంద్రుగొండ మండలంలో మంగళవారం సాయంత్రం వానకి తోడు గాలి వీచడంతో పెద్ద ఎత్తున మామిడి, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న, వరి నేల బారాయి. మండలంలో సుమారు 650 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా వాటిలో ఎక్కువ మొత్తంలో మామిడి కాయలు గాలి వానకు రాలిపోయాయి. 150 ఎకరాల్లో వరి పంట నష్టపోగా 60 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది. వ్యవసాయ శాఖ అధికారి వినయ్ మండలంలో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న తోటలను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అగ్రికల్చర్ ఏఈఓ శ్రీనివాస్ ఉద్యానవన శాఖ హెచ్ఓ స్రవంతి, శ్రీనివాసులు రాలిన మామిడి తోటలను పరిశీలించారు. అయ్యన్నపాలెంలో నరుకుల్ల వాసు, చంద్రుగొండలో అంకిరెడ్డి కృష్ణారెడ్డి తోటల తో పాటు తదితర నష్టపోయిన మామిడి తోటలను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఎన్ఐటి నాగపూర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో పారమిత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఎన్.ఐ.టి నాగపూర్ లో ఇటీవల నిర్వహించిన డెక్సర ఆక్సెస్' 25 ఆప్టిట్యూడ్ టెస్ట్ లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు 7వ తరగతి సారాసర్ఫరాజ్, 8వ తరగతి లింగాల హర్షిత, 9వతరగతి కందుకూరి రిషిత అత్యుత్తమ ప్రతిభ కనబరచి రెండవ రౌండ్ కి అర్హత సాధించారు. నాగపూర్ ఎన్.ఐ.టి మార్చి 22, 23 తేదీలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలలో పలు రాష్ట్రాల విద్యార్థులు నాలుగు విభాగాల క్రింద పాల్గొనగా 2వ విభాగంలో 9వ తరగతి చదువుతున్న కందుకూరి రిషిత అద్భుత ప్రతిభ కనబరచి ఈ పోటీలో మొదటి స్థానంలో నిలిచి రూ. 8,000 (నగదు) అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విధ్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, హనుమంతరావు, టి. యస్వి. రమణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్ సమన్వయకర్తలు ఉపాధ్యాయులు అభినందించారు.

## విడిసిలు చట్టాలకు లోబడే తమ కార్యకలాపాలు నిర్వహించాలి

- పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి



**నిజామాబాద్/ఆర్మూర్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** జిల్లాలోని గ్రామాభివృద్ధి కమిటీల ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన పోలీస్ స్టేషన్ అధికారిని సంప్రదించాలని,విడీసీలు ఎలాంటి బహిష్కరణలు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు. గ్రామాభివృద్ధి కమిటీలు గత 15 సంవత్సరాలక్రితం కొన్ని గ్రామాలలో గ్రామాభివృద్ధి కోసం గ్రామభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. గ్రామాలలో గ్రామాభివృద్ధి అవసరాలకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు పొందకుండా తమ అవసరాలను తీర్చుకోవడం కోసం గ్రామాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు.కాలక్రమేణ ఈ గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో అభివృద్ధి కార్యక్రమాలను కాకుండా గ్రామాలలో జరిగే సివిల్ తగాదాలు, భూ తగాదాలు, వివాహ సంబంధ తగాదాలు అన్నదమ్ముల తగాదాలు, భార్యభర్తల తగాదాలలో వారిని పిలిపించి, అట్టి పంచాయితీలలో వారు వినని యెడల వారికి దండుగా వేసి చట్టం చేయవలసిన పనిని వారి చేతులోనికి తీసుకొని,వాళ్ళను పోలీస్ స్టేషన్ కు, న్యాయ స్థానాన్ని ఆశ్రయించకుండా గ్రామ ప్రజలను తాము చెప్పిన విధంగా వినాలని ఎవ్వరూకూడా పోలీస్ స్టేషన్, న్యాయస్థానాన్ని ఆశ్రయించరాదని లేనియెడల మా మాట వినని వారిని ఆ గ్రామం నుండి వెలివేస్తాము అని, భయబ్రాంతులకు గురిచేసి, గ్రామంలో డబ్బులు వసూలు చేయడానికి గ్రామాభివృద్ధి కమిటి పేరుతో బెల్టుషాపులు, కూల్ డ్రింక్ షాపులు, కిరాణ షాపు మరియు కోడిగ్రుడ్డు ధరపై యాక్షన్ (వేలం వేయడం) వేయడంలో ఎవరు ఎక్కువధర చెల్లిస్తారో ఆ వ్యక్తి మాత్రమే ఆ గ్రామంలో ఆ వస్తువులను అమ్మేటట్లు నియమముగా పెట్టి డబ్బులు వసూళ్ళు చేస్తారు.ఆ గ్రామంలో ఎప్పుడైన పంచాయితీలు నిర్వహించినప్పుడు ఇరువర్గాల నుండి డబ్బులు వసూళ్లు చేసి పంచాయితీలను నిర్వహిస్తారు. అట్టి డబ్బును విచ్చలవిడిగా ఖర్చుచేస్తారు. కావున గ్రామాభివృద్ధి కమిటి నిర్వహించే కార్యకలాపాలు పూర్తిగా చట్టవ్యతిరేకం.దేశంలో గల ఏ వ్యక్తి అయిన భారత ప్రభుత్వం చట్టాలను గౌరవించి ఆ చట్టాలకు లోబడే తమ కార్యకలాపాలు నిర్వహించాలి. ఎవ్వరికైన ఎలాంటి సమస్యలు వచ్చిన సంబంధిత శాఖలను సంప్రదించి ఆ శాఖ నుండి సహాయసహకారాలు పొందాలి. కాని గ్రామాభివృద్ధి కమిటి వారు వాళ్లు చెప్పిందే శాసనం అని, చట్టం అని చెప్పి ప్రజలను భయబ్రాంతులకు గురిచేసి తప్పుడ్రోవ పట్టిస్తే చర్యలు తప్పవని మాట్లాడారు.

## ప్రాణం తీసిన కోడి పుంజు..!



**మంథని, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని సిద్దిపల్లె గ్రామానికి చెందిన నామని రాజేశం (70) అనే రైతు బుధవారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నామని రాజేశం సిద్దిపల్లెలోని తన వ్యవసాయ భూమిలో సాగు చేసిన వరి పంట కోతకు రావడంతో సంప్రదాయ పద్దతిలో కోడి పుంజును కొనుక్కుని పోత లింగన్న గుడి వద్ద కోసేందుకు సంచిలో నుండి కోడి పుంజును బయటకు తీశాడు. ఈ క్రమంలో కోడి పుంజు ఎగిరిపోయింది. దానిని దొరకబట్టే క్రమంలో ఎగిరిన కోడి పుంజు బావులోకి దూకింది. దానిని పట్టుకునే క్రమంలో రాజేశం ప్రమాదవ శాత్తు కాలు జారీ వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవ్వరు లేకపోవడంతో రాజేశం బావిలోనే మృతి చెందాడు. కోడి కోయడం కోసం పొలం వద్దకు వెళ్లి తిరిగిరాక పోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా ఆ బావిలో పడిపోయినట్లు గుర్తించారు. ఈ మేరకు కమాన్ పూర్ పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ బావిలో నుండి రాజేశం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కమాన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి జాతీయస్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ఆల్ ఇండియా 3వ ర్యాంకు



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఆంగ్ల భాషకు విశిష్టత ఉన్నదని, ప్రపంచంలో అత్యధిక జనాబా ఆంగ్ల భాషలో మాట్లాడుతారని ఆంగ్ల భాష ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకుంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో విద్యార్థి జాతీయ స్థాయి యునిఫైడ్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో ఆల్ ఇండియా 3 వ ర్యాంకు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆంగ్ల భాష ద్వారా ఖ్యాతి పొందడమే కాకుండా ఉద్యోగ సాధన సులభతరం చేయగలుగుతామని తెలుపుతూ ప్రతి విద్యార్థి ఆంగ్ల భాష ద్వారా ఆసక్తి కనబర్చడమే కాకుండా ధారళంగా మాట్లాడేందుకు కృషి చేసి ఉపాధి అవకాశాలను మెరుగు పర్చుకోవడం ద్వారా ఉత్తమంగా సమాజంలో ఉంటారని వారు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో హైదారాబాదికి చెందిన ప్రముఖ పోటీల సంస్థల అయిన యునిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించినటువంటి జాతీయ స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో పాఠశాలకు చెందిన ఎం. శీవేన్ రెడ్డి, 7వ తరగతి, అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చి జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు సాధించడంతో పాటు రూ. 10,000 నగదు బహుమతిని గెల్చుకోవడం చాలా గొప్ప విషయమని ప్రశంసిస్తూ విజేతకు ప్రశంసా పత్రం బహుకరించారు. ఈ అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస పథకానికి ఈ నెల14లోపు దరఖాస్తు చేసుకోండి



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబిసి,ఈడబ్ల్యుఎస్ వర్గాలలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కింద ఆర్థిక సహాయం అందించేందుకుగాను, ఉద్దేశించి అమలు చేయనున్న రాజీవ్ యువ వికాస పథకానికి ఈనెల14 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకుగాను,గ్రామాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో టామ్ టామ్ నిర్వహించాలని ఆమె అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ జిల్లా,మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ సందర్భంగా,రాజీవ్ యువ వికాస పథకంపై మాట్లాడుతూ ఈ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలకు 21నుండి 60 సంవత్సరాల వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని, వ్యవసాయేతర పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు 21నుండి 55 సంవత్సరాల వరకు వయస్సున్నవారు అర్హులని తెలిపారు.

## తల్లిదండ్రులకు భగవంతుడు ఇచ్చిన ఆత్మీయ కానుక ఆడపిల్ల


- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ఖమ్మం పట్టణం సారధి నగర్‌లోని మౌనిక - సురేష్ దంపతులకు 2025, మార్చి 1న ఆడపిల్ల జన్మించిందని, (మా పాప మా ఇంటి మణి దీపం) కార్యక్రమంలో భాగంగా బుధవారం ఈ కుటుంబానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, బట్టలు, సర్టిఫికెట్ అందించి తల్లిదండ్రులను, అత్తమామలు ఆరూరి మంగమ్మ, ఆరూరి నరసింహాలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రేమానురాగాలకు ప్రతీకైన ఆడపిల్ల పుట్టడం తల్లిదండ్రులకు భగవంతుడు ఇచ్చిన ఆత్మీయ కానుక ఆడపిల్ల అని, ఆడపిల్ల పుడితే భారంగా భావించకుండా అదృష్టంగా భావించి అమ్మాయి ఆశించిన మేరకు చదువుకున్న తర్వాత ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిరపడి సొంత ఆదాయ వనరులు సంపాదించుకున్న తర్వాత మాత్రమే పెళ్ళి గురించి ఆలోచించాలని, ఆడపిల్లల భావాలకు గౌరవం ఇవ్వాలని తెలిపారు.ఇంటిలో అమ్మాయిలు ఉంటే ఇల్లు కళ కళ లాడుతుందని, ప్రతి ఆడపిల్లను ఉన్నత చదువులు చదివించాలని, కుటుంబానికి గొప్ప పేరు తీసుకుని వస్తుందని అన్నారు. మౌనిక - సురేష్ దంపతుల కోరిక మేరకు పెద్ద పాప రితికకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం గావించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సన్న బియ్యం అందిన వివరాలు తెలుసుకుని, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రామ్ గోపాల్ రెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసిల్దార్ రవి కుమార్, సిడీపీఓ వీరభద్రమ్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపెద్దమ్మ పెద్దిరాజులకు ప్రత్యేక పూజలు చేసిన కేటీఆర్

- కళ్యాణ మహెూత్సవ వార్షికోత్సవానికి ముందస్తు హాజరు



**గంభీరావుపేట, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహెూత్సవ 50వ వార్షికోత్సవానికి ముందస్తుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు అనంతరం పెద్దమ్మ పెద్దిరాజులకు ముందస్తు ప్రత్యేక పూజలు నిర్వహించారు ముదిరాజ్ కుల బాంధవులు కేటీఆర్‌కు ముందుగా శాలువాతో సన్మానించి పూలమాలతో ఆలయంలోకి ఆహ్వానించారు ఆలయంలో అర్చకుల చేత కేటీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు అందరం అర్చకులు కేటీఆర్ కు తీర్థ ప్రసాదాలు అందించారు అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతికగా నిలుస్తాయని పేర్కొన్నారు కేటీఆర్ ముదిరాజ్ కుల బాంధవులకు కళ్యాణ వార్షికోత్సవ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల ఆశీర్వచనాలతో తెలంగాణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మండల అధ్యక్షులు పాపగారి వెంకటస్వామి గౌడ్ సెస్ డైరెక్టర్ నారాయణరావు గంభీరావుపేట పట్టణ అధ్యక్షులు పెద్దవేని వెంకట యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి గంద్యడపు రాజు మాజీ ఎంపీటీసీలు ఎగదండి స్వామి. గోగు లింగంయాదవ్. చిట్టంపల్లి రాజు. మైనార్టీ నాయకులు మహబూబ్ అలీ. వహీద్. నాయకులు సింగారపు నాగరాజు గౌడ్ చేరాల వెంకటస్వామి గౌడ్. పాపగారి శ్రీనివాస్ గౌడ్. కలకుంట్ల బాలకిషన్ రావు. బరిగల అభిలాష్. కొలనూరి వేణు. చెవుల మల్లేశం. బండ రమేష్. చిట్టంపల్లి బిక్షపతి పటేల్. నగేష్ ముదిరాజ్ కుల బాంధవులు పిట్ల నర్సింలు. పిట్ల బాబు. ఇరబోయిన శివయ్య. నాగారపు దేవయ్య. ఇరవేణి సంజువ్. సుతారి బాలవ్వ. శ్రీమతి.దండవేని మీను తోపాటు బిఆర్ఎస్ నాయకులు ముదిరాజ్ కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి



**కల్లూరు, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ప్రభుత్వం ఐకెపిడి ఆర్‌డిఐ, సొసైటీల ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రాశు లుగా పోసుకొని ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెపి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. బుధవారం కల్లూరు మండల పరిధిలో పేరు వంచ గ్రామంలో కొర్లగూడెం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నంబూరి రామలింగేశ్వరరావు బిజెపి కల్లూరు మండల అధ్యక్షులు గుమ్మ రామకృష్ణ పలువురు బిజెపిపార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు సంబంధించి గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయా మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు ముందుకు వస్తున్నారా.. అకాల వర్షాల వల్ల రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలను రైతుల ద్వారా వివరాలు సేకరించారు. ధాన్యం కొనుగోలు విషయంపై రైతుల సమస్యలపై జిల్లా ఉన్నతఅధికారులతో మాట్లాడుతానని రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా నంబూరి రామలింగేశ్వరరావుమాట్లాడుతూ తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి అనువైన కల్లాలు లేక రైతు పొలాల్లోనే ధాన్యపు రాశులుగా పోసుకొని పట్టాలు కప్పుకొని అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. కొర్లగూడెం మార్కెట్ చైర్మన్ కీసర వెంకటేశ్వర రెడ్డి మార్కెట్ సీఈవో వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వపరంగా రైతులకు సరిపడా గన్ని సంచులు సరఫరా చేయాలని కోరారు.. కల్లూరు మండలం లోనే దాదాపు 7 లక్షల క్వింటాల వరకు ధాన్యం పొలాల్లో రాశులుగా పోసి ఉంది. ఇప్పటివరకు ప్రభుత్వం కాంట వేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది.కొన్నిచోట్ల కంటా వేసిన గాని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు.ముఖ్యంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలో మిల్లర్లు మొత్తం రింగ్ అయ్యి ధాన్యం కొనుగోలు విషయంలో సరైన సమాధానం చెప్పకుండా రోజులు గడుపుతున్నారని అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాల వల్ల చాలా చోట్ల వరి ధాన్యం తడిచిపోవడం, వరి పొలాల్లో వరి నేలకొరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు .ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాలు ఏర్పాటు చేయాలి.వెంటనే మిల్లర్లతో మాట్లాడి కొనుగోలుకు చర్యలు చేపట్టాలి. అకాల వర్షాల వల్ల తడిచిన ఆఖరి గింజ కూడా కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో. మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ మండల ప్రధాన కార్యదర్శి గుండప్పనేని అనిల్ ,వెంకటరెడ్డి మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఆనంగి నరసింహారావు మండల యువ మోర్చాఅధ్యక్షుడు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## ఏడేళ్ల తర్వాత రీఎంట్రీ

### భారత్‌లో మళ్లీ అల్కటెల్ ఫోన్లు..



**జనంసాక్షి:** దేశీ మొబైల్ ఫోన్ల మార్కెట్‌లో అల్కటెల్ బ్రాండ్‌ను తిరిగి ప్రవేశపెట్టనున్నట్లు నెక్ట్స్‌సెల్ ఇండియా తాజాగా పేర్కొంది. ఇందుకు వీలుగా తొలి దశలో 3 కోట్ల డాలర్లు(రూ.260 కోట్లు) ఇన్వెస్ట్ చేయను న్నట్లు వెల్లడించింది. వెరసి ఏడేళ్ల తదుపరి తిరిగి దేశీయంగా అల్కటెల్ బ్రాండ్‌ను విడుదల చేయనుంది. భారత్‌తోపాటు ప్రపంచ మార్కెట్లకు అవసరమయ్యే ప్రత్యేక ఫీచర్స్‌తో స్మార్ట్‌ఫోన్లను రూపొందించడంపై దృష్టి పెట్టనున్నట్లు నెక్ట్స్‌సెల్ ఇండియా వివరించింది. నోకియాతో ట్రేడ్‌మార్క్ ఒప్పందం కింద అల్కటెల్ బ్రాండ్‌ను చైనీస్ కంపెనీ టీసీఎల్ కమ్యూనికేషన్ నిర్వహిస్తోంది. దేశీయంగా అల్కటెల్ బ్రాండ్ అధీకృత హక్కులను నెక్ట్స్‌సెల్ ఇండియా కలిగి ఉంది. దీంతో అల్కటెల్ ప్రొడక్టుల సంబంధిత అన్నిరకాల కార్యకలాపాలను కంపెనీ నిర్వహించ నున్నట్లు నెక్ట్స్‌సెల్ ఇండియా చీఫ్ బిజినెస్ అధికారి అతుల్ వివేక్ వెల్లడించారు. రూ. 20,000 నుంచి రూ. 25,000 ధరల శ్రేణిలో తమకు మంచి అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇదే స్థాయి లో స్టైలస్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్‌లను లాంచ్ చేయబోతున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో తమ బ్రాండ్ ఫోన్ల అమ్మకం కోసం ప్రముఖ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కూడా కుదుర్చుకున్నట్లు వివరించారు.

## గ్లోబల్ కంపెనీల కోసం వేట

### భాగస్వామికోసం అన్వేషిస్తున్న 'వేదాంతా'



**జనంసాక్షి:** విస్తరణ ప్రాజెక్టులకు దన్నుని చ్చేందుకు వీలుగా మైనింగ్ దిగ్గజం వేదాంతా గ్లోబల్ భాగస్వామికోసం అన్వే షిస్తున్నట్లు పేర్కొంది. వివిధ విభాగాలలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో చేపట్టనున్న ప్రాజెక్టులకు మద్దతిచ్చే దిగ్గజంతో జత కట్టే యోచనలో ఉన్నట్లు తెలిపింది. ఇది కంపెనీ భవిష్యత్తు కార్యకలాపాలకు ఎంతో తోడ్పడుతుందని చెప్పింది. రానున్న మూడేళ్లలో భారీ విస్తరణ ప్రణాళికలు అమలు చేయనున్న కంపెనీ ఇందుకు ప్రపంచస్థాయిలో అనుభవమున్న ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్(ఈపీసీఎం) దిగ్గజం కోసం చూస్తున్నట్లు వెల్లడించింది. గ్రూప్ బిజినెస్‌లను వేదాంతా అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఐరన్ అండ్ స్టీల్ పేరుతో నాలుగు విభాగాలుగా విడదీయనుంది. రానున్న మూడేళ్లలో మెటల్స్, మైనింగ్, హైడ్రోకార్బన్స్‌పై 20 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు కంపెనీ తెలియజేసింది. ఇందుకు ఆసక్తిగల కంపెనీల నుంచి ఈ ఏప్రిల్ 30లోగా ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం ప్రకటించిన విడదీత ప్రణాళికలను జూన్–జులైకు వాయిదా వేసింది.

# ముంచిన ఐటీ, బ్యాంకు షేర్లు

## ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా.. నష్టాల్లోనే స్టాక్‌మార్కెట్లు..



**జనంసాక్షి:** దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ ఈరోజు 379.93 పాయింట్లు (0.51 శాతం) క్షీణించి 73,847.15 వద్ద ముగిసింది. అలాగే ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 కూడా 136.70 పాయింట్లు లేదా 0.61 శాతం క్షీణించి 22,399.15 వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ 0.73 శాతం, స్మాల్ క్యాప్ 1.08 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో నిఫ్టీ ఐటీ, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, హెల్త్‌కేర్ 1.11 శాతం నుంచి 2.25 శాతం మధ్య తీవ్ర నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ప్యాక్ నుంచి 30 షేర్లలో 17 నష్టాల్లో ముగియగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టూబ్రో, టాటా స్టీల్ 3.4 శాతం వరకు నష్టపోయాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతం నుండి 6 శాతానికి తగ్గించడంతో బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు నష్టాలతో ముగిశాయి. పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితుల మధ్య ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వాలనే ఉద్దేశాన్ని సూచిస్తూ ఆరుగురు సభ్యుల ప్యానెల్ రెపో రేటు తగ్గింపునకు జైకొట్టింది. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వృద్ధికి ఊతం ఇచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో పాటు మరిన్ని కోతలు ఉంటాయని సంకేతాలు ఇచ్చినా సూచీల నష్టాలు కొనసాగాయి. అమెరికా సుంకాల వల్ల నెలకొన్న వాణిజ్య యుద్ధ భయాలు, తద్వారా వృద్ధి నెమ్మదిస్తుందన్న ఆందోళనల ముందు ఆర్బీఐ నిర్ణయాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ క్రమంలోనే అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలదీ అదే బాట. నిఫ్టీ ఐటీ, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, హెల్త్‌కేర్ సూచీలు ప్రధానంగా నష్టాలు ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 74,103.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,227.08) వద్ద నష్టాల్లోనే ప్రారంభమయ్యాయి. ఆరంభంలో ఒడుదొడుకులు ఎదుర్కొంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరికి 379.93 పాయింట్ల నష్టంతో 73,847.15 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 136.70 పాయింట్ల నష్టంతో 22,399 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.69గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో ముగిశాయి. నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, టైటాన్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 3063 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## 16 ఏళ్లలోపు వారికి ఇక నో ఇన్‌స్టా లైవ్‌స్ట్రీమ్

### తల్లిదండ్రుల అనుమతి ఉండాల్సిందే

**జనంసాక్షి:** సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో 16 ఏళ్లలోపు టీనేజర్లు ప్రత్యక్షప్రసార సేవ అయిన లైవ్‌స్ట్రీమ్‌లో అనుచిత, అసభ్య, బ్లర్‌చేయని నగ్న వీడియోలు చూడకుండా కట్టడిచేసే లక్ష్యంతో కఠిన నిబంధనలను అమల్లోకి తెస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటాప్లాట్‌ఫామ్స్ మంగళవారం ప్రకటించింది. తల్లిదండ్రుల సమ్మతితోనే లైవ్‌స్ట్రీమ్ సదుపాయం కల్పిస్తామని సంస్థ స్పష్టంచేసింది. తమ అనుబంధ సామాజిక మాధ్యమ వేదికలైన ఫేస్‌బుక్, మెసెంజర్‌లలోనూ 18 ఏళ్లలోపు టీనేజర్లకు అదనపు 'కట్టడి' చర్యలను అమలుచేస్తామని మెటా పేర్కొంది. టీనేజీ వినియోగదారుల సమయాన్ని, ఆరోగ్యాన్ని సోషల్‌మీడియా తీవ్రంగా ప్రభావితంచేస్తున్న నేపథ్యంలో పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులకు పూర్తి నిఘా అధికారాలను కట్టబెడుతూ మెటా గత సెప్టెంబర్‌లో 'టీన్ అకౌంట్ ప్రోగ్రామ్'ను అమల్లోకితేవడం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్ నూతన కఠిన నిబంధనలను తొలుత అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలలో అమలుచేయనున్నారు. మరికొద్ది నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ నిబంధనలను అమలుచేస్తారు. నిబంధనలు అమల్లోకి వచ్చాక టీనేజర్ల ఖాతాల్లో ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ఆప్షన్ కనపడదు. తల్లిదండ్రుల పర్మిషన్ వచ్చాకే కనిపిస్తుంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 3.90 | ₹ 3.92 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 82,900 (22 క్యారెట్లు) | ₹ 90,440 (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,02,000

## 'క్రెడిట్' భారం.. ఇక బలాదూర్



**జనంసాక్షి:** ప్రస్తుతం క్రెడిట్ కార్డుల వినియోగం బాగా పెరిగింది. దీంతో ఖర్చుల మీద నియంత్రణ లేక క్రెడిట్ కార్డుల బిల్లులు భారీగా పెరిగిపోతున్నాయి. ఇలా వచ్చిన భారీ మొత్తం బిల్లులను ఒకేసారి కట్టడానికి కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందు కోసమే దేశంలో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వినియోగదారుల కోసం ప్రత్యేక ఫీచర్ అందుబాటులో ఉంది. క్రెడిట్ కార్డు పెద్ద మొత్తం బిల్లుల నిర్వహరణను 'ఎస్‌బీఐ కార్డ్ ఫ్లెక్సీపే' సదుపాయం సులభతరం చేస్తుంది. ఈ ఫీచర్ ద్వారా కార్డుదారులు పెద్ద కొనుగోళ్లను సులభమైన నెలవారీ వాయిదాలుగా మార్చుకోవచ్చు. తద్వారా ఒకేసారి ఏకమొత్తం చెల్లించాల్సిన ఇబ్బందిని లేకుండా చేసుకోవచ్చు. అసలేంటీ ఎస్‌బీఐ ఫ్లెక్సీపే ఫీచర్.. అర్హత ప్రమాణాలు, ఇతర వివరాలను ఈ కథనంలో తెలుసుకుందాం. ఫ్లెక్సీపే అనేది ఎస్‌బీఐ కార్డ్ అందించే ఫీచర్. ఇది మీ లావాదేవీలను సులభమైన వాయిదాలుగా మార్చుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. రూ.500 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలను ఈఎంఐలుగా మార్చుకోవచ్చు. ఇది మూడు, ఆరు, తొమ్మిది, 12, 18, 24 నెలలు వంటి రీపేమెంట్ కాలపరిమితి ఎంపికలను అందిస్తుంది. ఇక రూ.30,000 లేదా అంతకంటే ఎక్కువ కొనుగోళ్లకు 36 నెలల ఈఎంఐ ప్లాన్ ఎంచుకోవచ్చు. ఫ్లెక్సీపే కోసం కనీస బుకింగ్ మొత్తం రూ .2,500, అయితే ఇది ఆఫర్ల ఆధారంగా మారవచ్చు. అలాగే, గత 30 రోజుల్లో చేసిన లావాదేవీలను ఫ్లెక్సీగా మార్చుకోవచ్చు. క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐలను మార్చుకునే ముందు మీ క్రెడిట్ స్కోర్, క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోను ఒకసారి చూసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా వినియోగదారులు తమ ఎస్‌బీఐ కార్డ్ ఆన్‌లైన్ ఖాతాలోకి లాగిన్ అయి, 'ఈఎంఐ అండ్ మోర్' విభాగానికి వెళ్లి 'ఫ్లెక్సీపే' ఎంచుకోవచ్చు. మార్చాలనుకుంటున్న లావాదేవీని, తగిన కాలపరిమితిని ఎంచుకుని అభ్యర్థనను ధృవీకరించండి. అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఎస్‌బీఐ కార్డ్ కస్టమర్ సర్వీస్ హెల్ప్ లైన్‌కు కూడా కస్టమర్లు కాల్ చేసి కస్టమర్ సపోర్ట్ టీమ్ సహాయంతో ఈఎంఐ మార్పిడిని అభ్యర్థించవచ్చు. వాళ్లు మీకు ప్రక్రియపై మార్గనిర్దేశం చేస్తారు. అలాగే వినియోగదారులు ఎస్‌బీఐ కార్డ్ మొబైల్ యాప్‌లోనూ ఫ్లెక్సీపే ఎంపికను యాక్సెస్ చేయవచ్చు. అవసరమైతే లావాదేవీ మొత్తాన్ని సవరించి, కాలపరిమితిని ఎంచుకుని అప్లయి చేయవచ్చు.



## చైనాలో ఆరోతరం యుద్ధవిమానం

### తోకలేకుండానే ప్రయాణం దీని ప్రత్యేకత

**జనంసాక్షి:** చైనా రూపొందించిన ఓ యుద్ధవిమానం వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ విమానానికి మూడు ఇంజిన్లు ఉండటంతోపాటు.. తోకలేక పోవడం విశేషం. పశ్చిమ దేశాలకు చెందిన నిపుణులు దానిని ఆరో తరానికి చెందిన జె–36గా అభివర్ణిస్తున్నారు. ఈ విమానం సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూ ఎయిర్ క్రాఫ్ట్ ఇండస్ట్రీ రన్‌వేకు వెళ్లే క్రమంలో ఓ జాతీయ రహదారిపై అతి తక్కువ ఎత్తులో ప్రయాణించింది. దీనిని కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వీడియో తీశాడు. గతేడాది చివర్లో తొలిసారి జె–36 ఫొటోలు ఇంటర్నెట్‌లో దర్శనమిచ్చాయి. ఆ తర్వాత ఈ ఏడాది మార్చిలో మరోసారి బయటకు వచ్చాయి. ఈ విమానంలో చైనా ఇంజినీర్లు అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీని, ఏవియానిక్స్, పవర్‌ప్లాంట్, ఎయిర్ ఫ్రేమ్‌ను అమర్చినట్లు నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. రెండు ఎయిర్ ఇన్‌టేక్స్‌తో ట్రైజెట్ ఇంజిన్‌ను అమర్చారని చెబుతున్నారు. దీనిలో ఆయుధాలను అంతర్గతంగా భద్రపర్చుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. వీటిల్లో దీర్ఘశ్రేణి క్షిపణులను కూడా అమర్చే అవకాశాలున్నట్లు అమెరికా సైనిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికా వద్ద ఐదో తరానికి చెందిన రెండు ఇంజిన్లతో పనిచేసే ఎఫ్–22, ఒక ఇంజిన్ అమర్చిన ఎఫ్–35 ఉన్నాయి. వీటిని పలు దాడుల్లో వినియోగించింది. చైనా వద్ద కూడా జె–20, జె–35 ఉన్నాయి. కానీ, ఇవి ఇంతవరకు యుద్ధ రంగంలోకి అడుగుపెట్టలేదు. ఇక అమెరికా యుద్ధవిమానం ఎఫ్–47 తయారీ కాంట్రాక్టును బోయింగ్ సంస్థకు అప్పగించింది.

# ట్రంప్ సుంకాలతో అమెరికన్ల దీనస్థితి



అమెరికా పౌరుల బాడీ షేమింగ్‌తో ఏఐ వీడియో సృష్టించి విస్తృతంగా ప్రచారం చేస్తున్న చైనా

**జనంసాక్షి:** డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో అమెరికా–చైనా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి తన హెచ్చరికలను బేఖాతరు చేసిన బీజింగ్‌పై ట్రంప్ ఏకంగా 104శాతం టారిఫ్‌లు విధించారు. దీనిపై చైనీయులు అక్కసు వెళ్లగక్కా రు. అమెరికా ప్రజలను షేమింగ్ చేస్తూ రూపొందించిన వీడియోను వైరల్ చేస్తున్నారు. ఈ ఏఐ వీడియోను టిక్‌టాక్ యూజర్ రూపొందించినట్లు తెలుస్తోంది. ఊబకాయంతో నీరసించిన స్థితిలో ఉన్న అమెరికన్లు గార్మెంట్, తయారీరంగ పరిశ్రమలో పనిచేస్తున్నట్టుగా ఆ దృశ్యాల్లో ఉంది. ఆ పనిచేసీచేసీ వారు అలసిపోయినట్లు కనిపిస్తోంది. వెనక ఒక విషాదకర సంగీతం మనకు వినిపిస్తుంది. వీడియో చివర్లో ట్రంప్ నినాదం.. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదం వ్యంగ్యంగా రాసి ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఈ తయారీ రంగ ఉద్యోగాలను అమెరికా ఔట్‌సోర్సింగ్ చేసిందని, ఇప్పుడు దిగుమతులపై ట్రంప్ వేస్తోన్న టారిఫ్‌లతో ఆ ఉద్యోగాలను అమెరికన్లే చేయాల్సి ఉంటుందనే అర్థంలో దీనిని రూపొందించారు. "అమెరికా రీ ఇండస్ట్రియలైజేషన్‌పై చైనా ప్రజలు మీమ్స్‌తో ట్రోలింగ్ చేస్తున్నారు" అని ఓ నెటిజన్ ఈ వీడియోను షేర్ చేశారు. దీనికి లక్షల్లో వీక్షణలు వచ్చాయి. అమెరికన్లు ఇలాంటి ఉద్యోగాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారా..? ఒక ఎక్స్ యూజర్ అనుమానం వ్యక్తం చేశారు. "ఈ మొత్తం పరిశ్రమను అమెరికన్లు ఆటోమేట్ చేస్తారు. వారు స్వయం సమృద్ధి సాధించాలని కోరుకుంటున్నారు. అది మంచి ప్రారంభమే. అయితే దానికి వాణిజ్యం యుద్ధం అవసరం లేదు. ఉత్పత్తి అనంతరం తమ వస్తువులు కొనుగోలు చేయాలని అమెరికా ఇతరులను బలవంతం చేస్తుంది. అది ఊహించిందే" అని మరొకరు రాసుకొచ్చారు. పలు దేశాలు తాము ఎగుమతి చేస్తున్న వస్తువులపై అధిక సుంకాలు విధిస్తూ తమ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్నాయని ట్రంప్ ఎన్నోసార్లు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇటీవల అన్నిదేశాల దిగుమతులపై ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాలు విధిస్తూ వచ్చింది. ఇటీవల పెంచిన సుంకాలతో కలిసి చైనాపై మొత్తం సుంకాలు 54 శాతానికి చేరుకున్నాయి. దీనికి బీజింగ్ తీవ్రంగా స్పందించింది. అగ్రరాజ్యం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది. దీంతో భగ్గుమన్న ట్రంప్.. టారిఫ్ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. డ్రాగన్ వెనక్కి తగ్గకపోవడంతో అదనంగా మరో 50శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా నిర్ణయంతో బీజింగ్‌పై మొత్తం సుంకాలు 104 శాతానికి చేరుకున్నాయి.

# జాతీయం అంతర్జాతీయం

## క్యూఆర్ స్కాన్ చేస్తే ఆధార్ వివరాలు..

### కొత్త యాప్‌ను కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్

**జనంసాక్షి:** క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధార్ యాప్‌ను కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రవేశపెట్టారు. ఇన్‌స్టంట్ వెరిఫికేషన్, ఆథెంటికేషన్ కోసం రియల్ టైమ్ ఫేస్ ఐడీతో కొత్త యాప్ పని చేస్తుందని చెప్పారు. ఈ యాప్‌తో సులభంగా ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. భారత పౌరులు తమ ఆధార్ కార్డును కొన్ని సందర్భాల్లో భౌతికంగా చూపించడానికి బదులుగా వారి గుర్తింపును ధ్రువీకరించడానికి ఈ యాప్‌ను ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. 'కేవలం ఒక ట్యాప్‌తో వినియోగదారులు అవసరమైన డేటాను మాత్రమే ఇతరులతో పంచుకునేలా ప్రభుత్వం వీలు కల్పిస్తుంది. ఇది వారికి తమ వ్యక్తిగత సమాచారంపై పూర్తి నియంత్రణను అందిస్తుంది. న్యూ ఆధార్ యాప్ (బీటా టెస్టింగ్ దశలో ఉంది) ద్వారా వెరిఫికేషన్ యూపీఐ పేమెంట్ చేసినంత సులభంగా ఉంటుంది. యూజర్లు తమ వివరాలు నిర్ధారించేటప్పుడు వారి ఆధార్‌ను డిజిటల్‌గా ధ్రువీకరించవచ్చు. యూపీఐ లావాదేవీల మాదిరిగా కేవలం క్యూఆర్‌ను స్కాన్ చేయడం ద్వారా ఇదంతా సులువుగా చేయవచ్చు' అని మంత్రి తెలిపారు. దేశంలో యూపీఐ చెల్లింపులకు విస్తృతంగా వినియోగించే క్యూఆర్ కోడ్‌ల మాదిరిగానే ఆధార్ ధ్రువీకరణకు 'పాయింట్స్ ఆఫ్ అథెంటికేషన్(వెరిఫికేషన్ భాగస్వాములు)' వద్ద అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. యూపీఐ యాప్‌ల మాదిరిగానే కొత్త ఆధార్ యాప్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వెంటనే వారి ఫేస్ వెరిఫై ఆప్షన్ వస్తుంది. ఇది ఆధార్ హోల్డర్లకు వారి వ్యక్తిగత సమాచారంపై పూర్తి నియంత్రణను కలిగిస్తుంది. ఈ యాప్ రిక్వెస్ట్ అప్లికేషన్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా డిజిటల్ వెరిఫికేషన్, సమాచార మార్పిడికి అనుమతి లభిస్తుంది. ఇది భౌతిక ఫోటోకాపీల అవసరాన్ని తొలగిస్తుంది. ఇకపై హోటల్ రిసెప్షన్లు, షాపులు, ప్రయాణాల సమయంలో ఆధార్ ఫోటోకాపీ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఈ యాప్ బీటా వెర్షన్ టెస్టింగ్ దశలో ఉందని మంత్రి అన్నారు. కానీ దేశవ్యాప్తంగా ఇది విస్తృతంగా అమలైతే, పౌరులు ఇకపై వారి భౌతికంగా తమ ఆధార్ లేదా ఫోటోకాపీని ఇవ్వాల్సిన అవసరం తగ్గుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ యాప్‌కు సంబంధించి నిర్దిష్ట యూజర్ల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా యూఐడీఏఐ త్వరలోనే దీన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురానుంది.



## ప్రత్యేక విమానంలో భారత్‌కు తహవూర్ రాణా

ముంబయి పేలుళ్ల కేసు లో నిందితుడు తహవూర్ రాణాకు అమెరికాలో ఉన్న చట్టపరమైన అవకాశాలన్నీ ముగిశాయి. దీంతో అతడిని భారత్‌కు అప్పగించారు. ప్రస్తుతం అతడిని తీసుకుని భారతీయ అధికారుల బృందం ప్రత్యేక విమానంలో ఇండియాకు తిరుగుపయనమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ రాత్రికి లేదా రేపు తెల్లవారుజామున ఆ విమానం భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం. తనను భారత్‌కు అప్పగించొద్దంటూ అమెరికా సుప్రీంకోర్టును తహవూర్ రాణా ఇటీవల ఆశ్రయించగా.. ఆ పిటిషన్ తిరస్కరణకు గురయ్యింది. తన అప్పగింతను అత్యవసరంగా నిలిపివేయాలంటూ ఇటీవల రాణా యూఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. భారత్‌కు పంపిస్తే అక్కడ తనను చిత్రహింసలకు గురిచేస్తారని అందులో ఆరోపించాడు. దీనిపై తాజాగా విచారణ జరగ్గా.. రాణా పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు అక్కడి న్యాయస్థానం పేర్కొంది. దీంతో అతడిని భారత్‌కు అప్పగించేందుకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలోనే భారత అధికారుల బృందం అగ్రరాజ్యానికి వెళ్లి అవసరమైన పత్రాలు సమర్పించి చట్టపరమైన లాంఛనాలు పూర్తి చేసింది. అనంతరం అతడిని అమెరికా అధికారులు భారత్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. రాణా అప్పగింతపై ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా ట్రంప్ మాట్లాడుతూ.. "26/11 ముంబయి ఉగ్ర దాడిలో నిందితుడైన అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిని భారత్‌కు అప్పగిస్తాం. అలాగే త్వరలో మరింతమంది నేరగాళ్ల విషయంలోనూ అదే నిర్ణయం తీసుకుంటాం" అని వెల్లడించారు. తహవూర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి. ప్రస్తుతం లాస్ ఏంజెలెస్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

## చైనా ఆసుపత్రిలో భారీ అగ్ని ప్రమాదం..

ఉత్తర చైనాలోని హెబీ ప్రావిన్స్‌లోని లాంగ్హువా కౌంటీలో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఓ నర్సింగ్ హోమ్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. చైనా స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 9.00 గంటల ప్రాంతంలో నర్సింగ్ హోమ్(ఆసుపత్రి)లో మంటలు చెలరేగాయి. దీంతో, వెంటనే అప్రమత్తమైన అధికారులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందినట్టు స్థానిక మీడియా జిన్హువా వెల్లడించింది. అలాగే, పలువురు తీవ్రంగా గాయపడినట్టు చెప్పుకొచ్చింది.



## అమెరికాపై కెనడా ప్రతీకార సుంకాలు

**జనంసాక్షి:** అమెరికా వాహనాలపై కెనడా 25శాతం సుంకాలను విధించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ట్విటర్‌లో ప్రకటించారు. వాషింగ్టన్ విధించిన సుంకాలకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు. కెనడా–యునైటెడ్‌స్టేట్స్–మెక్సికో ఒప్పందం పరిధిలోకి రాని వాహనాలన్నింటిపై ఈ నిర్ణయం వర్తిస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య విధానాలకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు కార్నీ పేర్కొన్నారు. "ట్రంప్ ఈ వాణిజ్య సంక్షోభానికి కారకులు. కెనడా కేవలం ఓ లక్ష్యం కోసం శక్తిమంతంగా స్పందించింది" అని వెల్లడించారు. కెనడా ఆర్థిక మంత్రి ఫ్రాంకోయిస్ ఫిలిప్ మాట్లాడుతూ "అకారణంగా అమెరికా విధించిన సుంకాలపై కెనడా శక్తిమేరకు స్పందిస్తూనే ఉంటుంది. ఈ సుంకాలను తొలగింపజేసి.. కెనడా ఉద్యోగులు, వాణిజ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, పరిశ్రమలను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా–కెనడా మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయి. దీనికితోడు టారిఫ్‌ల విధింపుతో ఇవి తార స్థాయికి చేరాయి. మార్చి 4వ తేదీన కెనడా వస్తువుల దిగుమతిపై ట్రంప్ 25శాతం, ఇంధనం, పొటాష్‌పై 10శాతం టారిఫ్ విధించారు. ఆ తర్వాత సీయూఎస్‌ఎంఏ పరిధిలోకి రాని వాటికి మాత్రమే దీనిని పరిమితం చేశారు. ఆ తర్వాత మార్చి 12న కెనడా నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై 25శాతం సుంకం విధించారు. ఏప్రిల్ 3వ తేదీన కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలపై, మే 3 నుంచి విడిభాగాలపై 25శాతం చొప్పున పన్ను వేశారు. కెనడా కూడా వీటిని తగినట్లు స్పందిస్తూ అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు విధించింది. అమెరికా సుంకాల దెబ్బకు చాలా దేశాలు ఒప్పందం కోసం తహతహలాడుతున్నాయని వెల్లడించారు. రిపబ్లికన్స్ కాంగ్రెషనల్ కమిటీ డిన్నర్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 ఏప్రిల్ 2025

# మండల స్థాయి అధికారులతో వెరిఫికేషన్ చేయాలి

## రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు వెరిఫికేషన్ చేయాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి)**




రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని రెవిన్యూ, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది, అధికారులు వెరిఫికేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి మండల స్థాయి అధికారులతో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ధరణీ, ఎల్.ఆర్.ఎస్., రాజీవ్ యువ వికాసం అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని రెవిన్యూ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలించి, అర్హతల మేరకు ఉన్నతాధికారుల లాగిన్ కు పుష్ చేయాలని సూచించారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే జిల్లా పౌర సరఫరాల అధికారినీ సంప్రదించాలని తెలిపారు. ఆయా ఆర్డీఓ లు, సబ్ కలెక్టర్ పర్యవేక్షించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు వెరిఫికేషన్ చెయ్యాలని, పరిశీలన చేసిన వాటి యొక్క సంతకంతో కూడిన ప్రతులను ఉన్నతాధికారులకు సమర్పించాలని తెలిపారు. అర్హత కలిగిన వారికి మార్క్ అవుట్ ఇవ్వాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలు చేసుకోలేని నిరుపేద కుటుంబాలకు స్వయం సహాయక బృందాల నుండి రుణాలు ఇప్పించాలని తెలిపారు. ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల రీమార్కులు పంచాయతీ కార్యదర్శులు నమోదు చేయాలని తెలిపారు. బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించుకున్న వారి రిపోర్టులు, ఫోటోలు యాప్ లో అప్లోడ్ చేయాలని, మొదటి దశ క్రింద నిధులు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు.రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు సమర్పణలు దరఖాస్తు దారులకు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను తహసీల్దార్లు వెంటనే పరిశీలన చేసి సర్టిఫికెట్స్ అందించే ఏర్పాటు చేయాలని, ఇప్పటివరకు పెండింగులో ఉన్న వాటికి వెంటనే సర్టిఫికెట్స్ అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. ధరణీ లో పెండింగులో ఉన్న వాటిని పరిశీలించి పుష్ చేయాలని, ఫార్వర్డ్ చేసిన వాటి ఫైల్స్ ను పంపించాలని తెలిపారు.రాజీవ్ యువ వికాసం దరఖాస్తు దారులు పలు సమస్యలకు జిల్లా కేంద్రం నకు సంప్రదిస్తున్నారని, ప్రతీ మండలంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, అట్టి హెల్ప్ డెస్క్ ద్వారా సమస్యలు నివృత్తి చేయాలని తెలిపారు. ఆన్లైన్ చేసిన దరఖాస్తు హార్డ్ కాపీలను ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు మండలాల్లో పర్య టించి పర్యవేక్షించాలని తెలిపారు. ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని,
15 వ తేదీ నుండి వెరిఫికేషన్ ప్రారంభించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీఓ వీణ, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పలు శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు ఇక చెక్



మెసేజ్ యువర్ ఎస్పీ
8712659973 కు వాట్సాప్ ఇస్తే చాలు
ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :**

ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలైనా, సంఘ వ్యతిరేక కార్యకలా పాలైనా నేరుగా సమాచారం అందించవచ్చని వారి వివరాలు గోప్యంగా ఉంచబడ తాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన ం, మొబైల్ ఫోన్ వినియో గం యువత చేతుల్లోకి మరింత అందుబాటులోకి రావడం వల్ల, జిల్లా అధికారులను సులువుగా సంప్రదించాలని వినూత్న ఆలోచన తో జిల్లా ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో మెసేజ్ యువర్ ఎస్పి పేరుతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణనే ధ్యేయంగా జిల్లా ప్రజలకు మరింత వేగవంతమైన పారదర్శకమైన సేవలను అందించాలని ఈ మెసేజ్ యువర్ ఎస్పి కార్యక్రమ ప్రారంభించామని తెలిపారు. దీని వల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రజలు ఎలాంటి సమస్యలున్న, ఎలాంటి సమా చారాన్ని అందించాలన్న జిల్లా ఎస్పీకి నేరు గా సమాచారాన్ని అందిం చవచ్చ న్నారు. సమాచారాన్ని అందించాల్సిన వారు వారి ఫోన్ వాట్సాప్ ద్వారా జిల్లా పోలీసు వాట్సప్ నంబర్ 8712659973 కు సంప్రదిం చాలని తెలిపారు. సమస్యలపై పూర్తి వివరాలను రాసి వాట్సాప్ ద్వారా తెలపాలని తెలిపారు.

జిల్లా లో ఎలాంటి అసాంఘిక కార్యకలా పాలు జరిగిన సంఘ విద్రోహ కార్యకలాపాలు నిర్వహి ంచిన ఆ సమాచారం మీకు అందించాల నిపిస్తే నేరుగా ఈ నెంబర్ కి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయా లని సూచించారు. సమాచారం అందిం చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడ తాయని సూచించారు. ఇదంతా తన పర్యవేక్షణలోనే ఉంటుందని ఎస్పీ తెలిపారు.

# సన్నబియ్యం పంపిణీ విప్లవాత్మక నిర్ణయం

**స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
**పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 09 (జనం సాక్షి)**



: పేదల కడుపు నింపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టడం విప్లవాత్మక నిర్ణయమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఘనపూర్ (స్టేషన్) మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావణ్య నియోజక వర్గ కేంద్రంలోని ఎస్సీ కాలనీలోగల సన్న బియ్యం లబ్ది దారులు తాటికొండ యాదమ్మఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా దేశంలోనే మొదటిసారిగా పేదలు కడుపు నిండా అన్నం తినాలనే మంచి ఆలోచనతో ఎక్కడా లేని విధంగా ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ నెలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఇదొక విప్లవాత్మకమైన నిర్ణయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి ఈ పథకంపై రూ. 13,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంతకుముందు సన్న బియ్యం తినాలని ఉన్నప్పటికీ, ఆర్థిక స్థితిగతుల మూలంగా ఎందరో పేదలు దొడ్డు బియ్యం తింటున్నా రని, అలాంటి వారి కోసం ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేసి, పేదల ఆశలను నెరవేరుస్తోం దని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి పేదవాడికి నాణ్యత గల ఆహారాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జిల్లాలో ని 335 రేషన్ దుకాణాల ద్వారా 1,61,264 అన్ని రేషన్ కార్డుల లబ్ధిదారులకు 3,151 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని,ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఆర్డీఓ వెంకన్న,తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం..



**మెగా జాబ్ మేళా నిర్వహిస్తాం..**
**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ద్యేయంగా మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, జాబ్ మేళా నిర్వహించే టాస్క్ కంపెనీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఈ నెల 26 న నిర్వహించే మెగా జాబ్ మేళా కార్యక్రమ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా
శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో టాస్క్ కంపెనీ నిర్వహిస్తున్న జాబ్ మేళా లో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 700 కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్ మేళా లో 10 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే జాబ్ మేళా కు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరవుతారని తెలిపారు. క్యూ ఆర్ కోడ్ లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, విద్యార్హతల ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. 10 వతరగతి నుండి డిగ్రీలు, పిజీలు ఇతర పై చదువులు చదువుకున్న నిరుద్యోగ యువత కు ఇది గొప్ప అవకాశమని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..

నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువతకు ఈ జాబ్ మేళా ద్వారా ఉపాధి లభిస్తుందని తెలిపారు. దూరం అని కాకుండా ఎక్కడ అవకాశం వస్తే ఆ జిల్లాకు వెళ్లాలని, నేను కలెక్టర్ ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నామని అన్నారు. యువతి, యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ శాఖ ద్వారా కూడా పెద్ద ఎత్తున జాబ్ మేళా పై ప్రచారం నిర్వస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కేటీపీఎస్ సీఈ ప్రకాష్, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రఘు, టాస్క్ ప్రతినిధి ప్రదీప్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లోని భూ సమస్యకు పరిష్కారం



**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కృషి**

**మహబూబాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి)**

: మహబూబాబాద్ పట్టణంలోని శనిగాపురం శివారులోని గిరిజన రైతుల 25 ఎకరాల భూసమస్యకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ పరిష్కారం చూపారు. ఆ భూమిని గిరిజనేతరులు భూ కబ్జాకు పాల్పడడంతో జాతీయ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేసిన బాధిత గిరిజన రైతులు, గూడూరు మండలంలోని సీతానగరం గ్రామ గిరిజన రైతుల పోడు భూసమస్య ఏండ్ల తరబడి పెండింగ్ లో ఉంది. గిరిజన రైతులు అనేక ఇబ్బందులకు గురై చివరకు జాతీయ ఎస్టీ కమీషన్ న్యూ ఢిల్లీలో ఫిర్యాదు చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను విచారణకు పిలవగా ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ ముందు హాజరై పెండింగ్ లో ఉన్న గిరిజనుల భూ సమస్యను పరిష్కార మార్గం చూపారు. వారి భూ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్యా మంగీలాల్, నాయిని ధర్మారెడ్డి, దారవత్ కిషన్, మాలోత్ అశోక్, బానోత్ బన్సి, దుబ్బ, మూడు సూర్య, భూక్య శ్రీనివాస్ బోడ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అధికారంలో వస్తేనే బతుకులు బాగుపడతాయి

**బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు**
**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 9 ( జనం సాక్షి) :**



రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అధికారం వస్తేనే తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడతాయని టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమాల పెల్లి మండలం ఖర్జవెల్లి గ్రామంలో పలువురు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కండువార్ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్దపు హామీల పేరిట అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజలకు అన్యాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రౌతు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రి సెక్యూరిటీ మానవత్వం

**వాహనంలో మరిచిపోయిన సెల్‌ఫోన్ అందజేత**

**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి)**



: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో నిధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ మానవత్వం చాటారు. నిర్మల్ ప్రభుత్వాస్పత్రిలో ముదం సందీప్ , కౌట్ల విజయ్, దరువు భోజన్న సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. డ్యూటీలో ఉండగా ఆస్పత్రి ఆవరణలో నిలిపిఉన్న ద్విచక్ర వాహనాలు పార్కింగ్ సరి చేస్తుండగా ఓ స్కూటీలో వాహనదారుడు సెల్ ఫోను మరచిపోయాడు. ఈ విషయం వైద్య అధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ విశ్వనాథ్ కు తెలిపారు. బాధితులు వచ్చి ఫోను తమదే అని నిర్ధారణ పొందిన తర్వాత అందజేశారు. 30 వేల విలువగల మొబైల్ ఫోన్ నిజాయితీగా వచ్చి బాధితులకు అందజేసిన సెక్యూరిటీ గాడ్స్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అకౌంటెంట్ సూపర్డెంట్ నవీన్, ఆఫీస్ బాయ్ సుధాకర్, రేగుంట ప్రవీణ్, అనీల్ రాథోడ్ జింక నవీన్ పాల్గొన్నారు.

# కడియం స్వీకరిస్తున్నా.. చర్చకు సిద్ధం

**స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 09 (జనం సాక్షి)**



**దేవునూరి భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**
**స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**

: ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన సవాల్లను తాను స్వీకరిస్తున్నానని స్థలం, సమయం, తేదీ ప్రకటిస్తే తాను చర్చకు రావడానికి సిద్ధం అని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటి కొండ రాజయ్య అన్నారు. బుదవారం డివిజన్ కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్త లతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ ధర్మసాగర్ మండలం లోని ధేవునూరి గ్రామంలో అన్యాక్రాంతం అవుచున్న భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి వేసిన సవాళ్లను తాను, పల్లా రాజేశ్వర్ రెడ్డి స్వీకరిస్తున్నానని అన్నారు. నీకు ముహూర్తాల పిచ్చి ఎక్కువ కదా ముహూర్తం నువ్వే పెట్టు అంటూ వ్యాఖ్యానించారు. తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. దేవునూరు అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా పోరాట చేస్తానని అన్నారు.అటవీ భూములలో రెండు కిలోమీటర్లమేరకు చెట్లను తొలగించడమేగాక మైనింగ్ అనుమతి లేకుండానే వేల ట్రాక్టర్ల మొరం తరలించార ని తెలిపారు.బీఆర్ఎస్ నుంచి అభివృద్ధికోసం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన నీవు నియోజకవర్గానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏమైనా అభి వృద్ధి పనులు చేశావ అని ఆయన ప్రశ్నించారు. స్టేషన్ ఘణపూర్ నియోజక వర్గమే నీకు రాజకీయ జన్మనిచ్చింది కదా జీవితాంతం ఈ నియోజకవర్గా నికి గులాంగిరి చేయాలని అన్నారు. చిలుపూర్ దేవస్థానం చైర్మన్ పదవిని సింగపురం ఇందిరా ఒకరికి ఇస్తే, పదవి కాలం పూర్తి కాక ముందే కోటి రూపాయలకు మరొకరికి అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో పదవులు అనుభవించిన కడియం శ్రీహరి పల్లాను విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. బిఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, నాయకులు తాటికొం డ సురేష్ కుమార్, ఇనుగాల నరసింహారెడ్డి, బంగ్లా శ్రీనివాస్,కనకం గణేష్,చల్లా చందర్ రెడ్డి, మారెపల్లి ప్రసాద్,లకావత్ చిరంజీవి,మునిగల రాజు,గుండె మల్లేష్, గుర్రం చిట్టి బాబు, హీరా సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పిటిషన్లపై వేగవంతమైన స్పందన కోసం పూర్తి వివరాలు ఇవ్వగలరు జిల్లా ఎస్పీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి)**



ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌లకు గానీ, లేదా ఇతర ఉన్నతాధికారులకు గానీ ఫిర్యాదులు ఇస్తున్న సందర్భంలో, వారి యొక్క పూర్తి చిరునామా మరియు మొబైల్ నంబర్‌ను తప్పనిసరి గా స్పష్టంగా పేర్కొనాలని,. ఈ వివరాలు అందించిన పక్షంలో, ఆ ఫిర్యాదు ప్రస్తుతం ఏ స్థాయిలో పరిశీలనలో ఉందో, ఏ అధికారి దానిపై విచారణ చేస్తున్నారు అనే విషయాలు మొబైల్ నంబర్ ద్వారా ఎస్ఎంఎస్ రూపాల్లో పిటిషన్ దారులకు తెలియజేయడం జరుగుతుంది. ఫిర్యాదుల పట్ల పారదర్శకత, వేగవంతమైన స్పందన మరియు ప్రజలతో సమర్థమైన సమాచార పంపిణీ కోసం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.కావున, జిల్లావ్యాప్తంగా ప్రజలు తమ ఫిర్యాదులను ఇవ్వబోయే సమయంలో ఖచ్చితంగా తాము నివసించే పూర్తి చిరునామా మరియు అమలులో ఉన్న మొబైల్ నంబర్‌ను పిటిషన్‌లో నమోదు చేయగలరని జిల్లా ఎస్పీ తెలిపినారు.జిల్లా ప్రజల సహకారంతో పోలీసు శాఖ మరింత సమర్థంగా సేవలందించగలదని, ప్రతి పిటిషన్‌పై జాగ్రత్తగా స్పందన కల్పించేందుకు ఇది సహాయపడుతుందని ఎస్పీ తెలిపినారు.

# గిరిజన యువకుడు దారుణ హత్య

## గొడ్డలితో నరికి చంపిన దుండగులు

**వాజేడు, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :**



ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త టేకులగూడెం గ్రామానికి చెందిన వాసం విజయ్ (28)ని గుర్తు తెలియని దుండగులు తలపై గొడ్డలితో మోది అతి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన వివరాలు తెలుసుకున్న వెంకటాపురం సిఐ బండార్ కుమార్ పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తదనంతరం కుటుంబ సభ్యుల నుండి వివరాలు సేకరించి విచారణ ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంతటి దారుణానికి ఒడిగట్టడంతో టేకులగూడెం గ్రామంలో అలజడి మొదలైంది. ఈ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హత్య పైన పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

# గ్రామ పాలనాధికార్ల నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానం.

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 09(జనంసాక్షి)**

: గ్రామ పాలనాధికారులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన మాజీ గ్రామ రెవిన్యూ అధికారులు/ గ్రామ రెవిన్యూ అసిస్టెంట్ లు (వీఆర్ఓ లు/ వీఆర్ఎలు) దరఖాస్తులు చేసుకోవాలని, నేడు (గురువారం) మధ్యాహ్నం 3.00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే అవగాహన సదస్సుకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 16వ తేదీ లోపు గూగుల్ ఫామ్(https://forms.gle/AL3S8r9E2Dooz9Rc7) నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్వయంగా సంతకం చేసిన కాపీని కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి సమర్పించాలని అన్నారు. పని స్వభావం, నియమ నిబంధనలతోపాటు ఇతర వివరాల కోసం https://ccla.telangana.gov.in వెబ్సైట్ ను సందర్శించవచ్చని కలెక్టర్ సూచించారు. ఆసక్తి గల మాజీ వీఆర్ఓ లు/ వీఆర్ఎలు నిర్ణీత గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

**నేడు కలెక్టరేట్లో జరిగే అవగాహన సదస్సుకు హాజరు కావాలి.**
**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**





# కాజీరంగా నేషనల్ పార్క్‌లో సచిన్ జీపు సఫారీ

వీడ్కోలు అనంతరం క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ తన విలువైన సమయాన్ని కుటుంబం కోసం కేటాయిస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఫ్యామిలీతో కలిసి ట్రిప్‌కు వెళ్తూ సందడి చేస్తున్నారు. అంతేకాదు, సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటూ తనకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటున్నారు. సచిన్ తాజాగా తన కుటుంబంతో కలిసి అస్సాం లో పర్యటించారు. అక్కడి కాజీరంగా నేషనల్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో జీపు సఫారీ చేస్తూ సందడి చేశారు. అంతేకాదు.. అక్కడ ఏనుగులకు ఆహారం కూడా అందించారు. ఈ సందర్భంగా అక్కడ ఎంతో సరదాగా గడిపారు. సచిన్ రాకపై సమాచారం తెలుసుకున్న అభిమానులు.. భారీగా అక్కడకు చేరుకున్నారు. ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# సాయి సూపర్ ఫామ్

## గుజరాత్ 6 వికెట్లు కోల్పోయి 217 పరుగుల భారీ స్కోరు

### 82 పరుగులతో చెలరేగిన సుదర్శన్



ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ తమ ఇన్నింగ్స్‌ను పూర్తి చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి, గుజరాత్ 217 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిందని తెలుస్తోంది. గుజరాత్ బ్యాట్స్‌మెన్లలో సాయి సుదర్శన్ అద్భుతంగా ఆడాడు, 82 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జోస్ బట్లర్ 36 పరుగులు, షారుఖ్ ఖాన్ 36 పరుగులతో రాణించారు. ఇతర బ్యాట్స్‌మెన్లు కూడా వేగంగా పరుగులు చేసి, జట్టు స్కోరును బలపరిచారు. రాజస్థాన్ బౌలర్లలో మహీష్ తీక్షణ మరియు తుషార్ దేశ్‌పాండే ఒక్కొక్కరు 2 వికెట్లు తీశారు, కానీ వారు ఎక్కువ పరుగులు ఇచ్చారు. ఈ స్కోరుతో గుజరాత్ బలమైన స్థితిలో ఉంది. రాజస్థాన్ రాయల్స్ ఇప్పుడు 218 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బ్యాటింగ్ ప్రారంభించనుంది. ఈ మ్యాచ్ ఉత్కంఠగా సాగుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

ఐపీఎల్ 18 సీజన్లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో గుజరాత్ 6 వికెట్లు కోల్పోయి 217 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (82* 53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సు) మరోసారి మెరిశాడు. ఈ సీజన్‌లో అతడికిది మూడో హాఫ్ సెంచరీ. జోస్ బట్లర్ (36* 25 బంతుల్లో 5 ఫోర్లు), షారుక్ ఖాన్ (36* 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సు) రాణించారు. రాహుల్ తెవాతియా (24*: 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సు) చివర్లో దూకుడుగా ఆడాడు. రషీద్ ఖాన్ (12) పరుగులు చేశాడు. రాజస్థాన్ బౌలర్లలో మహేశ్ తీక్షణ 2, తుషార్ దేశ్పాండే 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు.


టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన గుజరాత్కు ఆరంభంలోనే జోఫ్రా ఆర్చర్ షాకిచ్చాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్ లో తొలి బంతికి శుభ్మన్ గిల్ (2)ని వెనక్కి పంపాడు. 147.7 కి. మీ. వేగంతో వచ్చిన బంతిని ఆడే క్రమంలో గిల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. మరో ఎండ్లో సాయి సుదర్శన్ మాత్రం దూకుడుగా ఆడాడు. తుషార్ దేశ్పాండే బౌలింగ్లో లో రెండు ఫోర్లు, ఓ సిక్స్ బాదాడు. బట్లర్ కూడా నిలకడగా బౌండరీలు రాబట్టడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. తీక్షణ వేసిన పదో ఓవర్లో సుదర్శన్ అర్ధ శతకం (32 బంతుల్లో) పూర్తి చేసుకోగా.. అదే ఓవర్లో చివరి బంతికి బట్లర్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ క్రమంలో 10 ఓవర్లకు గుజరాత్ స్కోరు 94/2కు చేరింది. తర్వాత క్రీజులోకి వచ్చిన షారుక్ ఖాన్ దూకుడుగా ఆడాడు. ఫారూఖీ బౌలింగ్లో రెండు ఫోర్లు బాదిన అతను.. తీక్షణ వేసిన 14 ఓవర్లో వరుసగా 6, 4, 4 బాదేశాడు. చివరకు తీక్షణ బౌలింగ్లోనే షారుక్ స్టంపౌట్గా వెనుదిరిగాడు. కాసేపటికే రూథర్ ఫోర్డ్ (7)ని సందీప్ శర్మ ఔట్ చేశాడు. అదే ఓవర్ లో సుదర్శన్ వరుసగా సిక్స్, ఫోర్ రాబట్టాడు. సెంచరీపై కన్నేసిన సుదర్శన్ను తుషార్ దేశ్పాండే 19వ ఓవర్లో వెనక్కి పంపాడు. అదే ఓవర్లో చివరి బంతికి రషీద్ ఖాన్.. జైస్వాల్కు చిక్కాడు. సందీప్ వేసిన చివరి ఓవర్లో తెవాతియా రెండు ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు.

# ఇంకా మా అసలు సిసలు ఆట ఆడలేదు

### పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్



ఇంకా తమ అసలు సిసలు ఆట ఆడలేదని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన పంజాబ్ కింగ్స్ 18 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. ముందుగా విధ్వంసకర బ్యాటింగ్‌తో 219 పరుగుల భారీ స్కోర్ చేసిన పంజాబ్.. అనంతరం కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌ను 201 పరుగులకే పరిమితం చేసింది. పంజాబ్ కింగ్స్ యువ ఓపెన్ ప్రియాన్ష్ ఆర్య(42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లతో 103) విధ్వంసకర సెంచరీతో పంజాబ్ కింగ్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ అనంతరం తమ విజయంపై స్పందించిన శ్రేయస్ అయ్యర్.. ఇది తమ బ్యాటింగ్ టెంప్లెట్ అని, వేదిక ఏదైనా.. పిచ్ మరేదైనా తమ అప్రోచ్‌లో తేడా ఉండదన్నాడు.'ఇది మా బ్యాటింగ్ టెంప్లెట్. గ్రౌండ్ ఏదైనా.. మా ఆట తీరు ఇలానే ఉంటుంది. మా జట్టులో పవర్ హిట్టర్స్ ఉన్నారు. ప్రియాన్ష్ ఆర్య ఆడిన తీరు చూడ ముచ్చటగా ఉంది. ఇది ఏ మాత్రం వరల్డ్ టైప్ ఆఫ్ ఇన్నింగ్స్ కాదు. గత మ్యాచ్ వైఫల్యం అనంతరం నేను అతనితో మాట్లాడాను. జోఫ్రా ఆర్చర్‌ను ఎదుర్కొన్నప్పుడు షాట్ సెలెక్షన్ విషయంలో ఇబ్బంది పడ్డాడు. ఈ రోజు తన బలాలను నమ్ముకొని చెలరేగాడు. స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. మా జట్టులోని ప్రతీ ఆటగాడు ఇలానే స్వేచ్ఛగా ఆడాలని కోరుకుంటున్నా. నేను చూసిన ఐపీఎల్ అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇది ఒకటి. యుజ్వేంద్ర చాహల్‌తో బౌలింగ్ చేయించకపోవడం వ్యూహాత్మక నిర్ణయం. అప్పటికే శివమ్ దూబే, డెవాన్ కాన్వే క్రీజులో సెట్ అయ్యారు. అలాంటి సమయంలో యుజ్వేంద్ర చాహల్‌తో బౌలింగ్ చేయిస్తే.. శివమ్ దూబే ఎలా చెలరేగుతాడో మాకు బాగా తెలుసు. పేసర్లతో బౌలింగ్ చేయించడమే సరైనదని నాకు అనిపించింది. ప్రాథమికంగా దూబే రాగానే పేసర్లతో బౌలింగ్ చేయించాలని ముందే అనుకున్నాం. కానీ మేం కాస్త ఆలస్యం చేశాం. అయినా మా వ్యూహం ఫలించింది. మా ఫీల్డింగ్ గురించి మేం మాట్లాడుకుంటున్నాం. ఇంకా మేం మా అత్యుత్తమ ప్రదర్శన చేయలేదు. టోర్నీ ఆరంభంలో ఉన్నాం కాబట్టి.. ఆ భయం ఇంకా అలానే ఉంది.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.





# సోషల్ మీడియాలో ఆర్సీబీకే ఎక్కువ క్రేజ్

- ఇన్ స్టాలోనూ అత్యధిక ఫాలోవర్స్
- ఆర్సీబీ మ్యాచులకే అత్యధిక వ్యూస్

ఐపీఎల్‌లో బడా జట్లు అనగానే టక్కున గుర్తొచ్చే పేర్లు చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్. ఈ నాలుగు జట్లలో టైటిల్స్ పరంగా చూస్తే.. సీఎస్కే (5), ముంబయి (5), కేకేఆర్ (3) ముందు వరుసలో ఉన్నాయి. ఒక్క టైటిల్ కూడా సాధించకపోయినా క్రేజ్‌పరంగా ఈ మూడు జట్లతో సమానంగా ఉంది ఆర్సీబీ. అదీ బెంగళూరు జట్టు ఘనత. వాస్తవంగా చెప్పాలంటే సోషల్ మీడియాలో ఆర్సీబీకే ఎక్కువ క్రేజ్ కనిపిస్తుంటుంది. ఇటీవలే ఇన్ స్టాలోనూ అత్యధిక ఫాలోవర్స్ ఉన్న జట్టుగానూ అవతరించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 17.8 మిలియన్ మంది ఫాలోవర్స్ ను సంపాదించుకుంది.అయితే తాజాగా ఆర్సీబీ మరో ఘనత కూడా సాధించింది. ఐపీఎల్ 2025లో జియో హాట్ స్టార్‌లో ఆర్సీబీ ఆడిన మ్యాచులకే అత్యధిక వ్యూస్ వచ్చాయి. ఓపెనింగ్ మ్యాచ్ ఆర్సీబీ వర్సెస్ కేకేఆర్ మ్యాచ్ 41.7 కోట్లతో అత్యధిక వ్యూస్ అందుకున్న మ్యాచుగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో ఆర్సీబీ వర్సెస్ సీఎస్కే 37.4 కోట్లు, ఆర్సీబీ వర్సెస్ ఎంఐ 34.7 కోట్లు వ్యూస్ దక్కించుకున్నాయి. అంటే ఈ మూడు మ్యాచుల్లోనూ ఆర్సీబీనే ఉండటం విశేషం. ప్రస్తుతం ఈ సీజన్ లో ఈ నాలుగు జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరే (ఆర్సీబీ) మంచి ప్రదర్శన చేస్తూ ముందుకెళ్తోంది. ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడింటి లో గెలిచి పాయింట్ల పట్టికలో 6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఆడిన ఐదింటిలో నాలుగింటిలో ఓడిపోయి 2 పాయింట్లతో 9వ స్థానంలో, ముంబయి ఇండి యన్స్ (ఎంఐ) ఆడిన ఐదింటిలో నాలుగింటిలో ఓడిపోయి 2 పాయింట్లతో 8వ స్థానంలో, కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఆడినఐదింటిలోమూడింటిలో ఓడిపోయి 4 పాయింట్లతో 6వస్థానంలో నిలిచాయి.

# ఈగోలతో ఒరిగేదేం లేదు: కోహ్లి



విరాట్ కోహ్లి ఐపీఎల్ ఈ సీజన్లో అద్భుతంగా రాణిస్తున్నాడు. తొలి మ్యాచ్ నుంచే బ్యాట్‌తో ఆకట్టుకు ంటూ, కింగ్‌గా తన పేరుకు తగ్గట్టు ఆడుతున్నాడు. ఇప్పటివరకు 4 మ్యాచ్‌లలో 164 పరుగులు సాధించాడు. టోర్నమెంట్‌లో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో, కోహ్లి బ్యాట్ నుంచి మరిన్ని పరుగులు చూడడం ఖాయంగా కనిపిస్తోంది. ఆర్సీబీ విజయాల్లో కీలకంగా నిలుస్తూ, ఈ సీనియర్ బ్యాటర్ తాజాగా ఆసక్తికరమైన వ్యాఖ్యలతో దృష్టి ఆకర్షించాడు. "ఈగోతో ఏం సాధించగలం?" అంటూ సీరియస్‌గా మాట్లాడాడు.

సాధారణంగా కోహ్లి అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో అభిమానులను అలరిస్తాడు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా, తన స్కోర్లతో పాటు సహచర ఆటగాళ్లను కూడా ప్రోత్సహించడంపై దృష్టి సారించాడు. ఈ ఐపీఎల్‌లోనూ ఒక ఎండ్‌లో నిలబడి, రజత్ పాటిదార్, సాల్ట్, జితేష్ శర్మ వంటి యువ ఆటగాళ్లకు అండగా నిలుస్తున్నాడు. ఈ విషయంపై స్పందిస్తూ, తనకు ఈగో అనేది లేదని, వ్యక్తిగత లాభాల కంటే జట్టు విజయమే తన ప్రాధాన్యమని చెప్పాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఈగోను ఎప్పుడూ పెద్దగా పట్టించుకోలేదని, అది తనను నడిపించినట్లు భావించడం తప్పని అన్నాడు.

"ఈగోతో ఏం లాభం?" అంటూ కోహ్లి తన ఆలోచనను వెల్లడించాడు. ఈగోను పెంచుకోవడం లేదా దాన్ని గంభీరంగా తీసుకోవడం తన వల్ల కాదన్నాడు. ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ బాగా ఆడుతుండగా, తాను మరో ఎండ్‌లో సహకరించానని చెప్పాడు. సహచరుడు తన కంటే మెరుగ్గా ఆడితే అతడికి తోడుగా ఉంటానని, తాను ఫామ్‌లో ఉన్నప్పుడు బాధ్యత తీసుకొని ఆడతానని వివరించాడు. ఎవరైనా తనకు పోటీగా ఉన్నారని లేదా తనను అధిగమిస్తారని భయపడటం తన స్వభావం కాదన్నాడు. ఆట పరిస్థితి ఏమిటి, జట్టు కోసం ఏం చేయాలనేదే తన ఆలోచనలో ఉంటుందని, ఈగోతో ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశాడు. అనవసర ఈగోలు పెంచుకోవడం వల్ల మంచి జరగదని హితవు పలికాడు. కోహ్లి వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించినవని కొందరు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. అయితే, అతడి అభిమానులు మాత్రం ఇది కేవలం ఆట పట్ల తన దృక్పథాన్ని వ్యక్తం చేసిన మాటలేనని సమర్థిస్తున్నారు.

# రాయితీపై ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయాలి

- ఎన్‌సిడిసి స్కీమ్‌ని కొనసాగించాలి
- 90 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు రుణాలు ఇవ్వాలి
- టీఎంకె ఎంకెఎస్ పిలుపు




**మల్కాజిగిరి, ఏప్రిల్ 9(జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా 2025-26 సంవత్సరానికి గాను జలవనరులలో, చెరువులు కుంటల్లో వంద శాతం రాయితీ పై ఉచిత చేప పిల్లల పంపిణికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపు స్పష్టంగా ప్రకటించకపోవడాన్ని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది.మల్కాజిగిరి లోని మల్లికార్జున నగర్ గంగ పుత్ర సంఘం కార్యాలయంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షురాలు బక్కి బాలమణి అధ్యక్షన జరిగింది.

ఈ సమావేశంలో అఖిలభారత మత్స్యకారులు మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, టిఎంకేఎంకె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా, హాజరై మాట్లాడుతూ, గత 10 సంవత్సరాల కాలంలో చేప,రొయ్య పిల్లల పంపిణీలో జరిగిన అవకతలపై న్యాయవిచరణ జరిపించాలని, ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి మత్స్య సొసైటీ చెరువుకుంటల్లో కావాల్సినంత చేప రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడానికి సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని, ఈ ఏడాది బడ్జెట్ ను సవరించి మత్స్య పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్, రాజకీయ బడా బాబుల నుండి చెరువులు కుంటలను రక్షించాలని, తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, ఏప్రిల్ మే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య సహకార సంఘాలు చేపల మార్కెట్లలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు అధ్యయనం చేస్తూ ప్రభుత్వ విధానాలపై విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయించింది,మే 15 న జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా ఇంద్రపార్క వద్ద మత్స్యకారులతో మహా ధర్నా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని, మండల జిల్లా స్థాయిలో ఆందోళన చేస్తూ సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది.మే చివరి వారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల పై ఒత్తిడి తీసుకురావడానికి భారీ ఆందోళనలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మమిడ్ల జగదీష్, ఉపాధ్యక్షురాలు దమేర రాజమణి,మత్స్య మహిళా విభాగం జిల్లా కో కన్వీనర్ కర్రెల్లి నవనీత, రమాదేవి,బాగ్యలక్ష్మి, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఎర్వ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మొయినాబాద్ ఏతబార్పల్లి ఫాంహౌస్‌పై పోలీసుల దాడులు

- మొయినాబాద్, రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసుల దాడులు
- ఇద్దరు మహిళలతో సహా మరో 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు



**రాజేంద్రనగర్,ఏప్రిల్9(జనం సాక్షి) :** మొయినాబాద్ మండలం ఏతబార్పల్లిలోని హాలిడే హోమ్ ఫాంహౌస్ నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ వ్యభిచారం నిర్వహిస్తున్న బృందం పై మొయినాబాద్ పోలీసులు,రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు 9-3-25 తేదీన తెల్లవారుజామున మొయినాబాద్ మండలం ఏతబార్పల్లిలోని హాలిడే హోమ్ ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను గుర్తించి 13 మంది పురుషులు అసభ్యకరంగా ప్రవర్తించడం, అర్ధనగ్నంగా 5 మంది మహిళల అశ్లీల నృత్యాలు చేస్తూ కనిపించారు. ఇంకా 5 మంది మహిళలు వ్యభిచారం మానవ అక్రమ రవాణా కోసం హైదరాబాద్ కు చెందిన అబ్దుల్ లుక్మాన్ (12)ఈ పార్టీలో పాల్గొన్నారు. అతని కోరికపై పి.బాబు, రీనా (05) మహిళలను పార్టీకి తీసుకువచ్చారు. ఈ దాడిలో పోలీసులు అబ్దుల్ లుక్మాన్, పి. బాబు, రీనా, ఫైసల్, నిలోఫర్ (10) తో పాటు మరికొందరిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. (05) బాధితులను రక్షించారు. ఈ కేసులో ఫామ్‌హౌస్ యజమానిని కూడా నిందితుడిగా చేర్చారు.పామాన్లో సోదాలు చేయగా సుమారు (70) గ్రాముల గంజాయి,లిక్కర్ ఉపయోగించిన విస్కీ, బీర్స్04, బ్రీజర్స్-10, నగదురూ.19,710, కార్లు 6మొబైల్ ఫోన్లు 18, కండోమ్స్-15, ఓసిడి పేపర్లు 1 ప్యాక్,హుక్కా కుండలు 02 సెట్లు, స్పీకర్ బాక్స్ 1 లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్ లుక్మాన్ తనకు తెలిసిన అడ్డూ అనే వ్యక్తి నుంచి ఈ గంజాయిని సేకరించాడు. పార్టీలో ఎలాంటి అనుమతి లేకుండా మద్యం సేవించారు. వారికి డ్రగ్ టెస్ట్ కిట్‌లను ఉపయోగించగా నెగిటివ్గా వచ్చిందని 29 ఎన్డిపిఎస్ చట్టం, సెక్షన్ 34(ఎ) టిఎస్ ఎక్సైజ్ చట్టం, దానిపై దర్యాప్తు చేసింది. పోలీసులు అబ్దుల్ లుక్మాన్‌తో పాటు ఇద్దరు మహిళలతో సహా మరో 14 మందిని అరెస్టు చేసి కోర్టులో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# మే 18న గచ్చిబౌలిలో వైట్‌థాన్ రన్

- ఈ రన్ ద్వారా సేకరించే నిధులతో పేద పిల్లలకు ఉచితంగా చికిత్స




**హైదరాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణ నిమిత్తం ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మే 18వ తేదీన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లో ఉదయం ఆరు గంటలకు వైట్‌థాన్ 2025 జరగనుంది. అందులో భాగంగా ఆ పోస్టర్‌ను ఈరోజు ఆవిష్కరించారు. ఈ ఏడాది వైట్‌థాన్ అధికారిక మస్కట్ 'పియర్లీ'. రెటినోబ్లాస్టోమా అనేది కంటి క్యాన్సర్. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (ఓఈ యూ) హెడ్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ ఈ రన్ ప్రధాన ఉద్దేశం కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణ అన్నారు. అవగాహన కల్పించడం ద్వారా ప్రాథమిక దశలోనే దీనిని గుర్తించ వచ్చన్నారు. కంటి క్యాన్సర్‌తో పోరాడుతున్న పేద పిల్లలకు ఉచితంగా చికిత్స అందించనున్నామని తెలిపారు. ఈ ఏడాది అధికారిక మస్కట్ 'పియర్లీ' అన్నారు. ఇది కంటిలో 'వైట్ రిఫ్లెక్స్' (ల్యూకోకోరియా)ను ప్రదర్శిస్తుందన్నారు. ఇది రెటినోబ్లాస్టోమా క్యాన్సర్ లక్షణాలలో ఒకటన్నారు. ఓ చిహ్నం రాయబారిగా, వక్తగా, స్నేహితుడిగా, విద్యాదాతగా, ప్రేరేపుకుడి గా అనేక పాత్రలు పోషిస్తుందని తెలిపారు. ఇది వ్యాధి లక్షణాలపై ప్రజల దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు వైద్య సహాయం పొందాలన్న సందేశాన్ని ప్రచారం చేయడంలో సహాయపడుతుందని తెలిపారు. వివిధ ఫిట్‌నెస్ స్థాయిలకు అనుగుణంగా రన్నింగ్ కేటగిరీలు కలవన్నారు. 21కేఎం, 10 కేఎం, 5కేఎం రన్స్‌తో పాటు 5 కేఎం, 3 కేఎం ఫన్ రన్స్ కూడా ఉన్నాయన్నారు. ఈ ఏడాది కొత్తగా పరిచయం చేసిన 21 కేఎం హాఫ్ మ్యారథాన్ ఉందన్నారు. ఇది ఎన్ఎండీసీ హైదరాబాద్ మ్యారథాన్లో పాల్గొనాలనుకునే వారికీ అర్హత కల్పించే రన్‌గా పరిగణించబ డుతుందని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఈ రన్ ద్వారా సమీకరించిన నిధులతో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఉచితంగా మూడు వేలకు పైగా చికిత్సలు చేసిందన్నారు. ఇలాంటి కేసుల్లో 90 శాతం పిల్లల ప్రాణాలు కాపాడగలిగామన్నారు. అయితే, చికిత్సకు ఆలస్యంగా రావడం వల్ల కేవలం 45 శాతం కేసుల్లో మాత్రమే చూపు తేగలిగామన్నారు. ప్రాథమిక దశలలో రెటినోబ్లాస్టోమాను గుర్తించగలిగితే సులభంగా చికిత్స చేయవచ్చని తెలిపారు.



# వైరాలో భద్రాద్రి బ్యాంక్ ప్రారంభం

**వైరా, జనంసాక్షి :** భద్రాద్రి బ్యాంక్ 22వ శాఖను వైరా పట్టణం మెయిన్ రోడ్‌లో బుధవారం ప్రారంభించారు. చైర్మన్ చెరుకూరి కృష్ణ మూర్తి ముఖ్య అతిథి గా పాల్గొని ప్రారంభించారు. స్ట్రాంగ్ రూమ్‌ను వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు.. క్యాష్ కౌంటర్ ను హరిహర సుత అయ్యప్ప క్షేత్రం చైర్మన్ కొప్పురావూరి వెంకటేశ్వరావులు ప్రారంభించారు..ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అంచెల అంచెలగా ఒక్క శాఖతో ప్రారంభం అయ్యి నేడు 22 వ శాఖను ప్రారంభించామ ని 70 వేల మంది ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. బ్యాంక్ సుమారు 1000 కోట్ల టర్నోవర్ కలిగివుందన్నారు. కస్టమర్లకు గృహ వ్యాపార చిన్న తరహా పరిశ్రమలు.. ఎడ్యుకేషన్ మరియు అన్ని రకాల లోన్స్ ఇస్తామని...బ్యాంక్ అన్ని రకాల సేవలను ప్రజలకు అందిస్తుంది అని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిఈఓ దాసరి వేణుగోపాల్, డిజిఎం, ఎల్వివిఎస్ ప్రసాద్, వైస్ చైర్మన్‌లు సన్నే ఉదయ్ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరావు, బ్యాంక్ డైరెక్టర్స్, మేనేజర్‌లు, వైరా పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆర్జేసీకి టీడబ్ల్యూజేఎఫ్ పరామర్శ



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** ప్రముఖ ఎస్‌బిఐటి, ఆర్జెసి విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్జేసి కృష్ణ గత కొంతకాలంగా స్వల్ప అనారోగ్యానికి గురి అయ్యారు. ఈమేరకు ఇటీవల హైదరాబాద్ లోనీ ఒక కార్పోరేట్ వైద్యశాలలో సర్జరీ చేయించుకున్న ఆర్జేసి కృష్ణను బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ నేతలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి సీనియర్ జర్నలిస్ట్, సీనియర్ జిల్లా నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, కూరుకుల గోపి, సివిఆర్ శ్రీనివాస్, ఎగినాటి మాధవ్ చౌదరి, జర్నలిస్ట్ టీవీ నాగేందర్ రెడ్డి, మానుకొండ రవి కిషోర్, షేక్ జానీ పాషా, యాకేష్ సుబాన్, గరిడేపల్లి వెంకటేశ్వర్లులు ఖమ్మంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు ఆర్జెసి కృష్ణ.. వైద్యుల సలహాలతో విశ్రాంతి తీసుకుంటున్న ఆర్ జె సి కృష్ణను ఫెడరేషన్ నేతలు ఆరోగ్య సమాచారాలతో పాటు సర్జరీ చేయించుకున్న వైద్య అంశాల పట్ల ఆయనతో చర్చించా రు. అనంతరం వైద్యుల సలహా మేరకు సమయానికి మాత్రలు వేసుకుంటూ తిరిగి ఆరోగ్యవంతంగా తమ విద్యాసంస్థల విధులను నిర్వహిస్తూ.. విద్యార్థుల భవిష్యత్ కు నిలయమైన విద్యాసంస్థలను గాడిలో పెడుతూ విద్యా ర్థుల భవిష్యత్తుకు బాసటగా నిలవాలని వారు ఆకాంక్షిం చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, తదితరులున్నారు..



## హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

- యువతిని కాపాడిన సిబ్బందిని అభినందించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, ఏప్రిల్ 09 (జనంసాక్షి) : హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ప్రమాదం ఎలా వస్తుందో తెలియని పరిస్థితుల్లో డీఆర్ ఎఫ్ బృందాల అప్రమత్తతతో కొంతమేర నష్టాన్ని తగ్గించగలమన్నారు. మంగళవారం నాడు హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువతిని కాపాడిన హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది మార్షల్ ఫకృద్దీన్, డీఆర్ ఎఫ్ సహాయక సిబ్బంది ఎ. రమేష్, ఎన్. శ్రీనివాస్, ఎండీ ఇమాముద్దీన్, కె. కార్తీక్ కుమార్‌లను కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అభినందించారు. సాగర్‌లోకి దిగడానికి కూడా వీలు లేని చోట తాళ్ల సాయంతో యువతిని సురక్షితంగా కాపాడారన్నారు. గురువారం భారీ వర్షం కురవగా ఒక్కసారిగా వచ్చిన వరదతో మూసీ నదిలో చిక్కుకున్న ఇద్దరిని కాపాడిన డీఆర్ ఎఫ్ సిబ్బందిని కూడా కమిషనర్ అభినందించారు.

# మరింత తగ్గనున్న ఈఎంఐ భారం

- ఆర్‌బిఐ నిర్ణయంపై రియల్టర్ల ఆనందం

హైదరాబాద్, ఏప్రిల్9 (జనంసాక్షి) : రెపోరేటు తగ్గడంతో గృహరుణ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోమారు శుభవార్త చెప్పింది. దీంతో వడ్డీలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. స్తబ్ధుగా ఉన్న రియల్ రంగానికి ఇది బూమ్ ఇస్తుందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో వడ్డీ రేట్లు- తగ్గి గృహ విక్రయాలు పుంజుకుంటాయని రియల్ ఎస్టేట్ సమాఖ్యలు క్రెడాయ్, నరెడ్కో ఆశాభావం వ్యక్తంచేశాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తంచేశాయి. వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి కూడా దన్నుగా నిలుస్తుందని పేర్కొంటున్నాయి. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని బ్యాంకులు ఎంత వేగం అమలుచేసి.. వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయడంపై ఈ ఊరట ఆధారపడి ఉంటుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు-పై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటు-ంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి. ఒకవేళ ఫిబ్రవరి నెల ప్రయోజనాన్ని ఇప్పటికీ బ్యాంకులు తగ్గించకపోతే మే నెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఆర్‌బిఐ వరుసగా రెండోసారి కూడా రెపో రేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇలా వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాది ఇది రెండోసారి. ఫిబ్రవరి 7న కూడా 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు భవిష్యత్‌లో మరిన్ని కోతలు ఉండే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఎన్నాళ్లగానో ఈఎంఐ భారం మోస్తున్న గృహరుణ వినియోగదారులకు మరోమారు ఊరట కలిగిందనే చెప్పాలి. ఎవరైతే ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకొని ఉంటారో వారికి ఈఎంఐ తగ్గనుంది. ముఖ్యంగా 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి ఆ మేర బ్యాంకులు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెండు దఫాల్లో ఇప్పటివరకు 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఆ మేర ఈఎంఐ తగ్గుతుంది.



# కేసీఆర్ హయాంలోనే ఎంతో అభివృద్ధి, సంక్షేమం

- కాళేశ్వరం వృథా ప్రాజెక్ట్ అంటూ దుష్ప్రచారం
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నష్టపోతున్న రైతులు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శలు



నిజామాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) : రైతు సంక్షేమం కోసం కేసీఆర్ అధికారంలో ఉండగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసారని నిజామాబాద్ జిల్లాకు చెందిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేసిన ఘతన కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా కాంగ్రెస్ ముందుకు సాగడంతో దౌర్భాగ్యం నెలకొందని అన్నారు. బుధవారం నాడిక్కడ మాట్లాడుతూ..రైతులను ఆదుకునేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అన్నారు. ధాన్యం పండించిన రైతులను ఆదుకోని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో చేపట్టిన రైతు సంక్షేమకార్యక్రమాల వల్ల ధాన్యం దిగుబడులు పెరిగాయన్నారు. కానీ ఇప్పుడు పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరంను వృథా ప్రాజెక్టుగా చూపి పబ్బం గడుపుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రెలు పంపిణీ చేశారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులను ఆదుకున్నామని అన్నారు. ఇలా కులవృత్తులను ఆదుకున్న ఘనత బిఆర్‌ఎస్‌దని అన్నారు.అన్ని వర్గల సంక్షేమం కోసం బిఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు చేసి అమలు చేశారని వివరించారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ లో నింపి అక్కడి నుంచి వివిధ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించారని అన్నారు. ఇలా చేయడం వల్లనే ధాన్యం దిగుబులు పెరిగాయన్నారు. ఇప్పటికే తమ ఆందోళనతలో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరికి ప్రజలు,రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# విభజన సమస్యలపై కేంద్రం దృష్టి

- ఆయా శాఖలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్9 (జనంసాక్షి) : విభజన సమస్యలకు మెల్లగా పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆయా సమస్యలపై కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అనేక అంశాలపై చర్చలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు- విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని.. దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతి ఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.

## బిసి గురుకుల విద్యార్థులకు
# సెయిలింగ్ శిక్షణ

- గురుకులాల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) : విద్యార్థుల్లో చదువుతో పాటు వారి ఆసక్తిని గమనించి అనుగుణంగా అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో భాగంగా బీసీ గురుకుల విద్యార్థులకు సెయిలింగ్ క్రీడ ద్వారా శాస్త్రీయ శిక్షణతో పాటు నీటిలో నైపుణ్యం, సహనం, చురుకుదనం వంటి లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో యాచ్ క్లబ్ ఆద్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బేసిక్ ఫౌండేషన్ కోర్సుకు అర్హత సాధిస్తారు. బేసిక్ కోర్సులో అర్హత పొందిన వారికి మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు- వారు జాతీయ, అంతర్జాతీయ సెయిలింగ్ పోటీ-ల్లో పాల్గొన్నే నైపుణ్యం వస్తుంది. 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్ , 2028 జరిగే ఒలింపిక్స్ లో పాల్గొనే అవకాశం ఉంటుందని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న 14 ఏండ్ల లోపు వయసు గల విద్యార్థులలో ఆసక్తి గలవారిని ఈ శిక్షణకు ఎంపిక చేశామని, బాలురు 32, బాలికలు 19మంది శిక్షణకు హాజరు అవుతున్నారని ఆయన తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 11 తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, బేసిక్ శిక్షణ పూర్తి చేసిన వారిలో బెస్ట్ అనిపించిన వారికి నెక్స్ట్ లెవల్ ట్రైనింగ్ ఉంటుదని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని ఆయన వివరించారు.

# జల్‌పల్లి నివాసం ముందు మనోజ్ బైఠాయింపు

- ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసుల మొహరింపు
- ఆస్తి పంచాయితీ కాదంటున్న మంచు మనోజ్



హైదరాబాద్, ఏప్రిల్9 (జనంసాక్షి) : నటుడు మోహన్‌బాబు కుటుంబం మరోమారు రోడ్డున పడింది. సొంత గొడవలతో పోలీస్ స్టేషన్ ఎక్కిన తనయులు తాజాగా మరో వివాదంతో ముందుకు వచ్చారు. ఇలా తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసి,ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా అని మనోజ్ చెప్పారు. పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీ-పై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండని మనోజ్ విజ్ఞప్తి చేశారు. నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడక్షన్‌లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీ-గా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా అని మనోజ్ వ్యాఖ్యానించారు.కారు చోరీపై నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వగా అది విష్ణు ఇంట్లో ఉన్నట్లు- గుర్తించారు. రికవరీకి వెళ్లినప్పుడు దాన్ని మాదాపూర్‌కు పంపించారని మనోజ్ మీడియాతో చెప్పారు. ఈక్రమంలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు-చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# ధైర్యంగా ఉండు.. లిటిల్ వారియర్

- జూనియర్ ఎన్టీఆర్ పోస్ట్



హైదరాబాద్, ఏప్రిల్9 (జనంసాక్షి) : పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ సింగపూర్‌లోని స్కూల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గాయపడి కోలుకుంటున్నాడు. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ఘటనపై ఇప్పటికే పలువురు రాజకీయ నేతలతో పాటు- పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలుపుతున్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఈ ఘటనపై స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ కుమారుడు గాయపడిన విషయం తెలిసి తాను ఎంతో బాధపడినట్లు తెలిపారు. చిన్నారి మార్క్ శంకర్ త్వరగా ఆరోగ్యం పొందాలని ఎక్స్ వేదిక ద్వారా తారక్ కోరుకున్నారు. 'ధైర్యంగా ఉండు లిటిల్ వారియర్' అంటూ ఒక పోస్ట్‌ను షేర్ చేశారు.

# యోగితో కన్నప్ప బృందం భేటీ

- జూన్ 27న కన్నప్పను రిలీజ్ ప్రకటించిన మంచు విష్ణు



లక్నో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) : మంచు విష్ణు తాను నటించిన కన్నప్ప కొత్త సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించారు. ఏప్రిల్ 25కు రావాల్సిన మూవీని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్త రిలీజ్ డేట్ పై సస్పెన్స్ నెలకొంది. తాజాగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను మంచు మోహన్ బాబు, విష్ణు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం యోగికి శ్రీరాముడి ప్రతిమ బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు కన్నప్ప కొత్త రిలీజ్ డేట్ ను కూడా ప్రకటించారు. ఈ రిలీజ్ డేట్ పోస్టర్ ను సీఎం యోగి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జూన్ 27న కన్నప్పను రిలీజ్ చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే ప్రమోషన్లు పెంచుతామన్నారు. దీంతో ఈ విషయం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఓ వైపు మంచు మనోజ్ జల్ పల్లిలోని ఇంటి వద్ద ధర్నా చేస్తున్నాడు. తన వస్తువులు అన్నీ విష్ణు ఎత్తుకెళ్లాడు అంటూ కేసు కూడా పెట్టాడు. ప్రెస్‌మీట్ పెట్టి విష్ణుపై చాలా ఆరోపణలు చేస్తున్నాడు. అటు- మనోజ్ అంత రచ్చ చేస్తున్న -టైమ్ లోనే.. ఇటు- విష్ణు కన్నప్ప రిలీజ్ డేట్ ను ప్రకటించారు. కన్నప్ప సినిమాలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో పాటు- అక్షయ్ కుమార్, కాజల్ నటించడంతో భారీ హైప్ క్రియేట్ అయింది. ఇందులో కన్నప్ప పాత్రలో విష్ణు నటించారు. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, టీ-జర్ ఆకట్టు-కున్నాయి. ఏప్రిల్ 25కే రావాల్సిన సినిమాను.. వీఎఫ్ ఎక్స్ పనుల వల్ల వాయిదా వేసినట్టు- విష్ణు తెలిపారు.

# సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం

- సైబర్ ఫ్రాడ్ నేరాలపై ప్రత్యేక దృష్టి
- పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీమ్
- డీజీపీ జితేందర్ వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్9 (జనంసాక్షి) : వాణిజ్య రంగంలో మారుతున్న సవాళ్లకు తగిన విధంగా స్పందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ముందడుగు వేస్తోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ నేరాలను అరికట్టేందుకు ఐజీ ర్యాంక్ అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీ-మ్‌ను ఏర్పాటు చేయడం, వారి ప్రయాణ సౌకర్యార్థం షీ షటిల్ బస్సులు అందుబాటులోకి తేవడం వంటి చర్యలను వివరించారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మెరుగైన పోలీస్ నిఘా , ప్రజా భద్రతపై రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంకేతిక పోలీసింగ్, సైబర్ భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భద్రతా సహకారంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య భద్రత విషయంలో అంతరాన్ని తగ్గించడమే ఈ సమావేశ ఉద్దేశం అన్నారు. పరిశ్రమల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖకు రూ.800 కోట్లు మంజూరు చేసినట్లు- జితేందర్ తెలిపారు. 100 డయల్ సేవలు మెరుగు పడటంతోపాటు పోలీస్ పనితీరు దేశంలోనే కాక, అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి పోలీస్ భద్రతపై ఆధారపడి ఉంది. శాంతి భద్రతలను కాపాడడంలో మా బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ సమావేశం వాణిజ్య, పరిశ్రమల రంగం నుంచి విశేష స్పందన పొందింది. భద్రత , నిఘాపై ప్రభుత్వ నిర్ణయాలు పరిశ్రమల విశ్వాసాన్ని పెంచుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370